వీక్షణం

ఆర్థిక, సామాజిక పక్షపత్రిక

సంపుటి: 1 సంచిక: 3
డిసెంబర్ 1-31, 2003

సమతా పబ్లికేషన్స్ ప్రచురణ

పేజీలు : 48
వెల: రూ.10-00

ప్రత్యేక సంచిక



ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వ్యూహాలు

● అపర్ణ ● వి.హనుమంతరావు ● ప్రొఫెసర్ చక్రధర్‌రావు ● ఎన్.శ్రీదేవి ● డా॥ సి.రామచంద్రయ్య
● డా॥ ఎమ్.గంగాధర్ ● ఎన్.వేణుగోపాల్ ● సారంపల్లి మల్లారెడ్డి ● డా॥ డి.నరసింహారెడ్డి
● కాత్యాయని ● ఇంజనీర్ టి.హనుమంతరావు ● ఎమ్.వేణుగోపాలరావు

వీక్షణం

-సంపాదకీయం...

గౌరవ సంపాదకులు :
ఎ.బి.కె ప్రసాద్
సంపాదకులు :
వి.హనుమంతరావు
సలహా మండలి :
ప్రొ॥ ఆర్.వి.ఆర్.చంద్రశేఖరరావు
ప్రొ॥ వకుళాభరణం రామకృష్ణ
ప్రొ. చక్రధర రావు
కాత్యాయని
బి.సాంబశివరాజు
ఇప్ప వీరారెడ్డి
ఎస్.వేణుగోపాల్

లోపలి పేజీల్లో...

విడిప్రతి : రూ. 10=00
వార్షిక చందా : రూ॥ 120=00

అభివృద్ధికి సమగ్ర, శాస్త్రీయ నిర్వచనం కావాలి

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఇవాళ ప్రధాన చర్చనీయాంశంగా మారింది. అభివృద్ధి గురించి మాట్లాడని రాజకీయ పక్షం, బుద్ధిజీవుల బృందం ఒక్కటి కూడా లేనంతగా అభివృద్ధి చర్చల్లో నలుగుతున్నది. అసలు అభివృద్ధి అంటే ఏమిటో నిర్వచించుకోకుండానే అభివృద్ధి మంత్రజపం చేసేవాళ్ల నుంచి అభివృద్ధి వెలుగునీడలను విశ్లేషించుకుంటూ నీడలు రద్దై వెలుగు విస్తరించాలని కోరుకునే వాళ్ల వరకు ఎందరెందరో ఈ చర్చల్లో పాల్గొంటున్నారు. మొత్తం మీద అభివృద్ధి అనే భావన రాజకీయ రహితమైన భావన కాదని మన సైద్ధాంతిక దృక్పథాలే అభివృద్ధిని నిర్వచిస్తాయని తేటతెల్లమైపోతున్నది. మనం సమాజంలోని వివిధ సామాజిక బృందాలలో ఏదో ఒక బృందం అభివృద్ధిని కోరుకుని అమలు చేస్తూ దాన్నే సామాజిక అభివృద్ధిగా ప్రచారం చేయడం కూడా జరుగుతున్నది. సహజంగానే అన్ని వనరులు తమ చేతుల్లో ఉన్న పాలకపక్షాలు అన్ని రకాల ప్రచార ప్రసార సాధనాల్ని వినియోగించుకొని తమ అభివృద్ధి నమూనాని ఏకైక అసలైన అభివృద్ధి నమూనాగా ప్రచారం చేస్తున్నాయి.

ఇంతకీ అభివృద్ధి అనే మాటని ఎట్లా అర్థం చేసుకోవాలి. తలసరి ఆదాయం వంటి సగటు సూచికలు విశ్వసనీయమైనవి కావు. తొంభైతొమ్మిది మంది నిరుపేదలకు, ఒక కోటీశ్వరుడిని కలిపి సగటు తలసరి సంపద లక్ష రూపాయలుగా చెప్తే ఈ అసమగ్ర సూచికనే ఇంకా మన పాలకులు పాడుకుంటూ ప్రజలను వంచిస్తున్నారు. ఆ స్థానంలో విద్య, వైద్య, ఆరోగ్యాలు, త్రాగునీటి సౌకర్యాలు వంటి అనేక ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని మానవాభివృద్ధి సూచికను ప్రణాళికా సంఘం తయారుచేసింది. ఆ సూచికలో కూడా లోపాలు అసమగ్రతలు ఉన్నప్పటికి ఆ సూచికలో ఆంధ్రప్రదేశ్ స్థాయి అట్టడుగున ఉన్నది.

అభివృద్ధి అంటే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదల, అవకాశాలు అందడంలో సమానత్వం, ఆహారం, ఆశ్రయం, గౌరవప్రదమైన జీవనం, ఉపాధి, వినోద అవకాశాలు, ఆహ్లాదకరమైన పర్యావరణం, ఎక్కువ ఆయుఃప్రమాణానికి వీలుకల్పించే వైద్య ఆరోగ్య సేవలు, మంచి రవాణా, సమాచార వ్యవస్థలు వంటి ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు మాత్రమే అభివృద్ధి గురించి చర్చించడానికి వీలు కలుగుతున్నది. ఇవన్నీ గుణాత్మకమైన అంశాలు తప్ప అంకెల గారడీలతో తెల్పగలిగేవి కావు. ఇవాళ జరుగుతున్న చర్చంతా అంకెల గారడీల చుట్టూ తిరుగుతున్నది గాని నిజంగా ప్రజల అవసరాలు ఆకాంక్షలు, అవి తీరే మార్గాలు, జాతి సంపద, జాతీయ ప్రయోజనాలు చేకూర్చే పద్ధతులు, స్వావలంబన, ఆత్మగౌరవం వంటి అంశాల ప్రాతిపదిక మీద జరగడం లేదు.

అటువంటి సమగ్ర చర్చ జరగవలసిన అవసరాన్ని గుర్తిస్తూ ఆలోచనాపరుల చేత గుర్తింపచేయడానికి ప్రయత్నిస్తూ ఈ సంచిక ద్వారా జరుగుతున్న చర్చలో భాగం పంచుకోదలుచుకుంటున్నాం. 2004 శాసనసభ ఎన్నికలలో అభివృద్ధి ప్రధాన చర్చనీయాంశం కనుక ఆ చర్చకు మేధోపరమైన దోహదం చేసే ప్రయత్నం ఇది. ○

ఊహల్లో స్వర్ణాంధ్ర - వాస్తవంలో (దా)రుణాంధ్ర

- అపర్ణ

రుణబాధ, రణబాధ అన్నారు. దొరికిన చోటల్లా అప్పులు చేసి బతికేయటం కొందరికి అతి సాధారణమైన విషయం. అయితే వాళ్లల్లో కూడా అవసరమొచ్చినప్పుడు విధి లేక అప్పుచేసే వాళ్లు కొందరయితే, జల్సాగా బతికేయడానికో, మరే ఇతర అనవసర ఖర్చులకో అప్పుచేసే వాళ్లు మరికొందరుంటారు. మొదటి రకంవాళ్లు కాలూ చెయ్యి కూడా దీసుకొని అప్పు వాయిదాల మీద తీర్చేస్తే, రెండో రకం వాళ్లు బాధ్యతారహితంగా ప్రవర్తిస్తారు. ఇలాంటి వారి కోవలోకి మన రాష్ట్ర ముఖ్యమంత్రిని చేర్చవచ్చు. ఈయనది ఇంకా ముదురుకేసు. అధికారంలోకి రావటంతోనే ప్రజలు మోయగలుగుతారా లేదా అని చూడకుండా భారాలు వేసి అదనపు వనరులు సేకరించటం, మరో పక్కనుంచి రుణాలు చేయటం, మూడో పక్క హద్దు మీరి అభివృద్ధి పేరుతో, విచ్చలవిడిగా ఖర్చుచేయటం ప్రారంభించారు. లోటు తీర్చడానికి రుణం, ప్రణాళిక అమలుకు రుణం, రోజువారీ ఖర్చుకు రుణం, ఆఖరుకు రుణం, వడ్డీ చెల్లించడానికి రుణం– ఇదీ సువర్ణాంధ్రకు మన ముఖ్యమంత్రి వేస్తున్నబాట. ఒకపక్క వనరులు పెంచుకొంటూనే, మరోపక్క రుణాలు చేస్తేనే గాని రోజూ గడవని పరిస్థితి- ఇదీ సుపరిపాలన రూపురేఖలు. ఆదాయానికి, వ్యయానికి పొంతన కుదరనప్పుడు అప్పు చేయాల్సివస్తుంది. కాగా ముందు మన ఆదాయ, వ్యయాలేమిటో చూద్దాం.

రెవిన్యూ ఆదాయం:

గత 20ఏళ్ళగా రాష్ట్ర రెవెన్యూ రాబడులు చూస్తే 1983-84సం॥లో రాష్ట్రం మొత్తం రెవెన్యూ రాబడి రూ.1953.36కోట్లు వుండగా క్రమేణా పెరిగి 1988-89సం॥లో రూ.4279.03కోట్లకు పెరిగింది. అంటే నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రిగా వున్న కాలంలో రెవెన్యూ రాబడి 16.24శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. తరువాత కాంగ్రెసు ప్రభుత్వాదాయంలో రాష్ట్ర రెవెన్యూ రాబడి 1989-90సం॥లో రూ.4476.89కోట్లు వుండగా 1994-95నాటికి రూ.8786.38కోట్లుకు పెరిగి 14.72శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. ఇక నందమూరి తారకరామారావుని త్రోసిరాజని చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టిన తరువాత చూస్తే రాష్ట్ర రెవెన్యూ రాబడి 1995-96సం॥లో రూ.9874.89కోట్లు వుండగా క్రమేణా పెరిగి 2001-02సం॥లో రూ.21845.05కోట్లుకు పెరిగింది. 27.98శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. 2003-04 (2000) వరకు చూస్తే 20.32శాతం రెవెన్యూ రాబడి అభివృద్ధి రేటు నమోదు కాబోతుంది.

రెవెన్యూ వ్యయం:

ఇక రాష్ట్ర రెవెన్యూ వ్యయ గణాంకాలు చూస్తే రాష్ట్ర రెవెన్యూ వ్యయం (ప్రకృతి వైపరీత్యాల కోసం చేసిన ఖర్చు మినహాయిస్తే) 1983-84సం॥లో రూ.1958.97కోట్లు వుండగా అది క్రమేణా 1988-89సం॥లో రూ.4218.02కోట్లుకు చేరి 15.27శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. (అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో) ఇక కాంగ్రెసు ప్రభుత్వ హయాంలో రాష్ట్ర రెవెన్యూ ఖర్చు (ప్రకృతి వైపరీత్యాల కింద చేసిన ఖర్చు మినహాయిస్తే) 1989-90సం॥లో రూ.4610.68కోట్లు వుండగా క్రమేణా పెరిగి 1994-95నాటికి రూ.9443.23కోట్లుకు పెరిగి 14.92శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. ఇక చంద్రబాబు అధికార పగ్గాలు చేపట్టిన తరువాత 1995-96లో రాష్ట్ర రెవెన్యూ వ్యయం రూ.10459.73కోట్లు నుండి 2001-02సం॥లో రూ.24433.59కోట్లుకు పెరిగి 14.21శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. అదే 2003-04 (2000)సంవత్సరం వరకు చూస్తే రాష్ట్ర రెవెన్యూ వ్యయం మొత్తంమీద 13.70శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది.

అభివృద్ధి, ఖర్చులు:

రెవెన్యూ వ్యయం రెండు రకాలుగా విభజించవచ్చును. ఒకటి అభివృద్ధి వ్యయం రెండవది అభివృద్ధేతర వ్యయం. అభివృద్ధి వ్యయ గణాంకాలు చూస్తే ఎన్‌టిఆర్ హయాంలో 1983-84సం॥లో అభివృద్ధి వ్యయం రూ.1470.20కోట్లు వుండగా అంచలంచెలుగా పెరిగి 1988-89సం॥లో రూ.3127.78కోట్లుకు చేరి 15.02శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. 1989-90సం॥లో అభివృద్ధి వ్యయం (రెవెన్యూ పద్దు కింద) రూ.3300.07కోట్లు నుంచి 1994-95సం॥లో రూ.6307.74కోట్లుకు పెరిగి 13.32శాతం కాంపౌండ్ అభివృద్ధిరేటు నమోదయింది. ఇక నారా చంద్రబాబు హయాంలో అభివృద్ధి వ్యయం (రెవెన్యూ పద్దు కింద) 1995-96సం॥లో రూ.6845.30కోట్లు వుండగా (1997-98సంవత్సరం మినహాయిస్తే) 2001-02సంవత్సరంలో రూ.14909.93కోట్లుకు పెరిగి 12.05శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. మొత్తంమీద

1995-96 నుండి 2003-04(20.60)సంవత్సరం వరకు ఈ అభివృద్ధి వ్యయంలో అభివృద్ధి రేటు 11.53శాతం మాత్రమే. అనగా అభివృద్ధి వ్యయంలో అభివృద్ధి రేటు నందమూరి తారకరామారావు హయాంలోనే ఎక్కువగా వున్నట్లు కానవస్తోంది.

అభివృద్ధేతర ఖర్చు:

ఇక అభివృద్ధేతర వ్యయ గణాంకాలు చూస్తే 1983-84సంవత్సరంలో రాష్ట్రంలో రెవెన్యూ పద్దు క్రింద అభివృద్ధేతర వ్యయం రూ.488.77కోట్లు వుండగా క్రమేణా పెరిగి 88.89సంవత్సరంలో రూ.1090.24కోట్లకు పెరిగి 16శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. కాంగ్రెసు ప్రభుత్వ హయాంలో 1989-90సంవత్సరంలో అభివృద్ధేతర వ్యయం రూ.1310.61కోట్లు నుండి 1994-95సంవత్సరంలో రూ.3135.49కోట్లుకు పెరిగి 18.92శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అభివృద్ధేతర వ్యయం 1995-96సంవత్సరంలో రూ.3614.43కోట్లు వుండగా 2001-02సంవత్సరంలో రూ.9523.66కోట్లుకు చేరి మొత్తంమీద 1995-96 నుండి 2001-02సంవత్సరం వరకు 18.31శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. 1995-96 నుండి 2003-04(20.60)సంవత్సరం వరకు రాష్ట్ర అభివృద్ధి వ్యయంలో రెవెన్యూ పద్దు క్రింద 17.62శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదు కానవస్తోంది.

మొత్తంమీద రాష్ట్ర రెవెన్యూ వ్యయంలో (ప్రకృతి వైపరీత్యాల క్రింద జరిపిన ఖర్చు మినహా ఇస్తే) అభివృద్ధి వ్యయం మొదటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో 74శాతం నుండి 75.3శాతం వుండగా, కాంగ్రెసు పార్టీ ప్రభుత్వ హయాంలో 67శాతం నుండి 72.2శాతం వుంది. చంద్రబాబు హయాంలో 1995-96 నుండి 2003-04సంవత్సరం మధ్య 58.5శాతం నుండి 70.3శాతం నమోదయిందంటే చంద్రబాబు హయాంలోనే అభివృద్ధేతర వ్యయం ఎక్కువగా వున్నట్లు తెలుస్తుది. అనగా అధికార గణాంకాల ప్రకారమే అసలు, వడ్డీ చెల్లింపులు పద్దు క్రింద పరిపాలనా పద్దు క్రింద వ్యయం చంద్రబాబు హయాంలోనే ఎక్కువన్న మాట.

రెవెన్యూ లోటు:

నందమూరి తారకరామారావు పాలనాకాలంలో ప్రభుత్వ రెవెన్యూ లోటు 88.57కోట్లు ఉంది. (1985-86 సంవత్సరం మినహాయిస్తే) ఈ లోటు 1986-87 సంవత్సరంలో 188.45కోట్లుకు పెరిగినా 1987-88, 1988-89సంవత్సరంలో రెవెన్యూ పద్దు క్రింద మిగులు బడ్జెట్ నమోదయింది. తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెసు ప్రభుత్వ హయాంలో రెవెన్యూ లోటు 238.23కోట్లు నుంచి (1993-94సంవత్సరంలో మిగులుబడ్జెట్ ప్రవేశపెట్టినా) 727.74కోట్లుకు పెరిగింది. చంద్రబాబు హయాం అంతా లోటుబడ్జెట్ వ్యవహారమే నడుస్తోంది. ఈ లోటు ఈ పూడ్చుకోటానికే కాని, అభివృద్ధి పనులు పేరుతోగాని, ఖర్చును అదుపులో పెట్టలేకపోవటం వల్ల కాని చంద్రబాబునాయుడు ప్రభుత్వం అప్పుల బాటలో పయనిస్తోంది. ప్రపంచ బ్యాంకు నుండి కూడా అప్పుల సేకరణలో ముందంజలోనే వుంది.

ఋణభారం:

భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర సంచిత నిధి (కన్సాలిడేటెడ్ ఫండ్) హామీగా రాష్ట్ర ప్రభుత్వం దేశంలో అంతర్గత ఋణాలు పొందే సదుపాయం వుంది. దీనికి సంబంధించిన గరిష్ట పరిమితులను శాసనసభ ఎప్పటికప్పుడు చట్టాల ద్వారా విధించవచ్చు. అయితే అటువంటి పరిమితుల్ని విధించే చట్టాన్ని కొన్ని రాష్ట్రాల శాసనసభలు విధించుకొన్నా, మన శాసనసభ ఇంతవరకు చేయలేదు. ఇక అసలు విషయానికి వస్తే అప్పులు రాష్ట్ర ప్రభుత్వానికి మూడురకాలుగా లభిస్తాయి. అవి కేంద్రం నుండి లభించే ఋణాలు, మార్కెటు ఋణాలు, స్వయంపాలక సంస్థల నుండి లభించే ఋణాలు. ఈ మూడు కాక ప్రభుత్వం భవిష్య నిధి నుండి కూడా ఋణాలు తీసుకొంటుంది. కేంద్ర ప్రభుత్వం నుండి లభించే ఋణాలలో రాష్ట్రం ప్రపంచ బాంకు నుండి, ఇతర అంతర్జాతీయ సహాయ ఆర్థిక సంస్థల నుండి తీసుకునే ఋణాలు మిళితమై వుంటాయి. అనగా విదేశీ ఋణాలు కూడా కేంద్రప్రభుత్వం ద్వారానే రాష్ట్రానికి లభిస్తాయన్నమాట.

మన రాష్ట్రం అవతరించిన నాటినుండి 1994-95 సంవత్సరం వరకు రాష్ట్రం చేసిన ఋణం రూ.13005కోట్లు వుండగా ప్రస్తుత ముఖ్యమంత్రి హయాంలో 2003-04సంవత్సరం బడ్జెట్ అంచనాల ప్రకారం రాష్ట్రం తీర్చవలసిన మొత్తం అప్పు రూ.57141కోట్లు; అంటే తొమ్మిది సంవత్సరాల్లో రూ.44136కోట్లు అప్పులు పెరిగాయన్న మాట. రాష్ట్రం తీర్చవలసిన మొత్తం అప్పులో 1994-95సంవత్సరంలో అంతర్గత అప్పు రూ.3329కోట్లు వుండగా 2003-04సంవత్సరం(బడ్జెట్ అంచనాల) ప్రకారం రూ.21922కోట్లుకు పెరిగింది. బహిరంగ మార్కెటు ఋణాలు కాంగ్రెసు పార్టీ అధికారంలో రూ.1357కోట్లు నుండి 1994-95లో రూ.3046కోట్లు వరకు అంటే 17.61శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదు కాగా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి మార్కెటు ఋణం రూ.15556కోట్లు వరకు, అంటే కాంపౌండ్ అభివృద్ధి రేటు 21.69శాతంగా నమోదయింది. అనగా మార్కెటు ఋణాల ద్వారా రాష్ట్రప్రభుత్వం అప్పులు అధికమయ్యాయన్నమాట.

ఇక కేంద్ర ప్రభుత్వం నుండి తీసుకొన్న నికరఋణాలు 1989-90 చివరికి మొత్తం రూ.3774.29కోట్లు, 1994-95 అంతానికి రూ.8342కోట్లు, 1995-96సంవత్సరంలో రూ.9675కోట్లుగా వుంది. 2003-04సంవత్సరంలో బడ్జెట్ అంచనాల ప్రకారం ఈ సమాచారం మొత్తం రూ.22301కోట్లు.

మొత్తం ఈ తొమ్మిది సంవత్సరాల కాలంలో రుణం 11.20శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. గమనించవలసినదేమంటే మొత్తం రాష్ట్ర రుణంలో కేంద్రం నుండి లభించే రుణాలు 1989-90లో 64.3శాతం వుండగా 1994-95సంవత్సరంలో కూడా దాదాపు అంతేశాతం వుండగా 1995-96 నుండి 2003-04(బ.అం) వరకు క్రమక్రమేణా తగ్గుతూ 2003-04సంవత్సరంలో రాష్ట్ర మొత్తం రుణంలో 39శాతమే వుందని గణాంకాలు తెలియచేస్తున్నాయి. మొత్తం రాష్ట్ర రుణంలో 1989-90లో మార్కెటు రుణాలు 23.1శాతం వుండగా ఇదే శాతం 1997-98సంవత్సరం వరకు కొనసాగి, 2003-04 సంవత్సరంలో 27.3శాతానికి పెరుగుతాయని అంచనా.

భవిష్యనిధి నుండి రాష్ట్రప్రభుత్వం అభివృద్ధి అవసరాలకు రుణం సేకరిస్తుంది. 1989-90సంవత్సరంలో భవిష్యనిధి పద్దు కింద రుణం రూ.594కోట్లు వుండగా 1994-95సంవత్సరం నాటికి రూ.1334కోట్లుకు పెరిగి 17.43శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. 1995-96సంవత్సరంలో ఈ పద్దు క్రింద రుణం రూ.1600కోట్లు వుండగా క్రమక్రమేణా పెరిగి 2003-04సంవత్సరం బడ్జెటు అంచనాల ప్రకారం రూ.12918కోట్లకు పెరుగుతుందని అంచనా. ఈ తొమ్మిది సంవత్సరాలలో తెలుగుదేశం పార్టీ పాలనలో భవిష్యనిధి నుండి చేసిన అప్పు 32.61శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయింది. అనగా భవిష్యనిధి నుండి రుణసేకరణలు అధికమవుతున్నట్లుగా గోచరిస్తోంది.

గమనించవలసినదేమంటే మొత్తం రుణంలో భవిష్యనిధి శాతం 1989-90 నుండి 1998-99సంవత్సరం వరకు దాదాపు 11శాతంలోపు వుండగా 1999-2000సంవత్సరం నుంచి క్రమేణా ఈ శాతం పెరుగుతూ 2003-04బడ్జెట్ అంచనాల ప్రకారం 22.6శాతంగా వుంది.

మొత్తం రుణం 1989-90 నుండి 1994-95 వరకు 17.30శాతం కాంపౌండ్ అభివృద్ధిరేటు నమోదుకాగా 1995-96 నుండి 2003-04 వరకు 18.95శాతం కాంపౌండ్ అభివృద్ధి రేటు నమోదయిందంటే ఇప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే రాష్ట్రం ఎక్కువ అప్పుల ఊబిలో కూరుకుపోయినట్లు గోచరిస్తోంది. స్వర్ణాంధ్రప్రదేశ్ మాటేమోకాని రుణాంధ్రప్రదేశ్‌గా మారిపోతుంది. రాష్ట్ర ఆర్థికశాఖామాత్యులు కాకుండా అర్థశాస్త్ర కోవిదుడైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రుణభారం తగ్గించేందుకు చర్యలు తీసుకోకపోగా "అప్పులు చేస్తాం! ఇంకా అప్పులు చేస్తాం! రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం. ఇంకా 40ఏళ్ళు రాష్ట్రాన్ని పాలిస్తాం" అని చెప్పటం ప్రజలను మభ్య పెట్టేలా వుంది. ఇప్పటికే తలసరి రుణభారం (గ్యారంటీలు కలుపుకోకుండా) రూ.7548లు వుంది.

స్థూల రాష్ట్రాదాయంలో రుణాల నిష్పత్తి కనుక పెరిగితే రాష్ట్రంలో రుణభారం ఎక్కువని గమనించాలి. 1993-94సంవత్సరం నుండి స్థూల రాష్ట్ర ఆదాయం గణాంకాలు (జిఎస్‌డిపి) లభ్యమవుతున్నాయి. 1993-94సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తికి రుణాల నిష్పత్తి 0.19 వుండగా 1996-97సంవత్సరం వరకు ఇదే నిష్పత్తి కొనసాగినా 1997-98, 1998-99సంవత్సరాలలో 0.21కి చేరుకొని, తరువాత క్రమేణా పెరిగి 2001-02సంవత్సరంలో 0.28కి చేరిందంటే రుణభారం అధికమయినట్లే.

విదేశీరుణం

రాష్ట్రంలో విదేశీరుణం సహాయంతో కొన్ని ప్రాజెక్టులు చేపట్టడం జరుగుతోంది. మొత్తం ప్రాజెక్టులు 14 వుండగా ప్రపంచ బ్యాంకు సహాయంతో ఎనిమిది ప్రాజెక్టులు అమలు జరపడం జరుగుతోంది. అవి ఎ.పి. స్టేట్ హైవేస్ ప్రోజెక్ట్ (10/27 నుండి 1/04 వరకు), ఎ.పి. పవర్ రీస్ట్రక్చరింగ్ ప్రోజెక్ట్ (3/99 నుండి 12/03 వరకు), నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ (3/95 నుండి 12/03 వరకు) ఎ.పి.3 ఇరిగేషన్ ప్రోజెక్ట్ (6/27 నుండి 7/04 వరకు), డిపిఐపి (5/00 నుండి 6/05 వరకు), ఎ.పి.ఆర్.ఆర్.ఆర్.పి. (2/03 నుండి 3/08 వరకు), ఎ.పి.ఫారెస్ట్రీ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ (10/02 నుండి 3/07 వరకు), ఎ.పి.ఎకనామిక్ రీస్ట్రక్చరింగ్ ప్రోజెక్ట్ (2/99 నుండి 3/04 వరకు) (బ్రాకెట్లలో అంకెలు ప్రాజెక్టు ప్రారంభకాలం, పూర్తి చేయాల్సినకాలం) అమలు చేయబడటం జరుగుతోంది. మొత్తం ఈ ఎనిమిది ప్రాజెక్టులకు కలిపి పెట్టుబడి రూ.11254కోట్లు వుంటుందని అంచనా. ఇందులో రుణం ఇచ్చే సంస్థ వాటా రూ.8524కోట్లు, రాష్ట్రప్రభుత్వం వాటా రూ.2730కోట్లు కాగా సెప్టెంబరు 2003 వరకు చేసిన మొత్తం వ్యయం రూ.7244కోట్లు. అనగా 64.4 మేరకే ఖర్చుచేయడం జరిగింది.

జపాన్ బ్యాంక్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్ సహాయంతో రెండు ప్రాజెక్టులు చేపట్టడం జరిగింది. అవి కె.సి.కెనాల్ ఆధునికీకరణ (1/96 నుండి 2/05 వరకు), సింహాద్రి వైజాగ్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టు(12/97 నుండి 8/09 వరకు). ఈ రెండు ప్రాజెక్టులకు కలిపి అయ్యే ఖర్చు అంచనా రూ.1843కోట్లు కాగా ఇందులో దాత ఖర్చు (డోనార్ ఖర్చు) రూ.1627కోట్లు, రాష్ట్రం వాటా రూ.216కోట్లు. ఈ ప్రాజెక్టు క్రింద సెప్టెంబరు 2003 వరకు చేసిన సంచయన వ్యయం రూ.1189కోట్లు అనగా మొత్తం అంచనా వ్యయంలో 64.5శాతం.

డిఎఫ్ఐడి (యుకె) సహాయంతో రెండు ప్రాజెక్టులు చేపట్టం అమలుచేయబడటం జరుగుతోంది. అని ఎ.పి. అర్బన్ సర్వీసెస్ ఫర్ పూర్ (4/01 నుండి 3/07 వరకు), సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (8/01 నుండి 9/04 వరకు). ఈ రెండు ప్రాజెక్టుల కింద అంచనా వ్యయం రూ.1447కోట్లు కాగా, ఇందులో దాత వాటా రూ.787కోట్లు, రాష్ట్రం వాటా రూ.660కోట్లు. సెప్టెంబరు 2003 మాసాంతం వరకు చేసిన వ్యయం రూ.121కోట్లు అనగా 8.4శాతమే అంటే ఈ ప్రాజెక్టుల అమలు ఎట్లా జరుగుతుందో తేటతెల్లమవుతోంది.

రాయల్ నెదర్‌లాండ్స్ రాయబార కార్యాలయం ద్వారా రెండు ప్రాజెక్టులు రాష్ట్రంలో చేపట్టడం జరిగింది. అవి గ్రీన్ హైదరాబాద్ ఎన్విరాన్‌మెంట్ ప్రాజెక్ట్ (1/02 నుండి 12/06 వరకు), ఎఎన్‌టిడబ్ల్యువి ప్రాజెక్టు (12/02 నుండి 3/07 వరకు) ఈ రెండు ప్రాజెక్టుల కింద అంచనా వ్యయం రూ.251కోట్లు. ఇందులో దాతవాటా రూ.210కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.41కోట్లు. సెప్టెంబరు 2003 మాసాంతం వరకు ఈ ప్రాజెక్టుల కింద చేసిన సంచయన వ్యయం రూ.52కోట్లు అనగా 20.7శాతమే.

మొత్తంమీద విదేశీసహాయంతో చేపట్టిన 14ప్రాజెక్టులకు అంచనా వ్యయం రూ.14795 కోట్లు కాగా ఇందులో నిది సంస్థ వాటా రూ.11148కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.3647కోట్లు. సెప్టెంబరు 2003 ఆఖరు వరకు ఈ మొత్తం ప్రాజెక్టుల మీద చేసిన సంచయన వ్యయం రూ.8606 కోట్లు అనగా 58.2శాతం.

వడ్డీ చెల్లింపులు:

రాష్ట్ర ప్రభుత్వం అప్పుల మీద చెల్లించాల్సిన వడ్డీలు "ఇంతింతై వటుడింతై" అన్నట్లు యమవేగంతో పెరిగిపోతున్నాయి. 1989-90సంవత్సరంలో వడ్డీ చెల్లింపులు రూ.471కోట్లు వుండగా 1994-95సంవత్సరంలో రూ.1256కోట్లుకు పెరిగి క్రమక్రమేణా 2003-04సంవత్సరం బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.6924కోట్లుకు పెరుగుతాయని అంచనా. అనగా రాష్ట్ర రెవెన్యూ రాబడులలో వడ్డీ చెల్లింపులు 1989-90సంవత్సరంలో 10.5శాతం వుండగా 1995-96సంవత్సరంలో 15.5శాతం 2003-04సంవత్సరంలో 23.6శాతానికి పెరుగుతుందని అంచనా. రాష్ట్రప్రభుత్వం రాబడులలో వడ్డీ చెల్లింపులకు కాకుండా, ఉద్యోగుల జీతభత్యాలకు కాకుండా, రాష్ట్రప్రభుత్వం నియమించే సలహాదారుల, స్పెషల్‌డ్యూటీ మీద నియమించి అధికారుల, శాసనసభ్యుల, మంత్రుల జీతభత్యాలు కలుపుకుంటే నిర్వహణ వ్యయం ఇంకా అధికంగా వుంటుంది. ఆపద్ధర్మ ముఖ్యమంత్రి విమాన/హెలికాప్టర్ ప్రయాణాలు పెరుగుతున్నాయి. దీనికయ్యే ఖర్చు తడిసి ముప్పందం. ఇక అధికారగణాల విదేశీ పర్యటనలతో రాష్ట్ర ఖజానాకు గండిపడుతుందనడంలో సందేహం లేదు. వీడియో కాన్ఫరెన్సులకయ్యే ఖర్చు అమితంగా వుంటోంది. మరి ఇన్ని విధాల రాష్ట్ర రాబడి స్వాహా అవుతుంటే రాష్ట్రంలో అభివృద్ధి మృగ్యమే అవుతుంది కదా!

ఒక విశ్లేషణ:

పైన కేవలం గణాంకాల వివరాలివ్వటం జరిగింది. అది ఎన్‌టిఆర్, కాంగ్రెస్, చంద్రబాబు పాలనలవారీగా గణాంకాలు విశ్లేషణ జరిగింది. ప్రస్తుత ముఖ్యమంత్రి పాలనలో 95-96 నుంచి 03-04 (బ.అం) మధ్యకాలంలో రుణభారం అయిదు రెట్లు పెరిగింది. ఈ రుణభారం 04-05లో రూ.65324కోట్లకు, 05-06లో రూ.72543కోట్లకు పెరుగుతుందని రాష్ట్ర ఆర్థికమంత్రి అన్యువల్ ఫిస్కల్ ఫ్రేమ్‌వర్క్‌లో అంచనావేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీల మొత్తం రూ.18357తో కలిపితే, సుమారు 90వేల కోట్లకు చేరుతుంది. ప్రభుత్వశాఖలు రుణాలకోసం ప్రపంచ బ్యాంకు తదితర అంతర్జాతీయ సంస్థల ముందు క్యూలో నిల్చొని వున్నాయి. మొత్తంమీద వచ్చే రెండు సంవత్సరాల ఆఖరుకు లక్ష కోట్ల రూపాయల స్థాయికి చేరుకొంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఇదొక భయంకరమైన భవిష్యత్తు. ఇప్పటికే అసలు, వడ్డీల చెల్లింపు సగటున రోజుకు రూ.20కోట్లుంది. 12వ ఫైనాన్స్ కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నివేదిక ప్రకారం 03-04లో రూ.6821కోట్ల నుంచి, 2009-10 నాటికి రూ.12102కోట్లకు చేరుకొంటుందని అంచనా. అంటే మొత్తం ఆరు సంవత్సరాల్లో అసలు, వడ్డీ చెల్లింపులు రూ.50826కోట్లు అవుతుంది. ఇది ముఖ్యమంత్రి ప్రకటిస్తున్న అభివృద్ధికి మనం చెల్లిస్తున్న మూల్యం.

తెచ్చిన రుణం అంతా అభివృద్ధి కోసమే ఖర్చు చేస్తున్నానని ముఖ్యమంత్రి అంటున్నారు. కాని మన చేతికి, అసలు, వడ్డీ చెల్లింపులు పోను నికరంగా వచ్చే రుణం సముద్రంలో నీటి బొట్టంత. ఉదాహరణకు 01-02లో అంతర్గత రుణం రూ.14891కోట్లయితే, నికరంగా చేతికి వచ్చింది. కేవలం రూ.1080కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రుణం రూ.3717కోట్లు నికరం రూ.474కోట్లు, ఇతర రుణాలు రూ.11838కోట్లు కాగా నికరంగా వచ్చింది రూ.1099కోట్లు, అంటే తీసుకొన్న రుణం రూ.30446కోట్లకుగాను చేతికి వచ్చింది రూ.2251కోట్లు, లేదా 7.39శాతం. మరో మాటల్లో చెప్పాలంటే ప్రతి నూరు రూపాయల రుణానికి చేతికి నికరంగా వచ్చింది ఏడు రూపాయలు. ఏడు రూపాయలతో అభివృద్ధి!

ప్రసిద్ధ ఆర్థికశాస్త్రవేత్త, నికోలస్ గుయాట్ యిలా హెచ్చరిస్తున్నారు: **"రుణగ్రస్థులైన దేశాలు/రాష్ట్రాలు చాలా వరకు నిస్సహాయ స్థితిలో పడిపోయాయి. ప్రపంచ బ్యాంకు/అంతర్జాతీయ ద్రవ్యనిధి ఆదేశాలను ఈ రుణగ్రస్థ దేశాలు/రాష్ట్రాలు అనుసరించడమంటే ప్రభుత్వ పథకాలపై ఖర్చును కోతపెట్టడం, ప్రజా బాహుళ్యం ఉనికికోసం ఏ సర్వీసుల మీద ఆధారపడవలసి వస్తుందో ఆ కీలకమైన సేవల్ని కూడా కోతపెట్టడం; ఈ సలహాల్ని పాటించకుండా రుణాలు చెల్లించలేక బకాయి పడిపోయిన దేశాలకు పరపతి ద్వారాలు మూసుకుపోతాయి; ఈ రుణగ్రస్తులకు ఏవైనా విదేశీనిల్వలు (ఆస్తులు) ఉండి ఉంటే వాటిని రుణదాతలు జప్తుచేసుకొంటారు. రుణగ్రస్థులు కుప్పకూలుతారు. వర్థమానదేశాలు/రాష్ట్రాలు కఠినమైన బ్యాంక్ వ్యవస్థా సర్దుబాటు షరతులకు లొంగడంలోని కిటుకంతా ఇందులోనే వుంది".**

ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ రాబడి రెవెన్యూ వ్యయంలో కాంపౌండ్ అభివృద్ధి రేటు (శాతం)

	1983-84 నుండి 1988-89	1989-90 నుండి 1994-95	1995-96 నుండి 2001-02	1995-96 నుండి 2003-04
రెవెన్యూ రాబడి	16.24	14.72	27.98	20.32
రెవెన్యూ వ్యయం	15.27	14.92	14.21	13.70
అభివృద్ధి వ్యయం	15.02	13.32	12.05	11.53
అభివృద్ధేతర వ్యయం	16.00	18.92	18.31	17.62

ఆంధ్రప్రదేశ్ రుణభారం

(రూ. కోట్లు)

సం.	కేంద్రంనుండి లభించే రుణాలు	మార్కెటు రుణాలు	భవిష్యనిధి	ఇతరములు	మొత్తం
1989-90	3774	1357	594	142	5867
1990-91	4368	1596	690	161	6815
1991-92	5056	1935	819	182	7992
1992-93	5852	2273	957	204	9286
1993-94	7094	2609	1109	253	11065
1994-95	8342	3046	1334	283	13005
1995-96	9675	3916	1600	373	15164
1996-97	10484	4045	1843	848	17220
1997-98	12059	4694	2185	1033	19971
1998-99	13941	6038	2517	1408	23904
1999-00	15415	7239	4152	2308	29114
2000-01	16510	9138	6365	3639	35652
2001-02	19033	11039	7830	4590	42492
2002-03 (స.అం)	20080	13887	10090	5887	49944
2003-04 (స.అం)	22301	15566	12918	6356	57141

ఆధారం: 12వ ఆర్థిక సంఘానికి సమర్పించిన విజ్ఞాపన, సంపుటి-1

ఆంధ్రప్రదేశ్ రుణాలలో వివిధ రుణాల శాతం

సం.	కేంద్రం నుండి లభించే రుణాలు	మార్కెటు రుణాలు	భవిష్యనిధి	ఇతరములు	మొత్తం
1989-90	64.3	23.1	10.2	2.4	100.0
1990-91	64.1	23.4	10.1	2.4	100.0
1991-92	63.3	24.2	10.3	2.2	100.0
1992-93	63.0	24.5	10.3	2.2	100.0
1993-94	64.1	23.6	10.0	2.3	100.0
1994-95	64.1	23.4	10.3	2.2	100.0
1995-96	63.8	23.2	10.6	2.4	100.0
1996-97	60.9	23.5	10.7	5.2	100.0
1997-98	60.4	23.5	10.9	5.2	100.0
1998-99	58.3	25.3	10.5	5.9	100.0
1999-00	52.9	24.9	14.3	7.9	100.0
2000-01	46.3	25.6	17.9	10.2	100.0
2001-02	44.8	26.0	18.4	10.8	100.0
2002-03 (స.అం)	40.2	27.8	20.2	11.8	100.0
2003-04 (స.అం)	39.0	27.3	22.6	11.1	100.0

ఆధారం: గణించబడింది.

రాష్ట్ర స్థూల ఉత్పత్తికి రుణాల నిష్పత్తి

(రు. కోట్లు)

సం.	ప్రజారుణం	స్థూలరాష్ట్ర ఉత్పత్తి (ప్రస్తుతధరల్లో)	రాష్ట్ర స్థూల ఉత్పత్తికి రుణాల నిష్పత్తి
1993-94	11065	57867	0.19
1994-95	13005	68923	0.19
1995-96	15164	79854	0.19
1996-97	17220	90147	0.19
1997-98	19971	95782	0.21
1998-99	23904	114937	0.21
1999-00	29114	125235	0.23
2000-01	35652	139137	0.26
2001-02	42492	150096	0.28

ఆధారం: 1. 12వ ఆర్థిక సంఘానికి సమర్పించిన విజ్ఞాపన సంపుటి-1
2. అర్థగణాంక శాఖ, హైదరాబాదు.

సంక్షిప్తంగా విదేశీ సహాయ ప్రాజెక్టుల సమీక్ష

(రు. కోట్లు)

క్రమ. సం.	నిధి ప్రతినిధి సంస్థ	ప్రాజెక్టుల సంఖ్య	ప్రాజెక్టు ఖర్చు అంచనా: నిధి సంస్థ వాటా	రాష్ట్రవాటా	మొత్తం	సంచయన వ్యయం 09/03 వరకు
1.	ప్రపంచ బ్యాంకు	8	8524	2730	11254	7244
2.	జపాన్ బ్యాంకు అంతర్జాతీయ సహకారం	2	1627	216	1843	1189
3.	డి.ఎఫ్.ఐ.డి.	2	787	660	1447	121
4.	రాయల్ నెదర్లాండ్స్ సంస్థ	2	210	41	251	52
	మొత్తం	14	11148	3647	14795	8606

ఆధారం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

ఆంధ్రప్రదేశ్‌లో చెల్లించవలసిన వడ్డీలు - రెవెన్యూ రాబడులలో దామాషా

(రు. కోట్లు)

సం.	చెల్లించవలసిన వడ్డీలు	రెవెన్యూ రాబడులు	రెవెన్యూ రాబడులలో దామాషా (శాతం)
1989-90	471	4497	10.5
1990-91	589	5347	11.0
1991-92	695	6282	11.1
1992-93	830	7066	11.7
1993-94	1025	8250	12.4
1994-95	1256	8786	14.3
1995-96	1529	9875	15.5
1996-97	1839	11193	16.4
1997-98	2153	13841	15.6
1998-99	2644	14260	18.5
1999-00	3161	16805	18.8
2000-01	3869	19475	19.9
2001-02	4675	21845	21.4
2002-03 (స.అం.)	6057	24107	25.1
2003-04 (స.అం.)	6924	29295	23.6

ఆధారం: 12వ ఆర్థిక సంఘానికి సమర్పించిన విజ్ఞాపన-సంపుటి-1

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి - ఒక పరిశీలన

యస్.శ్రీదేవి
ఫ్యాకల్టీ, సెస్
(హైదరాబాద్)

'రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి' అన్న అంశం ఇటీవలి కాలంలో, అంటే దేశ ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తమై సంస్కరణలు (ప్రత్యేకించి ఆర్థిక సంస్కరణలు) ప్రారంభించిన నేపధ్యంలో, ప్రాధాన్యత సంతరించుకొంది. అసలు ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తం ఎందుకు అవుతుంది? ఈ పరిస్థితికి మూలం ఎక్కడ? అని ప్రశ్నించుకుంటే ఆర్థికసంక్షోభం యొక్క అనుక్రమం బయటపడుతుంది. సాధారణంగా ఈ పరిస్థితి రెవెన్యూ లోటుతో (అంటే రెవెన్యూ ఖర్చు కంటే రెవెన్యూ ఆదాయం తక్కువగా ఉండడం) మొదలవుతుంది. రెవెన్యూ ఖర్చులో ఉన్న అంశాలు ఏమంటే సాధారణ సేవలు, సామాజిక ఆర్థిక సేవలు, జీతభత్యాలు, వడ్డీ చెల్లింపులు, నిర్వహణ ఖర్చు, సబ్సిడీలు, గ్రాంట్లు మొదలగునవి. అంటే ఇవన్నీ పునః సంభవించే ఖర్చులు. పన్ను, పన్నేతర ఆదాయం, కేంద్రం నుండి పన్నుల వాటా మరియు గ్రాంట్లు రెవెన్యూ ఆదాయంలో ఉండే అంశాలు.

రెవెన్యూ లోటు పునరావృతం అయితే, పెట్టుబడి పెంచుకోవడానికై చేసిన ఋణం ఈ రెవెన్యూలోటును భర్తీ చేయడానికై వినియోగించడం, దానితో పెట్టుబడి వ్యయం తగ్గి, అప్పులపై పన్ను వడ్డీ చెల్లింపులు పెరిగి మళ్ళీ రెవెన్యూలోటు పెరగడం - ఇదొక విషవలయంగా మారుతుంది. ఇది 'అస్తవ్యస్త ఆర్థికపరిస్థితి' తొలిదశ. రెండవదశలో తెచ్చిన ఋణ మొత్తాన్ని పెట్టుబడి వ్యయంపై పెట్టకపోవడం వల్లనూ, అంతో ఇంతో పెట్టిన పెట్టుబడి వ్యయంపై తగినంత రాబడులు(రిటర్న్స్) లేకపోవడం వల్లనూ, అప్పుల భారం పెరగడంతో పాత అప్పులు తీర్చుటకై కొత్త అప్పులు చేయడం, తక్కువ వడ్డీరేటుతో తెచ్చిన ఋణాన్ని ఎక్కువవడ్డీ రేటుతో తెచ్చిన ఋణమొత్తం ద్వారా చెల్లించడంతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధి కుంటుపడి ఋణ విషవలయంలో కూరుకొని పోవడానికి కారణమవుతుంది.

ఈ ఋణవలయం నుండి బయటపడడానికి చేసిన ప్రయత్నమే సంస్కరణలకు శ్రీకారం చుట్టడం. దేశస్థాయిలో 1991సం॥లో ఈ సంస్కరణలు మొదలుపెట్టగా, ఆంధ్రప్రదేశ్ 1995-96లో సంస్కరణలు చేపట్టి రాష్ట్రస్థాయిలో సంస్కరణలు మొదలుపెట్టిన మొట్టమొదటి రాష్ట్రాల జాబితాలో చేరింది.

ఆంధ్రప్రదేశ్ అస్తవ్యస్త ఆర్థికపరిస్థితికి కారణాలు ఇలా ఉన్నాయి. 1971-72 నుండి 82-83వరకూ ఉన్న రెవెన్యూ మిగులును తెచ్చిన కాపిటల్ రిసిప్ట్స్ (మోస్ట్‌లీ బారోయింగ్స్) ఋణానికి జతచేసి పెట్టుబడులు పెంచడం జరిగింది. ఈ పెట్టుబడి వ్యయంలో ఎక్కువభాగం వ్యవసాయ పారిశ్రామిక రంగాలకు మౌలిక సదుపాయాలైన నీటిపారుదల విద్యుత్ రంగాలకు వినియోగించడం జరిగింది.

1983-84 నుండి రెవెన్యూ లోటు పెరగడం, ఈ లోటు పునరావృతం కావడం ఫలితంగా పైన పేర్కొన్న అస్తవ్యస్త పరిస్థితిని మొదటిదశ ప్రారంభమైంది. రెవెన్యూలోటు గూర్చి ఇక్కడ ఇంతగా ప్రస్తావించడానికి కారణం సమస్య ఇక్కడనుండే ప్రారంభం కాబట్టి. ఈ సమస్య మొదలు కావడానికి కారణాలు ఇలా ఉంటాయి. ఈ కాలంలో రెవెన్యూ ఆదాయం పెరిగిందా లేదా లేక రెవెన్యూ వ్యయం మాత్రమే పెరిగిందా? ఏ అంశాలు పెరిగాయి? ఇలాంటివైతే వీటి కారణమైన పాలసీ విధానాలను పరిశీలించడం ఇంకొక విషయం.

1970దశకం వరకు ప్రణాళికా వ్యయంలో 60శాతానికి పైగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు మౌలిక సదుపాయాలైన నీటిపారుదల విద్యుత్ రంగాలకు కేటాయించడం జరిగింది. 6వ ప్రణాళికలో (1980-85) ప్రణాళికా విధానంలో మార్పులు జరగడంతో, మౌలిక సదుపాయాలపై ప్రణాళికా వ్యయాన్ని ఇంచుమించు 52% తగ్గించారు. 7వ ప్రణాళికా డాక్యుమెంటులో ఈవిధంగా రాసివుంది.

"While the case for development of irrigation and power remains as strong as before, given the predominantly agricultural character of the state economy and the low level of industrialisation, this would represent a certain trade off between the need for social development and economic development".

అంటే అంతవరకూ ఆర్థికాభివృద్ధి ద్వారా రాష్ట్రాభివృద్ధి ప్రత్యేకించి సాంఘికాభివృద్ధి సాధించవచ్చునని ఆశించడం జరిగింది. కాని 6వ ప్రణాళికా సమయానికి సాంఘికాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలనే ఆలోచన రావడంతో ప్రణాళికా వ్యయ విదానంలో మార్పు వచ్చింది. దీన్ని బట్టి చూస్తే ఆర్థికాభివృద్ధిని సాంఘికాభివృద్ధిని పరిపూరక లక్ష్యాలుగా (కాంప్లిమెంటరీ గోల్స్) కాక వ్యతిరిక్త లక్ష్యాలుగా(కాంట్రడిక్టరీ గోల్స్) భావించడం జరిగింది.

ఇక సాంఘికాభివృద్ధికై కేటాయించిన వ్యయధోరణులపై (పట్టిక 1) దృష్టిసారిస్తే, విషయాలు ఇలా ఉన్నాయి. సాంఘికాభివృద్ధి సాధించడానికి తీసుకోవలసిన అంశాలు ముఖ్యంగా విద్య (అందులోనూ ప్రాధమిక విద్య) వైద్య, ఆరోగ్యం(అందులోనూ ప్రాధమిక ఆరోగ్యం) కుటుంబ సంక్షేమం, మంచినీటి సరఫరా మరియు పారిశుద్ధ్యం కాగా, మిగతావి బలహీన వర్గాల సంక్షేమం, సాంఘిక సంక్షేమం, కార్మిక సంక్షేమం మొదలగునవి. గ్రామీణాభివృద్ధి ఆర్థిక సర్వీసుల జాబితాలో ఉన్నా కూడా, పేదరిక నిర్మూలన అంశాలుండడం వల్ల, సాంఘికాభివృద్ధి కేటగిరిలో చేర్చవచ్చు. ముఖ్యఅంశాలైన విద్య, వైద్యం, ఆరోగ్యం కుటుంబ సంక్షేమం నీటిసరఫరా పారిశుద్ధ్యం పరిగణనలో తీసుకుంటే 1980 దశకంలో వీటిపై వ్యయం(జిఎస్‌డిపి నిష్పత్తిగా) పెరిగింది.

అంటే దీని అర్థం సాంఘికాభివృద్ధి సాధించినట్టేనా? ఇక్కడ ఒక విషయాన్ని చర్చిద్దాం. మనం గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే

ఏదైనా ఒక రంగంలో అభివృద్ధి సాధించాలి అంటే ఆ రంగంలో పూర్తి అభివృద్ధి సాధించేవరకూ కృషి చేయాలి. ఆ కృషిని వేరే రంగాలకు విస్తరిస్తూ, ముందు చేపట్టినవి కొనసాగిస్తూ ఉండాలి. అప్పుడే సర్వత్రా అభివృద్ధి సాధ్యం. కాని ఇక్కడ జరిగింది ఇలా కాదు. 1970 దశాబ్దంలో ఆర్థికరంగానికి కావలసిన మౌలిక సదుపాయాలపై దృష్టి నిలిపి, 1980 దశాబ్దంలో దాని ప్రాధాన్యతను తగ్గించి సాంఘిక సేవారంగంపై శ్రద్ధ చూపారు. ఈ ఖర్చులపై రాబడులు లేకపోవడమో, ఉన్నా నామమాత్రంగా ఉండడం వల్ల రెవెన్యూ వ్యయం రెవెన్యూ ఆదాయాన్ని మించిపోయింది. అంటే ఈ దశాబ్దంలో ఏర్పడిన రెవెన్యూలోటు ఖర్చులు ఎక్కువగా పెరిగిన కారణంగా భావించవచ్చు. (ఈ కాలంలో సబ్సిడీ బియ్యం పథకం అమలుచేయడం మనకు తెలిసిందే.) రెవెన్యూ ఆదాయం పెరిగినా, రెవెన్యూ ఖర్చు మరింతవేగంగా పెరగడం వల్ల లోటు ఏర్పడింది. ఈ దశాబ్దంలో దాదాపు 5సం॥లు రెవెన్యూ లోటు ఉంది. అందుకే ఈ రెండు రంగాలు అభివృద్ధికి నోచుకోలేదు. అంటే ఆర్థిక, మౌలిక రంగాలు 1989-90సం॥లో రెవెన్యూ ఆదాయం తగ్గితే (తగ్గినశాతం 1.5% ఆఫ్ జిఎస్‌డిపి), (పట్టిక 2) రెవెన్యూ/జిఎస్‌డిపి 0.5మాత్రమే తగ్గింది. రెవెన్యూలోటు పునరావృతం కావడానికి ఇక్కడ పునాది ఏర్పడింది.

1990 దశాబ్దంలో ఒక్క 1993-94 ఆర్థిక సంవత్సరం మినహాయిస్తే ఏసంవత్సరం కూడా రెవెన్యూ మిగులులేదు. దీనికి కారణం రాష్ట్ర సొంత రెవెన్యూ/జిఎస్‌డిపి నిష్పత్తి తగ్గడం. ఈ పరిస్థితి దశాబ్దం ప్రారంభంలోనే ఎదురైంది. దీనికి కారణం కాంప్లెక్స్ టాక్స్ స్ట్రక్చర్ లాంటి కారణాలు అయివుండొచ్చు. దీనికి తోడు కేంద్రం నుంచి రాష్ట్రాలకొచ్చే పన్నులవాటా మరియు గ్రాంట్లు కూడా తగ్గాయి. మద్యపాన నిషేధం (1995-97) అమలుతో ఎక్సైజ్ సుంకం తగ్గి ఈ నిష్పత్తి మరింతగా పడిపోయింది. (పట్టిక 2). రెవెన్యూ లోటు ఇలా 1980వ దశకంలో ప్రారంభమై 1990వ దశాబ్దంలో మొదటిభాగంలో మరింత దిగజారింది. ఋణాల భారం పెరిగి ఋణాల ఊబిలోకి ఇరుక్కుపోయింది.

ఇక ఋణాల తీరుతెన్నులు పరిశీలిస్తే 1990-91సం॥లో (పట్టిక 3) తీసుకున్న ఋణం రూ.1070కోట్లు అయితే తీర్చిన ఋణం రూ.218కోట్లు. అంటే తీసుకొన్న ఋణం నుండి 20శాతం ఋణం చెల్లించారు. 1996-97నాటికి ఈశాతం 59కి పెరిగింది. అంటే చేసిన ఋణంలో సగానికి పైగా ఋణ చెల్లింపులకు వినియోగించినారన్న మాట. మిగతా 41శాతం నుండి అంటే నికర ఋణం నుండి రెవెన్యూలోటు, పెట్టుబడి వ్యయం మిగతా అభివృద్ధి పనులకు (నెట్ లెండింగ్) కేటాయించారు. చేసిన ఋణభారం పెరుగుతూ 1995-96నాటికి జిఎస్‌డిపిలో 19% అయి 2000-01 నాటికి 25.62%శాతానికి పెరిగింది.

అందువల్లనే సంస్కరణలు అనివార్యమని ప్రభుత్వం వాటిని ప్రవేశపెట్టింది. అమలు జరిపిన సంస్కరణలను మచ్చుకు కొన్ని పరిశీలిద్దాం. మద్యపాన నిషేధం పాక్షికంగా(96-97) ఎత్తివేశారు. నీటితీరువా 5రెట్లు పెంచారు. (97-98), విద్యుత్ రేట్లను 9% పెంచారు (98-99), యూజర్ ఛార్జెస్ విధానం మొదలుపెట్టారు(99-00). కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఒక రకమైన అమ్మకపు పన్ను అమలు(99-00) కూడా ఇందులో ఒకటి.

వ్యయాన్ని తగ్గించే దిశలో కొన్ని చర్యలు చేపట్టారు. సబ్సిడీ బియ్యం ధరను (96-97)లో పెంచి కోటాను తగ్గించారు. ఖాళీ అయిన ఉద్యోగాలను భర్తీచేయకపోవడం వల్ల వేతనాల బిల్లు తగ్గింది. జీరో బడ్జెట్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. పై చర్యల మూలంగా కొంత రెవెన్యూ ఆదాయం పెరిగినట్లు తెలుస్తోంది. వ్యయం తగ్గుముఖం పట్టినా అయిదవ వేతన కమీషన్ సిఫార్సుల అమలు వల్ల వ్యయం మళ్లీ పెరిగింది. ఈ సంస్కరణల కాలంలో వ్యయం తీరుతెన్నులు కొంత హెచ్చుతగ్గులకు లోనైంది. పెట్టుబడి వ్యయం ఒక మోస్తరుగా పెరిగింది. మొత్తం వ్యయం తగ్గుముఖం పట్టి మళ్ళీ 2000-01 నాటికి (జిఎస్‌డిపిలో శాతంగా) పెరిగింది.

ద్రవ్యలోటులో వడ్డీ చెల్లింపుల శాతం 63(95-96) నుండి 69.54శాతానికి (2001-02)పెరిగింది. బడ్జెట్ అంచనాల ప్రకారం 2003-04లో అంటే ప్రస్తుత సంవత్సరంలో వడ్డీ చెల్లింపుల శాతం ద్రవ్యలోటులో 94%కు చేరింది. ఉన్నలోటులో దాదాపు 94%వడ్డీ చెల్లింపులే అని బడ్జెట్ అంచనాలు చెబుతున్నాయి.

అవుట్‌స్టాండింగ్ రుణం వడ్డీరేటు సగటున 13%(95-96) నుండి 15.5%(2001-02) పెరిగి బడ్జెట్ అంచనాల ప్రకారం 2003-04లో 16.8%చేరింది.

దీనితో ద్రవ్యలోటు/జిఎస్‌డిపి నిష్పత్తి పెరిగింది, వడ్డీ చెల్లింపుల నిష్పత్తి పెరిగింది. అవుట్ స్టాండింగ్/జిఎస్‌డిపి నిష్పత్తి పెరిగింది.

ఈ ఋణాల ఊబి నుండి బయటపడడానికి తీసుకోవలసిన చర్యల్లో పన్ను బకాయిలను వసూలు చేయడం మొదటిది. కాగ్ నివేదిక 2001 ప్రకారం మొత్తం బకాయిలు మార్చి 2001 నాటికి రూ.2666కోట్లు కాగా, అందులో రూ.1738కోట్లు ఒక్క అమ్మకపు పన్ను నుండే రావాల్సి ఉందని తెలుస్తోంది. ఈ మొత్తం బకాయిలో 5ఏళ్ళకు పైగా పేరిన బకాయిలు రూ.1469కోట్లని తెలుస్తోంది. మార్చి 2002 నాటికి మొత్తం బకాయిలు రూ.2231కోట్లు. అందులో రూ.1134కోట్లు 5ఏళ్ళకు పైగా పేరి ఉన్న బకాయిలు. అంటే రూ.335 పాత బకాయిలు వసూలయ్యాయి. ఇది అభిలషీయమైనా చేయాల్సి ఎంతో ఉంది.

కాగ్ రిపోర్టు ప్రకారం అమ్మకం పన్ను, నీటితీరువా, మోటారు వాహనాలు, స్టాంపుడ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ మరియు ఇతర శాఖల్లో కొన్ని పద్దులు పరిశీలిస్తే 2000-01సం॥లో తేలినదేమంటే అండర్ ఎసెస్‌మెంట్/షార్ట్ లెవీ/లాస్ ఆఫ్ రెవెన్యూ మొత్తం కలిపి రూ.666.74కోట్లుగా తేలింది. అండర్ ఎసెస్‌మెంట్ చేసినట్లుగా ఒప్పుకున్న మొత్తం రూ.28.55కోట్లు. ఇది ఒక్క రాబడుల విషయంలో మాత్రమే.

ఇక 2001-02సం॥లో సిఎజి పరిశీలనలో తేలినదేమేమంటే పైన పేర్కొన్న డిపార్టుమెంట్లలో అండర్ ఎసెస్మెంట్/షార్ట్ లెవీ/లాస్ ఆఫ్ రెవెన్యూ అయిన మొత్తం రూ.908.86కోట్లు. దీని వల్ల నేర్చుకోవలసినదేమంటే ప్రభుత్వం తన రెవెన్యూ ఆదాయాన్ని పెంచుకోవాలంటే (తప్పనిసరికదా) పన్నుల అమలును, వసూళ్ళను మెరుగుపరచుకోవాలి.

పట్టిక-1:

స్థూల రాష్ట్రోదాయంలో శాతంగా విద్య, ఆరోగ్యం, నీటి సరఫరా, పారిశుధ్యంపై ఖర్చు

సంవత్సరం	విద్య కళలు	అందులో ప్రాథమిక విద్య	ఆరోగ్యం, కుటుంబసంక్షేమం				నీటిసరఫరా పారిశుభ్రత
			వైద్యం ప్రజారోగ్యం	అందులో ప్రాథమిక ఆరోగ్యం	కుటుంబ సంక్షేమం	ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం మొత్తం	
80-81	2.82	1.24	0.94	0.00	0.15	1.10	0.40
81-82	2.78	1.20	0.87	0.00	0.15	1.03	0.35
82-83	3.18	1.21	0.86	0.00	0.18	1.06	0.39
83-84	3.43	1.28	0.89	0.00	0.23	1.15	0.51
84-85	3.51	1.38	0.94	0.00	0.28	1.21	0.46
85-86	3.53	1.48	0.94	0.16	0.30	1.24	0.54
86-87	3.48	1.42	0.94	0.15	0.23	1.17	0.61
87-88	3.55	1.51	0.99	0.15	0.24	1.23	0.64
88-89	3.18	1.21	0.92	0.08	0.22	1.14	0.44
89-90	3.64	1.25	0.86	0.08	0.21	1.07	0.37
90-91	3.05	1.26	0.81	0.11	0.18	0.99	0.31
91-92	2.84	1.11	0.75	0.12	0.18	0.93	0.29
92-93	3.06	1.16	0.76	0.12	0.19	0.95	0.36
93-94	2.54	0.96	0.71	0.10	0.19	0.90	0.30
94-95	2.46	0.98	0.64	0.10	0.18	0.82	0.45
95-96	2.16	0.86	0.60	0.10	0.16	0.76	0.31
96-97	2.22	0.84	0.67	0.10	0.19	0.85	0.34
97-98	2.35	0.90	0.72	0.11	0.17	0.89	0.42
98-99	2.48	0.81	0.71	0.10	0.19	0.90	0.59
99-2000	2.65	0.96	0.74	0.11	0.18	0.92	0.32
2000-01	2.69	0.98	0.73	0.12	0.20	0.92	0.30
2001-02	2.58	1.10	0.73	0.13	0.18	0.91	0.32

పట్టిక 2:

స్థూల రాష్ట్రోదాయంలో ఆదాయ వ్యయాల శాతం

సంవత్సరం	స్వంత పన్ను ఆదాయం	స్వంత పన్నేతర ఆదాయం	స్వంత ఆదాయం	కేంద్ర నిధుల బదలాయింపు	మొత్తం రెవెన్యూ	రెవెన్యూ ఖర్చు	పెట్టుబడి ఖర్చు	మొత్తం ఖర్చు
80-81	7.11	2.72	9.83	5.61	15.44	14.17	3.03	17.20
81-82	7.00	2.62	9.62	4.98	14.60	13.81	2.56	16.37
82-83	7.45	2.40	9.85	5.26	15.12	13.89	2.24	16.14
83-84	7.68	2.46	10.15	5.40	15.55	16.25	2.43	18.69
84-85	8.64	2.74	11.38	5.52	16.90	18.14	2.65	20.79
85-86	9.42	2.56	11.98	6.18	18.17	18.21	2.48	20.69
86-87	9.51	2.48	11.98	6.65	18.63	19.78	2.87	22.65
87-88	9.28	2.57	11.85	5.89	17.74	17.55	2.11	19.66
88-89	8.58	3.33	11.91	5.39	17.30	17.17	2.02	19.19
89-90	8.43	2.53	10.96	4.87	15.83	16.67	1.59	18.26
90-91	7.94	2.33	10.27	5.77	16.04	16.51	1.39	17.90
91-92	7.51	2.41	9.93	5.52	15.45	15.87	1.03	16.90
92-93	7.63	2.43	10.06	5.85	15.92	16.20	1.81	18.00
93-94	6.62	2.34	8.96	5.30	14.26	13.86	2.36	16.22
94-95	6.13	2.22	8.35	4.39	12.75	13.80	2.79	16.59
95-96	5.16	2.01	7.17	5.20	12.37	13.29	3.03	16.32
96-97	5.42	1.80	7.22	5.20	12.42	15.97	0.15	16.11
97-98	7.43	1.87	9.29	5.16	14.45	15.18	1.13	16.32
98-99	6.93	1.61	8.53	3.87	12.41	14.74	1.21	15.95
1999-00	7.19	1.95	9.14	4.28	13.42	14.40	1.59	15.99
2000-01	7.58	1.97	9.56	4.44	14.00	16.35	1.67	18.02
2001-02	7.70	1.94	9.64	4.91	14.55	16.47	2.06	18.53

పట్టిక 3:

రుణం ఖర్చుచేసిన తీరు

	తీసుకొన్న ప్రజారుణం (కో.రూ.)	చెల్లించిన రుణం (కో.రూ)	నికర ప్రజారుణం (కో.రూ)	రుణంలో చెల్లించినది శాతం	నికర ప్రజారుణంలో శాతం			
					రెవెన్యూ మిగులు/ లోటు	పెట్టుబడి ఖర్చు	నికరంగా ఇచ్చినరుణం	ద్రవ్య లోటు
80-81	246.58	84.81	161.77	34.39	-63.92	153.32	48.27	137.66
81-82	517.94	347.71	170.23	67.13	-47.00	151.21	38.92	143.13
82-83	803.10	568.75	234.35	70.82	-56.67	103.85	26.28	73.56
83-84	679.40	400.79	278.61	58.99	31.79	109.78	35.38	176.96
84-85	1466.10	1049.54	416.56	71.59	40.58	86.42	14.98	141.97
85-86	1358.86	859.41	499.45	63.24	1.46	75.73	9.96	87.15
86-87	938.18	527.89	410.29	56.27	45.93	114.65	35.20	195.78
87-88	1098.52	665.41	433.11	60.57	-8.58	95.72	43.83	130.98
88-89	756.38	241.96	514.42	31.99	-6.47	97.31	39.77	130.61
89-90	898.72	256.45	642.27	28.54	37.09	70.17	44.01	151.27
90-91	1069.93	217.88	852.05	20.36	18.50	54.21	40.79	113.50
91-92	1441.97	394.45	1047.52	27.35	16.19	40.02	52.17	108.38
92-93	1412.74	256.73	1156.01	18.17	10.71	69.46	55.58	135.75
93-94	1956.16	329.42	1626.74	16.84	-14.28	83.97	43.00	112.69
94-95	2461.90	746.69	1715.21	30.33	42.43	112.03	-17.54	136.92
95-96	3650.45	1756.42	1894.03	48.12	39.01	127.89	-39.29	127.60
96-97	4429.08	2616.16	1812.92	59.07	176.46	7.25	-28.62	155.08
97-98	6232.40	3824.21	2408.19	61.36	29.20	45.10	26.52	100.81
98-99	9875.30	6273.61	3601.69	63.53	74.52	38.46	45.43	158.41
99-00	13165.11	8449.57	4715.54	64.18	26.15	42.25	37.13	105.53
2000-01	15097.56	10773.18	4324.38	71.36	83.14	53.64	22.83	159.61
2001-02	18608.19	13232.63	5375.56	71.11	53.60	57.50	13.97	125.07
2002-3(R)	12069.15	6876.67	5192.48	56.98	60.97	69.85	10.57	141.39
2003-4(B)	10447.40	6078.22	4369.18	58.18	48.79	109.71	9.46	167.95

"–" మిగులును సూచిస్తుంది.

పరిశ్రమల కోసం పరిశ్రమించని ప్రభుత్వం

– వి.హనుమంతరావు

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటికి పారిశ్రామికంగా వెనుకబడిన అరవయ్యవ దశకంలో కేంద్ర ప్రభుత్వరంగ పరిశ్రమల స్థాపనతో రాష్ట్రానికి పారిశ్రామిక కళ వచ్చింది. 70వ దశకం, 80వ దశకం పూర్వార్ధంలో పెద్ద ఎత్తున పారిశ్రామికీకరణ జరిగి దేశంలో పారిశ్రామిక రాష్ట్రాలుగా పేరు సంపాదించిన మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల సరసన చేరింది. అక్కడితో రాష్ట్రంలో పారిశ్రామీకరణ యుగం అంతరించింది. అప్పటికీ ఇప్పటికి కూడా పరిశ్రమల గురించిన పాలకుల ప్రచార శబ్ద కాలుష్యం తప్ప పరిశ్రమలు నడుస్తున్న శబ్దాలు వినరావటం లేదు. వినరాకపోగా ఉన్న భారీ పరిశ్రమలు కాయిలా పడో, విధాన పరంగానో మూత పడుతున్నాయి. రాష్ట్రంలో పారిశ్రామిక రంగం అభివృద్ధి రేటు విజన్ 2020 ప్రకారం సాలీనా 11శాతం సాధించి, 2020 నాటికి 13రెట్లు పెరిగి పోవాల్సి వుండగా ఇప్పటికి విజన్ 2020 అమలులోకి వచ్చిన తర్వాత 1999-00లో 7.8శాతం, 2000-01లో 4.5శాతం, 2001-02లో 4.7శాతం మాత్రమే నమోదైంది. చిన్న పరిశ్రమలు పరిశ్రమల శాఖ లెక్కల్లో మాత్రమే కనపడుతున్నాయి. స్థూల రాష్ట్రాదాయంలో పారిశ్రామిక రంగం వాటా స్థంభించి పోయింది. ఈ రంగానికి ఉపాధి అవకాశాలు కల్పించే కళ తప్పింది. ముఖంలో ప్రేత కళ కనిపిస్తుంది. ఇలా ఎందుకు జరిగిందో విశ్లేషించుకొందాం.

మౌలిక సౌకర్యాలను మరిచి ప్రోత్సాహకాలకు పెద్దపీట

పరిశ్రమలు ఏర్పడాలంటే విద్యుచ్ఛక్తి, నీరు కనీస మౌలిక సౌకర్యాలు. 70వ దశకంలో విద్యుదుత్పత్తికి అప్పటి ప్రభుత్వం పెద్దపీట వేయడంతో నీటికి ఈనాటి కరవు లాంటి కరవు లేకపోవటంతో పారిశ్రామిక పూదోట విరబూసింది. దీనిని దృష్టిలో వుంచుకొని ప్రభుత్వం అనేక పారిశ్రామిక సహాయ సంస్థలను (ఎపిఐడిసి, ఎపిఐఐసి, ఎపిఎస్ఎఫ్‌సి వగైరా) ఏర్పాటు చేయటంతో అప్పుడే గ్రామీణ ప్రాంతాల ధనాఢ్య వర్గాలు భూ సంస్కరణలు వచ్చి పడుతున్నాయనే భయంతో పట్టణాలకు వచ్చి చిన్నగా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఉత్సుకత చూపటంతో, వారికి ప్రభుత్వ సంస్థలు దన్నుగా నిలబడడం వల్ల, వాతావరణం మారింది. ఐడిబిఐ, ఐఎఫ్‌సిఐ, ఐసిఐసిఐ, ఎపిఎస్ఎఫ్‌సి లాంటి ఆర్థిక సహాయ సంస్థలు అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయి. అటు మౌలిక సౌకర్యాలు, ఇటు ఆర్థిక సహాయం అందించటంలో ప్రభుత్వం ప్రధాన పాత్ర వహించింది. ఆ రోజుల్లోనే నాగార్జున, విష్ణు గ్రూపులకు పునాదులు పడ్డాయి. హరిశ్చంద్రప్రసాద్ గ్రూపు విస్తరణ ప్రారంభమైంది. ఎప్పుడైతే 1983లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చి, విద్యుచ్ఛక్తి రంగానికి ప్రణాళికలో ప్రాధాన్యతను తగ్గించిందో, పారిశ్రామిక జండా అవనతం ప్రారంభమైంది. మౌలిక సౌకర్యాల కల్పనలో రాష్ట్రం ఎంత నిర్లక్ష్యం చేసిందంటే సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) అంచనాల ప్రకారం ఈ సౌకర్యాల అభివృద్ధి సూచికలో 2000లో తమిళనాడులో 144, కర్ణాటకలో 96.9వుండగా, ఆంధ్రప్రదేశ్‌లో 96.1గా వుండింది. ఆ మరుసటి సంవత్సరం తమిళనాడులో సూచిక 145.6 నమోదు కాగా, కర్ణాటక 106.1కి పెరగగా, ఆంధ్రప్రదేశ్‌లో పెరుగుదల మాత్రం తక్కువగా 104గా నమోదైంది. ఏమైనప్పటికి దక్షిణ రాష్ట్రాల్లో రాష్ట్రం అప్పటికీ, ఇప్పటికీ ఇతర రాష్ట్రాల కన్నా వెనుకబడే వుంది. 'బిజినెస్ టుడే' పత్రిక ఈ మౌలిక సౌకర్యాల ఆధారంగా దేశంలోని నగరాలన్నిటినీ అంచనా కట్టినప్పుడు 1998లో మూడో స్థానంలో నిలిచిన హైదరాబాద్ నగరం 2001 నాటికి ఏడో స్థానానికి దిగజారింది.

రాష్ట్రంలో అటు కాంగ్రెస్ పాలనలోగాని, ఇటు దేశం పాలనలోగాని పారిశ్రామిక విధానాలకు కొదవలేదు. పరిస్థితుల్లో వస్తున్న మార్పుల కనుగుణంగా, విధాన ప్రకటనలను సవరిస్తూ వచ్చాయి. కాని ప్రోత్సాహకాలు, మినహాయింపులు ప్రకటించటమే ఒక విధానంగా మారిపోయింది. ఇలాంటి ప్రోత్సాహకాలు ప్రకటించటంలో రాష్ట్రాల మధ్య పోటీ పెరిగింది. పారిశ్రామీకీకరణలో ప్రోత్సాహకాలకు ఓ పాత్ర వుంది. కాని అదే ఒక విధానం కానేరదు. మౌలిక సౌకర్యాల కల్పనే పారిశ్రామిక విధానానికి పునాది అనే విషయం పాలకుల తలకాయల్లో చోటు చేసుకోలేదు. కొంతమంది బాధ్యత గల పారిశ్రామిక వేత్తలు ప్రోత్సాహకాల కన్నా, మౌలిక సౌకర్యాల కల్పనకే ప్రాధాన్యత నివ్వాలని ప్రభుత్వానికి చెబుతూ వచ్చారు. కాని ప్రోత్సాహకాలు కల్పించడమనే షార్ట్‌కట్‌తో లక్ష్యాన్ని సాధిద్దామనే ఆలోచన సహజంగానే ఫలితాన్నివ్వలేదు.

భారీ పరిశ్రమల స్థాపనే పారిశ్రామీకరణ కాదు

భారీ పరిశ్రమల స్థాపనే పారిశ్రామీకరణ అనే పొరపాటు ఆలోచన మరొక ప్రతిబంధకంగా పరిణమించింది. ఇలాంటి తలంపే, పెట్టిన కాసిన్ని పరిశ్రమలు హైదరాబాద్ పరిసరాలకు విశాఖలాంటి నగరానికి మాత్రమే పరిమితమైపోయాయి. దారుణంగా విఫలమైన పారిశ్రామిక వాడల విధానానికి కూడా ఇదే కారణం. ఈ వాడల వైఫల్యం స్థానికంగా పారిశ్రామిక రంగంలో అడుగుపెట్టిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల ఉత్సాహాన్ని చంపేసింది. చేతులు కాల్చుకొన్న

ఔత్సాహికులు సినిమాలు, హోటళ్లు, 'మందు' దుకాణాలు, స్టాక్ మార్కెట్‌లో చిన్న పెట్టుబడులకు వారి నిధులను మళ్లించారు. ఇది విశృంఖలతకు, డబ్బు చేసుకోవడం, మరింత సంపాదించాలనుకోవటం, అందుకు అడ్డదారులు తొక్కడం లాంటి పెడ ధోరణులకు దారితీసింది. ఒక దశలో స్థానిక వనరులతో, చిన్న పేపర్ మిల్లులు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ఏర్పాటయ్యాయి. ఇది పారిశ్రామిక వాతావరణం ఏర్పడటానికి, ఒక కల్చర్ పెంపొందించడానికి తోడ్పడుతుందనే ఆశ చాలాకాలం నిలవలేదు. జిల్లాల్లో ఏర్పాటయిన చిన్న పరిశ్రమలు అప్పటికి, ఇప్పటికీ నిధులు, మార్కెట్ సమస్యలతో సతమతమవుతూనే వున్నాయి; కాయిలాపడుతున్నాయి. స్థానికంగా లభ్యమయ్యే సహజ వనరులతో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలనే ఆలోచన, ఆచరణ కొరవడిందంటే దానికి కారణం భారీ పరిశ్రమల ఏర్పాటు మాత్రమే పారిశ్రామీకరించటం అనే పొరపాటు భావనే.

విదేశీ పెట్టుబడుల కోసం వెంపర్లాట

ఈ వైఫల్యాలు మరో ప్రమాదకరమైన పొరపాటు ఆలోచనకు దారితీశాయి. అలాంటి ఆలోచన బలపడటానికి ప్రపంచబ్యాంకు ఒత్తిడి మరో కారణం. రాష్ట్రంలో ముందుకొచ్చిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను వెనక్కు పోకుండా ముందుకు తీసుకొని వెళ్లలేకపోయిందంటే, అలాగే మౌలిక సౌకర్యాల కల్పనలో వైఫల్యం వల్ల దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తల గ్రూపులు రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టడానికి అయిష్టత చూపాయంటే దానికి ప్రభుత్వ విధానాలే కారణమని గ్రహించటం పోయి, విదేశీ పెట్టుబడులు రాష్ట్రంలోకి ప్రవహించడమే పరిష్కారం అనే నిర్ణయానికి వచ్చి, ఆ పెట్టుబడుల కోసం వెంపర్లాడడం ప్రారంభమైంది.

ఇది ప్రస్తుత ముఖ్యమంత్రి ఆలోచనల్లో పూసల్లో దారంలా మనకు కనిపిస్తుంది. రుణం తెచ్చుకోనిదే అభివృద్ధి సాధ్యం కాదనే ఆలోచనలో భాగమే ఇది. స్వయం పోషణ, స్వయం సమృద్ధి విడనాడాలని, దేశం తలుపులు బార్లా తెరిచి, విదేశీ పెట్టుబడులను ఆహ్వానించాలని, ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రయివేటీకరించాలనే షరతులతో రుణం ఇవ్వటంతో దేశం, రాష్ట్రాలు ఆ ఆదేశానికి తలవంచాయి. పారిశ్రామిక పెట్టుబడులు విదేశాల నుంచి రావటమే పారిశ్రామీకరణకు ఏకైక మార్గమనే రంధిలో పడిపోయాయి. ముఖ్యమంత్రి విదేశాలు తిరిగివచ్చారు. సిఐఐ సంస్థతో కలిసి రెండుసార్లు పారిశ్రామిక మేళాలు నిర్వహించారు. టిక్కున బోణీలేదు. గత నాలుగైదు సంవత్సరాలుగా ముఖ్యమంత్రికి ఒకే ఒక ప్రాజెక్టు పరిశ్రమ లక్ష్యంగా వుంటూ వచ్చింది. అది కార్ల ప్రాజెక్టు. రెండు దేశాలు ఆశచూపి, వొట్టి చేతులు చూపించాయి. ప్రస్తుతం జర్మనీ దేశంతో తనఅదృష్టాన్ని పరీక్షించుకొంటున్నారు. కార్ల తయారీ కాకపోతే, కనీసం కార్ల రేస్ ప్రాజెక్టు అయినా దక్కుతుందో లేదో. రాష్ట్రంలో పరిశ్రమ పెడతామని చెప్పినవాళ్లు చాలామంది ఉన్నారు. వచ్చినవాళ్లని వేళ్లమీద లెక్కించవచ్చు. ప్రతిపాదించిన పెట్టుబడుల్లో వాస్తవరూపం దాల్చినవి 34.95శాతం మాత్రమే. అయినా ప్రతిపాదించిన పెట్టుబడులన్నీ వచ్చేసినట్లు ప్రచారం చేసి ప్రజలకు ప్రభుత్వం తప్పుడు సమాచారం అందిస్తుంది. ఈ కింది పట్టిక చూడండి.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు

(31-7-2002 నాటికి)

(రు. కోట్లు)

	అందిన ప్రతిపాదనలు		ఉత్పత్తి ప్రారంభించినవి	
సం.	పరిశ్రమలు	విదేశీఈక్విటీ	పరిశ్రమలు	విదేశీఈక్విటీ
1991	7	3	× ×	× ×
1992	21	140	1	0.31
1993	54	560	9	45
1994	82	1044	11	28
1995	85	889	25	77
1996	68	2363	16	57
1997	51	2438	36	725
1998	32	2740	17	243
1999	65	139	14	188
2000	60	619	20	1013
2001	176	631	119	329
2002	85	1529	21	1335
మొత్తం	786	13094	289	3840

మూలం: పరిశ్రమల శాఖ

ఏతావాత జరిగిందేమిటంటే స్థానికుల్ని బెదరగొట్టేశారు. ఇతర రాష్ట్రాలవారు ఆసక్తి చూపలేదు. ఇతరదేశాల వారు వస్తామని రాలేదు. ఉన్న పరిశ్రమల మూసివేత, రాని పరిశ్రమల కోసం ఎదురుచూపులు. ఆంధ్రప్రదేశ్ ఓ పరిశ్రమల శ్మశానవాటిక.

ప్రపంచ బ్యాంకు ఆదేశాలు అమలు - ఐ.టి. ఆలాపన

పారిశ్రామీకరణ పట్ల ప్రస్తుత ప్రభుత్వ వైఖరి యాదృచ్ఛికమైనదేమీ కాదు. మనసారా ప్రయత్నించినా జాతకబలం లేక కాదు. కారణం చంద్రబాబు చేతిలో ఏమీలేదు. ప్రపంచ బ్యాంకు షరతు ప్రకారం ప్రస్తుతమున్న పరిశ్రమలు మూతపడాలి, లేదా ప్రయివేటీకరణ జరగాలి. పరిశ్రమలకు కావాల్సిన విద్యుచ్ఛక్తి లాంటి మౌలిక సౌకర్యం కూడా పూర్తిగా ప్రయివేటీకరించాలి. నీరు కూడా ప్రయివేటీకరణ బాటలో వుంది. ఇలా అన్ని విధాలా లైన్ క్లియర్ చేస్తే విదేశీ పెట్టుబడులు రావడానికి మార్గం సుగమమవుతుంది. ప్రపంచ బ్యాంకుకు ఇలాంటి

ఆలోచన వుందంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. బహుళజాతి సంస్థలు, సామ్రాజ్యవాద దేశాలు బ్యాంకుకు ఇచ్చిన పనే అది. రాష్ట్ర పాలకులు ఇదంతా తమ ప్రభుత్వ విధానమని చెప్పడమే మనం సిగ్గుపడాల్సిన విషయం. ఈ దారుణ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐ.టి.) మంత్రజపం ప్రారంభించారు. ఐటిలో కొంత అభివృద్ధి కనపడుతోంది. కాగా దాన్నే పారిశ్రామికాభివృద్ధి అనే భావన కలిగించడానికి ముఖ్యమంత్రి రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. వ్యవసాయానికి, పరిశ్రమకు ఐటి ఒక సేవ మాత్రమే, అదే పరిశ్రమ కానేరదు. కాని ముఖ్యమంత్రి దృష్టిలో ఐటియే సర్వరోగ నివారిణి అయిపోయి కూర్చొంది. పరిపాలనా వ్యవస్థలో అన్ని అవకతవకలకు ఐటియే మందు. 'మీ భవిష్యత్తు ఐటి విస్తరణలోనే' వుంది అంటూ యువతను తప్పుదారి పట్టిస్తున్నారు. **ఇప్పుడు ఔట్‌సోర్సింగ్ పేరుతో కొన్ని బహుళ జాతి సంస్థలు, కొన్ని పరిశోధనా సంస్థలు విదేశాల నుంచి మనదేశంలో కొన్ని ఉద్యోగావకాశాలు కల్పించవచ్చుగాక, కాని కోట్లలో నిరుద్యోగుల సంఖ్య హద్దులేకుండా పెరుగుతున్న పరిస్థితుల్లో కొన్ని వేలమందికి ఉద్యోగం దొరికితే నిరుద్యోగ సమస్య పరిష్కారమైపోదు. ఇదొక భ్రమ మాత్రమే.**

ప్రజారంగ సంస్థలు ప్రైవేటుపరం

చంద్రబాబు తన ఆత్మను, ఆలోచనలను ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టేసిన తర్వాత, ఆయన హిజ్ మాస్టర్స్ వాయిస్‌కు అనుగుణంగా పారిశ్రామీకరణ అంటే ప్రయివేటీకరణ అని ఆయన డిక్షనరీలో తిరగరాసుకొని, కత్తిపీటతో మామిడికాయలను నరికినట్లు, ప్రభుత్వరంగ పరిశ్రమల శిరచ్ఛేధం ప్రారంభించారు. అదేదో పెద్ద ఘనకార్యం సాధించేసినట్లు ఇన్ని పరిశ్రమలను వదిలించుకొన్నా, ఇంకా ఇన్ని పరిశ్రమలను ఫలానా సంవత్సరం లోపల సంహారం చేస్తాను అని గణాంకాలు అప్పచెప్పటం ప్రారంభించారు. ఆ పరిశ్రమల్లో పెట్టిన డబ్బు ప్రజల డబ్బు. తాను ప్రజలకు జవాబుదారీ అనే ఆలోచన లేకుండా బాధ్యతారహితంగా మూసివేయటం గాని, ప్రయివేటు రంగానికి కారుచవుకగా అమ్మివేయటం గాని జరుగుతుంది. ఉదాహరణకు ఒకప్పుడు ఆసియాలోనే పెద్ద కర్మాగారంగా పేరుగడించిన నిజాం షుగర్స్ ఫాక్టరీ విలువ సుమారు 200కోట్లుంటుందని అంచనా. కన్సల్టెంట్‌గా నియమించిన ఆడమ్ స్మిత్ ఇన్‌స్టిట్యూట్ దాని విలువ 60కోట్లేనని నిర్ధారించింది. ఈ సంస్థను కొనుగోలు చేసిన డెల్టా పేపర్ మిల్స్ అనే కంపెనీ మొదట రూ.10.5కోట్లు చెల్లిస్తుంది. అయిదేళ్ల తర్వాత మిగతా మొత్తాన్ని చెల్లిస్తుంది. ఈలోగా రాష్ట్ర ప్రభుత్వం అమ్మకం పన్నుల్లా రాయితీలు ఇతరత్రా కలిపి డెల్టా పేపర్‌మిల్స్‌కు రూ.70కోట్ల రాయితీలిచ్చింది. అమ్మేసిన ప్రతి ఫ్యాక్టరీ వెనుక ఇలాంటి కథ ఒకటి వుంది. ఈ లావాదేవీల్లో ఎవరెవరి జేబులు నిండాయో ఎవరికి తెలుసు? సింగపూర్, అరబ్‌దేశాలు, అమెరికా, స్విట్జర్లాండ్ దేశాలనడిగితే తెలియవచ్చు!

ఇక్కడ కొన్ని గణాంకాలను పరిశీలించితే పైన చేసిన జనరల్ విశ్లేషణ సరైనది అవునో, కాదో అర్థం చేసుకోవచ్చు.

స్థూల రాష్ట్రాదాయంలో తయారీరంగం (మాన్యుఫ్యాక్చరింగ్-ఇందులో రిజిస్టరయిన, కాని పరిశ్రమలుంటాయి) వాటా మార్పు(పర్సంటేజ్ చేంజ్) రానురాను దిగజారిపోతూ వచ్చింది.

(నిలకడ ధరల ప్రకారం)

మాన్యుఫాక్చరింగ్	95-96	96-97	97-98	98-99	99-00	00-01	01-02
రిజిస్టర్డ్	5.85	6.16	4.84	6.33	-1.19	-1.20	2.33
అన్-రిజిస్టర్డ్	16.50	2.51	6.01	5.30	0.85	6.85	2.92

(ఎకనామిక్ సర్వే 02-03)

మొత్తం సెకండరీ రంగం, అంటే మాన్యుఫ్యాక్చరింగ్, విద్యుచ్ఛక్తి సరఫరా, నిర్మాణం రంగాలన్నింటినీ కలిపి చూస్తే 95-96లో అంతకు క్రితం సంవత్సరంతో పోల్చి చూస్తే 5.79శాతం పెరగగా, 2000-01లో ఈ పెరుగుదల 2.82శాతానికి పడిపోయింది. (ఈ గణాంకాలన్నింటికీ 1993-94 స్థిర ధరల ఆధారం)

సేవారంగం పెరుగుదల బలుపుకాదు

పారిశ్రామిక రంగం ఒక పక్క ఇలా దిగజారుతుంటే, 2020లో ఏర్పడబోయే స్వర్ణాంధ్రలో, అంటే విజన్ 2020లో పేర్కొన్న లక్ష్యాలు సాధ్యమా అని సెస్ మాజీ డైరెక్టర్ పి.వెంకట్రామయ్య, ఎల్.జి.బురంగే ఒక విశ్లేషణా పత్రంలో ప్రశ్నించారు. వారేమంటున్నారో చూద్దాం.

"1995 నుంచి 2020 మధ్యకాలంలో స్థూల రాష్ట్రాదాయం సాలీనా 10.3శాతం చొప్పున, తలసరి ఆదాయం తొమ్మిది రెట్లు పెరుగుతుంది. ఇందులో పారిశ్రామిక రంగం వాటా పైన ఉదహరించిన కాలంలో 18 నుంచి 21శాతానికి పెరగాలి. ఈ పెరుగుదల పెద్ద అసాధ్యం కాని విషయం కాకపోయినా, వాస్తవంలో చూస్తే ఆ కాలంలో 15రెట్లు పెరగాలి. సాలీనా పెరుగుదలరేటు 11శాతం వుండాలి. అది జరగాలంటే 25 సంవత్సరాల్లో రూ.11,65,000కోట్లు పెట్టుబడి పెట్టాలి.....కాని గత అనుభవం నేపథ్యంలో చూసినపుడు ఈ లక్ష్యాలు మీరు ఊహించలేనంత ఎక్కువగా వున్నాయి. గత 25 సంవత్సరాల్లో పారిశ్రామికరంగం నుంచి ఆదాయం కేవలం మూడు రెట్లు పెరగగా, వచ్చే 20ఏళ్లలో 13రెట్లు పెరగటం సాధ్యమా? అలాగే గత 25ఏళ్లలో

15లక్షల మందికి మాత్రమే ఉద్యోగవసతి చూపగా వచ్చే 25ఏళ్లలో 80లక్షల మందికి ఉద్యోగాలు కల్పించగలదా? 11లక్షల కోట్ల పెట్టుబడి పెట్టగలిగినప్పుడే అది సాధ్యం. (పే.271 ఆంధ్రప్రదేశ్ డెవలప్‌మెంట్ సెస్ పబ్లికేషన్). ఇప్పటికే పారిశ్రామిక రంగాన్ని పూర్తిగా పక్కకు తొలగించి సేవల రంగానికి అంకితమైపోయిన ప్రభుత్వం విజన్ 2020 నాటికి రాష్ట్రం ఏమవుతుందో తలచుకోవడానికే భయంవేస్తుంది. సేవలరంగం పెరుగుదలకు కారణం ఆ సేవలు ఎక్కువగా ఎగుమతులు పెరగడానికే ఉపయోగపడుతాయి. కాని, స్థానిక డిమాండు వుండటం వల్ల కాదనేది గమనించాల్సిన విషయం. విదేశాల డిమాండు మీద ఆధారపడే సేవలు కాని, పరిశ్రమలు కాని పెరగడానికి పరిమితులుంటాయి. సేవల రంగం పెరుగుదలను చూచి సంతోషించడం చూస్తే వాపును చూసి బలుపు అనుకోవటంలా వుంటుంది.

చిన్న పరిశ్రమలు

భారీ పరిశ్రమలే అంతర్ధానమై పోతుంటే, అసలు పరిశ్రమల మీదే ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంటే చిన్న పరిశ్రమల గురించి ఎవరు పట్టించుకొంటారు? రుణ సౌకర్యం ముఖ్యంగా వర్కింగ్ కాపిటల్, మార్కెటింగ్- ఈ రెండు ప్రధాన సమస్యలూ చిన్న పరిశ్రమలను ఆనాటి నుంచి ఈనాటి వరకూ వేధిస్తూనే వున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లాంటి వ్యవసాయ రాష్ట్రంలో చిన్న పరిశ్రమలు కీలకపాత్ర వహించగల శక్తి కలవని, పారిశ్రామిక కల్చర్ రాష్ట్రమంతటా వ్యాపించటానికి తోడ్పడతాయని ప్రభుత్వం గమనించకపోవటం దురదృష్టకరం. అవి ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తాయి, గ్రామీణ ప్రాంతాల వరకూ చొచ్చుకుపోతాయి. గ్రామీణ పేదలకు అందుబాటులో వుండే ధరకు-ఉత్పత్తులను అందిస్తాయి. స్వావలంబనకు తోడ్పడతాయి. అభివృద్ధి కార్యక్రమాల్లో చిన్న పరిశ్రమల స్థాపన ఒక సోపానం. 2001-02 నాటికి రాష్ట్రంలో 1,41,972 రిజిస్టర్ చేసిన చిన్న పరిశ్రమలున్నాయని, వాటిలో 12,59,589మంది పనిచేస్తున్నారని అధికారిక లెక్కలు. అయితే, వాటిలో స్థిర పెట్టుబడి, పెరుగుదల 90వ దశకం మధ్యకాలంలో 14-15శాతం నుంచి, మిగతా కాలంలో ఒకటి శాతం కన్నా తక్కువకు పడిపోయింది. రాష్ట్రంలో చిన్న పరిశ్రమల సంఖ్య పెరుగుతూ వచ్చినా, పక్కనే ఉన్న తమిళనాడులో కన్నా సగమే రాష్ట్రంలో వున్నాయి. చిన్న పరిశ్రమల్లో పెట్టుబడులు పరిశ్రమల శాఖ లెక్కల ప్రకారం 94-95 వరకూ 14-15శాతం పెరుగుదల కనిపించగా (ముందు సంవత్సరంతో పోలిస్తే), 95-96 నుంచి 1999-2000 వరకూ (1998-99) మినహాయించి) ఈ పెరుగుదల రేటు 0.3 నుంచి 0.17శాతం మధ్యనే వుందంటే చిన్న పరిశ్రమల పట్ల ప్రభుత్వం ఎంత చిన్న చూపు చూస్తుందో అర్థం చేసుకోవచ్చు. చిన్న పరిశ్రమలకు రెండు కొత్త సమస్యలు వచ్చిపడ్డాయి. రాష్ట్రప్రభుత్వం బహుళ జాతి సంస్థల ఏజన్సీ పుచ్చుకొని, వారి ఉత్పత్తులను డ్వాక్రా సంఘాల ద్వారా అమ్మచూపుతుంది. దీనితో అదే ఉత్పత్తులను తయారుచేసే చిన్న పరిశ్రమల ఉనికి ప్రశ్నార్థకమవుతోంది. దేశంలో 30శాతం మంది మధ్యతరగతి జనాభా వున్నారనే తప్పుడు లెక్కలు వేసుకొని బహుళ జాతి సంస్థలు ఆచరణలో ఎదురు దెబ్బతినేసరికి, వారి దృష్టిని గ్రామీణ మార్కెట్ల వైపు మరలించి వారి కొనుగోలు శక్తికి సరిపోయే చిన్న పాకెట్లలో అమ్మకం ప్రారంభించి చిన్న పరిశ్రమల, చిన్న వ్యాపారస్థులను దెబ్బతీస్తున్నారు. దీంతో చిన్న పరిశ్రమల భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది.

ఏం చెయ్యాలి?

1. వ్యవసాయం తర్వాత పరిశ్రమలు, ఆ తర్వాత సేవారంగం - ఇదీ ఏ దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అయినా పయనించాల్సిన మార్గం. కాని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రైలుబండి పట్టాలు తప్పింది. మధ్యన వున్న పరిశ్రమలను దాటి నేరుగా సేవారంగంలో దూసుకుపోవడానికి ప్రయత్నిస్తోంది. ఈ రైలును పట్టాల మీదకు తిరిగి ఎక్కించాలి.
2. రాష్ట్రంలో వున్న సహజ వనరుల ఆధారంగా పరిశ్రమలను నెలకొల్పడానికి పెద్దపీట వెయ్యాలి. ఆగ్రో-ప్రాసెసింగ్ పరిశ్రమ అభివృద్ధిపై కేంద్రీకరించాలి.
3. మౌలిక సౌకర్యాల కల్పనలో వైఫల్యాన్ని అధిగమించితే పరిశ్రమలు పిలవకుండానే వస్తాయి.
4. పై పనులు చేయగలిగితే విదేశీ పెట్టుబడుల కోసం వెంపర్లాడనక్కర్లేదు. అవే పరుగులు తీస్తూ వస్తాయి.
5. ప్రతీ దానికి విదేశాల వైపు చూచే మనస్తత్వాన్ని పాలకులు మార్చుకోవాలి.
6. ఎక్కువ మందికి ఉద్యోగావకాశాలు కల్పించే పరిశ్రమలకు ప్రథమస్థానం ఇస్తే, రాష్ట్రంలో కొనుగోలు శక్తి పెరుగుతుంది. పారిశ్రామిక ఉత్పత్తులకు డిమాండు పెరుగుతుంది. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి తోడ్పడుతోంది. ○

వ్యవసాయంపై ప్రపంచీకరణ ప్రభావం

-సారంపల్లి మల్లారెడ్డి

దేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచీకరణ విధానాలు అమలు జరుపుతున్న ఒక ప్రయోగశాల - విదేశాంగ విధానం,ఆర్థికం, రుణాల సేకరణ వంటి కీలకాంశాలు దేశ రాజధానిలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు చేయాల్సి ఉన్నప్పటికి, రాజ్యాంగానికి అతీతంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేరుగా విదేశీ సంబంధాలు కల్గి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతో లావాదేవీలు నిర్వహించుచున్నది. ఆర్థిక విధానాలకు, రుణాల సేకరణకు రాష్ట్రానికి అవసరమైనప్పుడు కేంద్రం అనివార్యంగా ఆమోదముద్ర వేస్తున్నది. రాష్ట్ర పాలకవర్గం యొక్క చేయూత కేంద్రానికి కీలకావసరంగా ఉంది. 1995లో ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పడినాక ప్రపంచ బ్యాంకు ద్వారా ఆ సంస్థ తన ఆర్థిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నది. సువిశాలమైన భారతదేశ మార్కెట్లపై దృష్టి పెడ్తూనే ప్రపంచబ్యాంకు ఆంధ్రప్రదేశ్‌లో "ఆర్థిక పునఃనిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టింది. దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ప్రపంచ బ్యాంకుకు ఆహ్వానం పలకడమే కాక ప్రపంచ బ్యాంకు నుండి వచ్చిన కన్సల్టెంట్లనే అన్ని రంగాలలో పెట్టి పాలన సాగిస్తున్నారు. వారి సలహాలు నేడు రాష్ట్ర ప్రభుత్వానికి శిరోధార్యాలు.

ప్రపంచ వాణిజ్య సంస్థ షరతులు/ఒప్పందాలు:

1. వ్యవసాయరంగానికి సంబంధించిన ఒప్పందం.
2. మార్కెట్టు స్వేచ్ఛ గురించిన ఒప్పందం.
3. విదేశీ పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందం.
4. జౌళి వస్త్రాల, వ్యాపారం గురించి ఒప్పందం.
5. సేవా రంగానికి సంబంధించిన ఒప్పందం.

పై ఒప్పందాలకు అంగీకరించిన ముఖ్యమంత్రి ప్రపంచబ్యాంకు నుండి సంస్థాగత మార్పులకు రుణం తెచ్చాడు. రుణం పొందు సందర్భంలో బ్యాంకు విధించిన షరతుల అమలుకు పూనుకున్నాడు.

1. వ్యవసాయ రంగానికి సంబంధించిన ఒప్పందం ప్రకారం వ్యవసాయ రంగానికి ఇస్తున్న అన్ని రకాల సబ్సిడీలను, ప్రోత్సాహకాలను తగ్గించాలి. వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న సహకార రంగాన్ని ఎత్తివేయాలి. వ్యవసాయ రంగంలో ప్రభుత్వం జోక్యం తగ్గాలి. ఈ రంగానికిస్తున్న అన్ని రకాల క్రాస్ సబ్సిడీలను ఉపసంహరించాలి. ప్రభుత్వ పెట్టుబడులు తగ్గించాలి లేదా ఉపసంహరించాలి. ఒక్కమాటగా చెప్పాలంటే వ్యవసాయరంగం, దాని అనుబంధ రంగాలలో ప్రభుత్వ వ్యయం ఉత్పత్తి రంగంపై కాకుండా అనుత్పాదితం(టూరిజం)పై పెట్టాలి. వ్యవసాయ రంగంలోకి బహుళజాతి సంస్థలను ఆహ్వానించి వారి పెట్టుబడులు పెంచాలి. వారి పెట్టుబడులకు రక్షణగా ప్రస్తుత చట్టాలను మార్చాలి లేదా సవరించాలి. వ్యవసాయరంగంలో అన్ని సెక్షన్లలో సంస్థాగత మార్పులు నిర్దిష్టకాలంలో పూర్తిచేయాలి.

2. మార్కెట్టులో ప్రభుత్వ కొనుగోలు సంస్థల ప్రాతినిధ్యం తగ్గించాలి. క్రమంగా తొలగించాలి. ప్రపంచ మార్కెట్టులో పోటీకి ఆంధ్రప్రదేశ్ రైతును సన్నద్ధం చేయాలి.

3. విదేశీ పెట్టుబడులను ఆహ్వానించాలి. అందుకనుగుణంగా వ్యవసాయాధారిత సహకార-ప్రభుత్వ పరిశ్రమలన్నింటిని ప్రైవేటుపరం చేయాలి. వ్యవసాయ రంగంపై ఆధారపడిన వారి సంఖ్యను సగానికి సగం తగ్గించాలి. భారీ యంత్రాల ద్వారా వ్యవసాయం కొనసాగించాలి. కమతాలు వేల ఎకరాలలో నుండునట్లు చేయాలి.

పై ఒప్పందాల అమలు చేస్తానికి 1997 నుండి రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలోని విభాగాలపై కేంద్రీకరించి సంస్థాగత మార్పులు ప్రారంభించింది.

1. విద్యుత్ ప్రైవేటీకరణ
2. విత్తనాలు - క్రిమిసంహారక మందుల ఉత్పత్తిలో బహుళజాతి సంస్థల ప్రవేశం.
3. సాగునీరుకు ప్రత్యామ్నాయ విధానాలు
4, మార్కెట్టు స్వేచ్ఛ.
5. పత్తి - చెరకు - పాల ఫ్యాక్టరీల ప్రైవేటీకరణ
6. రుణం - సహకార చట్టాల మార్పులు.
7. వాణిజ్య పంటలు - పత్తి - చెరకు - పొగాకు - ఆక్వా - ఔషధమొక్కలు - మల్బరీ తోటల పెంపు, ఆహార పోటీల తగ్గింపు.
8. కాంట్రాక్టు వ్యవసాయం - కార్పొరేటు వ్యవసాయం - ప్రవేశం.

పై అంశాల అమలుకు సమూలమైన సంస్థాగత మార్పులు రాష్ట్ర ప్రభుత్వం చేసింది.

ఈ మార్పుల ఫలితం వ్యవసాయ రంగాన్ని తీవ్ర కుదుపులకు గురిచేస్తున్నది. వ్యవసాయం రాష్ట్ర జాబితాలోనిది కావడం వలన మార్పులు వేగవంతంగా అమలు జరిగాయి. ఫలితాలు కూడా అంతే వేగవంతంగా వచ్చాయి. ప్రభుత్వం ఈ మార్పులకు "సంస్కరణ"ల

నామధేయం పెట్టింది. చంద్రబాబు పాలనా కాలంలో వ్యవసాయ రంగంలో సాధారణ ఉత్పత్తి తగ్గింది. ఈ సంస్కరణల ఫలితాలను పరిశీలిద్దాం.

వ్యవసాయ రంగంలో రాష్ట్ర సాధారణ ఉత్పత్తి తగ్గుదల

సంవత్సరం	సాధారణ ఉత్పత్తి (రూ.లక్షలలో)	సాధారణ ఉత్పత్తి	వ్యవసాయ రంగం మొత్తం సాధారణ ఉత్పత్తిలో	గ్రోత్ రేటు
1996-97	6880900	1535592	22.32	7.99
1997-98	6786579	1164652	17.16	-24.16
1998-99	7611624	1589036	20.88	36.44
1999-00	7960474	1416405	17.79	-10.86
2000-01	8552204	1633969	19.11	15.36
2001-02	8876489	1522084	17.15	-6.85
2002-03	9105519	1195828	13.13	-21.43

1. **విద్యుత్ ప్రైవేటీకరణ:** వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం అత్యంత ప్రాధాన్యమైంది. ప్రభుత్వం సాగునీటి కల్పనలో చేస్తున్న నిర్లక్ష్యం ఫలితంగా విద్యుత్ వాడకం పెరిగింది. ఈ రంగంలో విద్యుత్ వినియోగం వల్లనే వ్యవసాయోత్పత్తులలో 30శాతం అదనపు ఉత్పత్తి జరుగుచున్నది. ఎద్దులు, ఆయిల్ ఇంజన్ల ద్వారా 1955-56లో బావుల క్రింద 2.34లక్షల హెక్టార్లు సాగుకాగా, 2001-02లో 19.28లక్షల హెక్టార్లకు సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ పెరుగుదల రావటానికి రాష్ట్రంలో 20లక్షల బావులకు విద్యుత్ పంపు సెట్ల వినియోగం కారణం. వెనుకబడిన ప్రాంతాల వారికి మెట్ట ప్రాంతాల వారికి ప్రధాన జీవనాధారం బావుల సేద్యం అయ్యింది.

సంస్కరణల పేర ముఖ్యమంత్రి చంద్రబాబుగారు వ్యవసాయ రంగానికి ఇస్తున్న విద్యుత్‌ను తగ్గించాలని నిర్ణయించారు. ప్రపంచ బ్యాంకు ఆదేశాల ప్రకారం ఈ చర్యలు చేపట్టారు. మొదట 1996లో జూన్‌లో విద్యుత్ రంగంపై శ్వేతపత్రం ప్రకటించారు. అందులో వ్యవసాయానికి విద్యుత్ వినియోగం 1985-86లో 23.60శాతం వినియోగించగా, 1995-96 నాటికి విద్యుత్ ఉత్పత్తిలో 50.87శాతం వినియోగిస్తున్నట్లు వివరించారు. పరిశ్రమలకు 1985-86లో 50.50శాతం వినియోగించగా 1995-96 నాటికి 26 శాతానికి తగ్గినట్టు చెప్పారు. కీలకమైన పరిశ్రమలకు విద్యుత్ వినియోగం పెంచాలంటే వ్యవసాయానికి తగ్గించాలన్న ప్రతిపాదన తెచ్చింది. అందుకనుగుణంగా 1993-94లో 86.99కోట్ల లాభాల్లోనున్న విద్యుత్ సంస్థను 95-96లో రూ॥1128.50కోట్ల నష్టాల్లో నడుస్తున్నట్లు చూపారు. ఈ నష్టానికి కారణం వ్యవసాయ విద్యుత్ వాడకంగా పేర్కొన్నారు. ఈ నంష్ట 1999-2000 వచ్చేనాటికి రూ.3058.80కోట్లకు పెరిగింది. 1999-2000 నాటికి నష్టాలను 38.1శాతంగా చూపారు. అలానే వ్యవసాయ రంగ విద్యుత్‌కి ఇస్తున్న క్రాస్ సబ్సిడీల వలన పరిశ్రమలు నష్టపోతున్నాయని, సబ్సిడీ ఇవ్వడం వలన ప్రభుత్వంపై భారం పెరిగిందన్న వాదనతో వ్యవసాయ విద్యుత్ వినియోగంలో సంస్కరణలు ప్రవేశపెట్టారు.

1. విద్యుత్ సంస్థను మూడుముక్కలుగా విడగొట్టి జెన్‌కో - ట్రాన్స్‌కో - డిస్కాంగా చేస్తూ ప్రైవేటీకరణ ప్రారంభించారు.
2. వ్యవసాయ విద్యుత్ టారిఫ్‌రేట్లు 12రెట్లు పెంచారు. డెవలప్‌మెంటు చార్జీలు వేస్తున్నారు.
3. విద్యుత్ సరఫరాను 9గంటలకే పరిమితం చేశారు.
4. మీటర్లను [illegible]ంచి విద్యుత్ వాడకం ప్రకారం చార్జీలు చెల్లించే [illegible]ధాన[illegible]రారంభించారు.
5. కరువున్నా, కాటకాలున్నా నిర్బంధ వసూళ్ళు పెంచారు. జప్తులు, జరిమానాలు నిత్యకృత్యం చేశారు. కనక్షన్లు తొలగించారు.
6. కొత్త కనెక్షన్లపై నియంత్రణ పెట్టారు.

ఇందుకు చట్టాన్ని రూపొందించి, రెగ్యులేటరీ కమిషన్ ద్వారా పై చర్యలు అమలుచేశారు. ఈ కమిషన్‌ను 31-3-99న ఏర్పాటుచేశారు.

వాస్తవానికి వ్యవసాయ విద్యుత్ వినియోగం అంచనాలు తప్పులతడకయని తేలింది. ప్రముఖ ఇంజనీరు శ్రీ ఎం.హెచ్.పి.రావుగారు సర్వే చేసి 12శాతంగా తేల్చారు. శాంపిల్ సర్వేగా ట్రాన్స్‌కో "ఎ.పి.ప్రొడక్టివిటి కౌన్సిల్ సంస్థ"ను వినియోగించగా ఆ సంస్థ సర్వే చేసి 4751మిలియన్ యూనిట్లు మాత్రమేనని తేల్చింది. కాని ట్రాన్స్‌కో 9362మిలియన్ యూనిట్లుగా తేల్చింది. ట్రాన్స్‌కో మొత్తం కొనుగోళ్ళు 42189 మిలియన్ యూనిట్లు.

పై సంస్కరణల వలన విద్యుత్ భారాలు పెరిగాయి. నాణ్యతలేని కరెంటు సరఫరా వలన మీటర్లు కాలి మరింత నష్టం పెరిగింది. సరఫరా లేక పంటలు ఎండిపోతున్నాయి. బావుల వ్యవసాయం అనిశ్చితిగా మారింది. ఒక్కోబావికి రూ.40వేల నుండి రూ.50వేల పెట్టుబడులు పెట్టారు. ఒక్కో పొలంలో నీరులేక 10 నుండి 20బోర్ల వరకు వేశారు. ఆనందపురంలో శ్మశానంలో బోర్లు వేశారు. రుణభారం పెరిగి పంట లేక బావుల సేద్యం చేస్తున్న రైతులు వందల సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 2003-04 సంవత్సరానికి బావుల సేద్యం 20లక్షల హెక్టార్ల నుండి 10.50లక్షల హెక్టార్లకు తగ్గింది. దీని ప్రభావం రైతులపైననే కాక రాష్ట్ర సమగ్ర ఉత్పత్తి (జి.ఎస్.డి.పి.) తగ్గింపుపై పడింది.

2. **విత్తనాలు - క్రిమిసంహారక మందులు:** ప్రపంచీకరణ వలన విత్తనాలు, క్రిమిసంహారక రంగంలోకి బహుళజాతి సంస్థలు ప్రవేశించాయి. 1996కు పూర్వం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలు సరఫరా చేసింది. స్థానిక ప్రైవేటు విత్తన కంపెనీలు ఉత్పత్తి చేసే విత్తనాలను పరీక్షించి ప్రభుత్వం సర్టిపై చేసిన తర్వాతనే మార్కెట్టుకు విడుదలైనాయి. సంస్కరణల పేర ప్రభుత్వ విత్తన సంస్థలకు చెల్లుచీటి పెట్టారు. ప్రభుత్వ సర్టిఫికేషన్ లేకుండా

ఉత్పత్తిదారుడే తన విత్తనాలు సర్టిఫై చేసే విధంగా చట్టాన్ని సరళీకరించారు. పరస్పర అవగాహన ఒప్పందం (ఎం.ఓ.యు.) విధానాన్ని ప్రవేశపెట్టి ప్రైవేటు విత్తన సంస్థలకే సర్వాధికారాలు కట్టబెట్టారు. హైబ్రిడ్ విత్తనాలకు అలవాటు పడ్తున్న రైతాంగ ఉత్సాహాన్ని గమనించిన బహుళజాతి సంస్థలు స్థానిక ప్రైవేటు కంపెనీలను తమ సంస్థలో కలుపుకొని విత్తన వ్యాపారం సాగిస్తున్నారు. **1997లో** ఒక్కసారిగా విత్తనాల ధరలు మూడురెట్లు పెరిగాయి. నాణ్యతలేని విత్తనాలను మార్కెట్టుకు విడుదల చేసి,ప్రచార/ప్రసార సాధనాల ద్వారాను, గ్రామాల్లోకి ప్రచార దళాలు పంపి విస్తృతంగా ప్రచారం చేశారు. స్థానిక వ్యవసాయాధికారుల జోక్యం తగ్గించారు. ఫలితంగా లక్షలాది ఎకరాలలో వేసిన పంటలు, కాత-పూత లేకుండా ఏపుగా పెరిగాయి. పత్తి, మొక్కజొన్న, మిరప, సజ్జ, వరి, బొప్పాయి, పొద్దు తిరుగుడు తదితర నాణ్యతలేని విత్తనాలు వాడినవారు లక్షలాది మంది నష్టపోయారు. ప్రభుత్వం విధించిన పరస్పర అవగాహన చట్టం పనికిరాకుండా పోయింది. కన్స్యూమర్‌కోర్టులో కేసులు వేసి సంవత్సరాలు గడచినా ఇంత వరకు తీర్పులు లేవు. ప్రభుత్వం ఏర్పరచిన నిజనిర్ధారణ కమిటీలు నాణ్యతలేని విత్తనాలుగా ధృవీకరించారు. అయినా రైతులకు మేలు జరగలేదు. రూ. 8కోట్లతో ప్రభుత్వం చేపట్టిన విత్తనగ్రామ పథకం నీరు కారిపోయింది.

క్రిమిసంహార మందుల ధరలు పెంచడమేకాక, ఆ మందులు చల్లినా, పురుగుచావని స్థితి ఏర్పడింది. నకిలీ లేబిళ్ళతో అక్రమ వ్యాపారం కోట్లలో సాగుతున్నది. పంట వేసిన మొదటి మూడు మాసాలు పైరిత్రాయిడ్ మందులు చల్లకూడదన్న నిబంధనను బహుళజాతి మందుల కంపెనీలు ఉల్లంఘించడం వలన పంటలకు మేలు చేసే క్రిములు నాశనమైనాయి. కీడు చేసే క్రిములు విజృంభించాయి. తేనె పురుగులు, అమెరికన్ పచ్చపురుగు, శనగపచ్చ పురుగులు పెరిగాయి. కోట్ల రూపాయలు ఖర్చు చేసి సస్యరక్షణ చర్యలు చేపట్టినా పంటలు రక్షించుకోలేని స్థితి దాపురించింది. ఎరువుల సబ్సిడీ తగ్గడంతో ధరలు పెరిగాయి.

ఇదే అదనుగా శనగపచ్చ పురుగు నివారణ చేస్తుందంటూ బి.టి. విత్తనాలను మాన్‌శాంటో కంపెనీ, స్థానిక మహికో కంపెనీతో కలిసి వాణిజ్యపరంగా విడుదల చేశాయి. అనుమతులు ప్రయోగాలకు రాగా, వాణిజ్యపరంగా విడుదలచేశాయి. విత్తనాల ధర కూడా మిగిలిన విత్తనాలకన్నా, నాల్గురెట్లు పెంచారు. అయినా ఆశించిన ఫలితాలు రాలేదు. దిగుబడి, పంటల నాణ్యత తగ్గింది. రైతాంగం ఆందోళనలు చేపట్టారు. అయినా బహుళజాతి సంస్థలను నియంత్రించే స్థితిలో ప్రభుత్వం లేదు. విత్తనాలు క్రిమిసంహారక మందుల ద్వారానే లాభాలు సంపాదించే మార్గాలు అనుసరించారు. రైతుకు గ్యారంటీ గల విత్తనం - క్రిమిసంహారక మందులు దొరికే అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వ విత్తన సంస్థలు, పరిశోధన సంస్థలు, సంస్కరణల ఫలితంగా మూతపడినాయి. ఈ రంగాలు బహుళజాతి సంస్థల పరమైనాయి.

3. సాగునీటి సమస్య: పంటలకు సాగునీరు అత్యంత కీలకమైనది. రాష్ట్రంలో మొత్తం సాగుభూమికి కావల్సినంత నీరు నదుల ద్వారా మనకు లభ్యత ఉంది. అనేక భారీ - మధ్యతరహా ప్రాజెక్టులు ప్రారంభించినవి అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తి చేస్తే 60శాతం సాగుభూమికి నీటి సౌకర్యం కల్పించవచ్చు.

రాష్ట్రంలో సాగునీటి విస్తీర్ణం తగ్గుదల (రెండు పంటలకు)

(లక్షల హెక్టార్లు)

సంవత్సరం	కాలువలు	చెరువులు	బావులు	ఇతరం	మొత్తం
1998-99	22.86	9.28	26.44	2.34	60.92
1999-00	22.08	7.19	25.95	2.24	57.46
2000-01	22.02	7.98	26.93	2.23	59.16
2001-02	20.82	6.34	26.18	2.08	55.49
2002-03	14.52	4.54	24.79	1.51	45.36

సాగునీటి నుండి దూరం చేయాలన్న ప్రపంచ బ్యాంకు సంస్కరణల ప్రకారం భారీ - మధ్యతరహా ప్రాజెక్టులు ఈ కాలంలో నిర్లక్ష్యానికి గురికాబడినాయి. నిధులను తగ్గించారు. నిధులు కేటాయించినా విడుదల కాలేదు. గోదావరికి వరదలు రాని సంవత్సరం లేదు. కృష్ణా మిగులు జలాలు ఏటా సముద్రం పాలవుతున్నాయి. రాష్ట్రంలో 4000టి.ఎం.సి. నీరు లభ్యత కాగా 2000మాత్రమే వినియోగిస్తున్నాం. సంస్కరణల ప్రభుత్వం సాగునీటికి ప్రత్యామ్నాయ విధానాలు ప్రారంభించి అమలు జరుపుచున్నది. వాటి వ్యయాన్ని గమనించండి.

జరిగిన వ్యయం

1. నీరు-మీరు:	1-4-2000 నుండి 30.12.2003 వరకు	రూ. 2280.00కోట్లు
2. వాటర్‌షెడ్:	1997-2007 వరకు పథకం	రూ. 970.00కోట్లు
3. ఇంకుడు గుంటలు:	1.4.2000 నుండి	రూ. 150.00
మొత్తం:		రూ. 3400.00కోట్లు

ప్రత్యామ్నాయ విధానం వలన వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలవనరులు పెరుగుతాయని ప్రభుత్వం చెప్పింది. ప్రస్తుత వర్షపునీటిలో 9శాతం అనగా 777టి.ఎం.సి.లు భూగర్భజలాలుగా మారుతున్నాయి. దీనిని 13.5శాతానికి పెంచాలి. పై నిధుల వ్యయం ద్వారా 2003-04 సంవత్సరం మొత్తం 9.5శాతం భూగర్భజలాలుగా మారాయి. రూ. 3400కోట్లు వ్యయం చేస్తే 0.5శాతం భూగర్భ జలాలు పెరిగాయన్నమాట. గత 8 సంవత్సరాలలో 6 సంవత్సరాలు కరవులు 7 సంవత్సరాలు వరదలు వచ్చాయి. ఏటా సగటున 8వేల కోట్ల పంట నష్టం జరిగింది.

3-11-2003న మరో ప్రత్యామ్నాయ పథకం బిందుసేద్యం, తుంపరసేద్యం విధానం రంగారెడ్డి జిల్లాలో చంద్రబాబుగారు ప్రారంభించారు. దీనికి నాబార్డు రుణం రూ. 578.5కోట్లు, బ్యాంకుల రుణం రూ. 578.5కోట్లు వ్యయం చేసి మొదటి దశలో 2.50లక్షల హెక్టార్లకు నీటి సౌకర్యం కల్గిస్తారట.

1997 నీటి తీరువా మూడురెట్లు పెంచారు. ఆక్వా, చెరకుకు నీటిపన్ను ఎకరాకు రూ. 500లకు పెంచారు. నీటి వాడకాన్ని బట్టి

నీటి పన్ను వేయడానికి రూ. 8కోట్లు వ్యయంతో కాలువలకు సాగునీటి మీటర్ల ఏర్పాట్లుచేశారు. ప్రస్తుతం రైతుల ఆందోళన వలన వాటి అమలు లేదు. మొత్తం మీద ప్రభుత్వ విధానాల ఫలితంగా నీటి లభ్యతున్నా ప్రాజెక్టుల కింద సాగునీటికి గ్యారంటీ లేకుండా పోయింది. కరువులు, వరదలు ఏటా వస్తున్నాయి. వరదల నివారణకు ప్రాజెక్టులను నిర్మిస్తే కరువులు దూరం చెయ్యవచ్చు. కాని సంస్కరణలు అందుకు అనుకూలంగా లేవు. నేడు సాగునీటికి, త్రాగునీటికి ప్రజల మధ్య యుద్ధాలు సాగుతున్నాయి. లక్షలాది ఎకరాలు బీళ్లుగా మారాయి.

మొత్తం సాగు భూమి విస్తీర్ణం లక్షల హెక్టార్లు

సం॥	సాగుభూమి
1997-98	98.46
1998-99	109.72
1999-00	107.04
2000-01	112.20
2001-02	96.15

4.. **మార్కెట్టు స్వేచ్ఛ:** మార్కెట్టు సంస్కరణల ఫలితంగా 1997 నుండి రైతులకు కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలు లభ్యం కావడం లేదు. ప్రభుత్వ కొనుగోలు సంస్థలు సకాలంలో మార్కెట్టుకు రాకపోవడమేకాక, వచ్చినా ప్రైవేటు డీలర్లతో మిలాఖతు కావడం వలన అన్ని పంటల ధరలు హీనస్థితికి చేరాయి. రైతులకు రైతుబంధు - మార్కెట్టు జోక్యం పథకం - రైతుబజార్లు ఇవేవి గిట్టుబాటు ధరలు కల్పించడం లేదు. 1997 పూర్వం కన్నా దిగుబడులు తగ్గినా ధరలు మాత్రం పెరగలేదు. పెట్టుబడులు పెరుగుతుండగా ధరలు తగ్గుతున్నాయి. ఈ సంవత్సరం అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి ధరలు మెరుగ్గా యుండగా, ఎగుమతులు నిషేధించాలని వ్యాపార వర్గాలు ప్రభుత్వంపై వత్తిడి చేస్తున్నారు. ఆవిధంగా ధరలు దిగ్గోయాలనేదే వారి ప్రయత్నం. పంచదార నిల్వలు 1.20కోట్ల టన్నులకు పెరిగాయి. నిల్వలున్నా తక్కువ ధరలకు దిగుమతులు చేసుకుంటున్నారు. గత మూడు సంవత్సరాలుగా పామాయిల్ దిగుమతుల వలన వేరుశనగ రైతులు పంటలు ధర రాక దివాళా తీశారు. ముఖ్యంగా రాయలసీమ రైతులు వేరుశనగపంట ఆధారంగానే వ్యవసాయం చేస్తున్నారు. వేరుశనగ పంట వేయడం 22లక్షల హెక్టార్ల నుండి 12లక్షల హెక్టార్లకు తగ్గింది. పామాయిల్ ధర మొదట దిగుమతి సందర్భంగా కిలో రూ. 8లు యుండగా నేడది కిలో రూ.45కు పెంచారు. మన రైతులు దివాళా తీశాక దిగుమతి నూనెల ధరలు పెరిగాయి. మన రాష్ట్రం నుండి దిగుమతి చేసిన రొయ్యలు, మిరప, రెడిమేడ్ బట్టలు ధనిక దేశాలు త్రిప్పి పంపాయి. నాణ్యతా లోపాలకారణం చెప్పి త్రిప్పి పంపాయి. వాస్తవానికి వారి దేశీయ మార్కెట్‌లో స్థానిక ఉత్పత్తిదారులకు నష్టం రాకూడదనే త్రిప్పి పంపాయి. ఆవిధంగా ఆక్వా, మిరప రైతులు, వ్యాపారులు దివాళా తీశారు. ముడిపట్టు దిగుమతుల వలన మల్బరీ రైతులు దివాళా తీశారు.

పత్తి విస్తీర్ణం - ఉత్పత్తి - ఉత్పాదకత

సం॥	విస్తీర్ణం (లక్షల హెక్టార్లు)	ఉత్పత్తి (ల.బేళ్ళు)	ఉత్పాదకత (కిలోలు/హెక్టార్లు)
1998-99	12.81	15.22	202
1999-00	10.46	15.79	257
2000-01	10.22	16.63	237
2001-02	11.08	18.77	286
2002-03	8.03	10.86	226

(ప్రభుత్వ ఉత్పత్తి లక్ష్యం 36లక్షల బేళ్ళు)

పొగాకు విస్తీర్ణం - ఉత్పత్తి - ఉత్పాదకత

సం॥	విస్తీర్ణం	ఉత్పత్తి	ఉత్పాదకత
1998-99	1.93	2.46	11274
1999-00	1.72	1.93	1122
2000-01	0.52	0.88	1903
2001-02	1.27	1.68	1303
2002-03	1,17	1.68	1372

ప్రపంచ వాణిజ్య సంస్థగా ధనిక దేశాల కొక విధానం, మనకొక విధానాన్ని అనుసరిస్తున్న బహుళజాతి సంస్థలు మన దేశంలో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా దెబ్బతీస్తున్నాయి.

పంట రుణాలు సహకార రంగం: సంస్థాగత పంట రుణాలపై కూడా సంస్కరణల ప్రభావం పనిచేసింది. గతంలో బ్యాంకుల తమ వ్యాపార ధనంలో 18శాతం రుణాన్ని వ్యవసాయ రంగానికిచ్చాయి. నేడు 10.50శాతానికి బ్యాంకులు తగ్గించాయి. సహకార - వాణిజ్య బ్యాంకుల సంస్కరణకు వేసిన కమిటీలు వ్యవసాయ రుణాలు తగ్గించాలని సూచించాయి. ఎం.నర్సింహ కమిటీ, గుప్త కమిటీ, జగదీశ్‌పూర్ కమిటి, కరీంమిషన్ లాంటి అనేక కమీషన్లు సంస్కరణలకు చేసిన సూచనల ఫలితంగా రైతులకు బ్యాంకులు రుణాలు తగ్గించాయి. రాష్ట్రంలో 4610 సహకార ప్రాథమిక సంఘాలుండగా అందులో 1200 సంఘాలు ఎత్తివేతకు గురికాబోతున్నాయి. వెనుకబడిన ప్రాంతాలలోని 200బేంకు బ్రాంచీలు మూసివేస్తున్నారు. 1964 చట్టానికి సవరణ తెచ్చి 1995 చట్టం చేశారు. 1995 చట్టం ప్రకారం రుణ విధానంలో ప్రభుత్వం జోక్యం పూర్తిగా తగ్గిపోతుంది. ఈ చట్టం కింద ఏర్పాటుచేసిన బ్యాంకులు 170 కాగా అందులో 149 దివాళా దశలోనున్నాయి. 21లిక్విడేట్ అయినాయి. రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడుతున్నారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దోపిడీ పెరిగి ఉన్న భూములు కోల్పోతున్నారు. రాష్ట్రంలోని 106లక్షల కమతాలలో 96లక్షల కమతాలు 5 ఎకరాల లోపువారే. నేడు వీరికి రుణం అందుబాటులో లేదు. రాష్ట్రంలోని 4610సహకార సంఘాలలో ఉన్న 1.40కోట్ల మంది సభ్యులలో రుణం పొందని కోటి మందిని తొలగించాలని సంస్కరణవాదులు కోరుచున్నారు. అందుకు చట్టం

కూడా చేశారు. అప్రజాస్వామికంగా 7సార్లు సహకార ఎన్నికలు వాయిదా వేశారు. తరతరాలుగా యున్న సహకార వ్యవస్థను కూకటివేళ్ళతో పెకిలిస్తున్నారు.

పంటరుణాలు లక్ష్యం - సాధించింది (రూ.కోట్లలో)		
సం॥	లక్ష్యం	సాధించింది
2000-01	6019	4184
2001-02	7500	6124
2002-03	8600	6332
2003-04	9667	4500

ప్రభుత్వరంగంలో గల పత్తి మిల్లులు, చెరకు ఫ్యాక్టరీలు, సహకార రంగంలో గల 18 చెరకు ఫ్యాక్టరీలు ప్రైవేటీకరించారు. ఒక్కో ఫ్యాక్టరీ విలువలో 20శాతం కూడా గిట్టుబాటుకాకుండానే అమ్మివేశారు. ఫలితంగా పత్తి, చెరకు ధరకు గ్యారంటీ లేకుండా పోయింది. గత మూడు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం చెరకుకు మద్దతు ధర ప్రకటించడం నిల్పివేసింది. వ్యవసాయాధారిత పరిశ్రమలన్నీ ప్రైవేటీకరించడం వలన మార్కెట్టు పోటీ తగ్గి ఏ పంటకు పెట్టుబడి రాని స్థితి ఏర్పడింది. దివాళా తీసిన రైతులు భూములు కోల్పోతున్నారు. వ్యవసాయ రంగం వదలి ఇతర రంగాలకు వేల సంఖ్యలో తరలిపోతున్నారు.

కాంట్రాక్టు వ్యవసాయం - కార్పోరేటు వ్యవసాయం

ప్రభుత్వం రైతులను కాంట్రాక్టు వ్యవసాయం వైపు ఆకర్షించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబుగారు తన స్వంత నియోజకవర్గం కుప్పంలో 3 క్షేత్రాలు కాంట్రాక్టు పద్ధతిన నిర్వహిస్తున్నారు. ఈ క్షేత్రాలను ఇజ్రాయిల్ కంపెనీకి అప్పగించారు.

1. క్షేత్రం	200ఎకరాలు	9.50కోట్ల పెట్టుబడి
2. క్షేత్రం	1519ఎకరాలు	24.4కోట్ల పెట్టుబడి (8.45కోట్లు సాంకేతిక సలహాకు)
3. క్షేత్రం	10,000ఎకరాలు	46.50కోట్లు పెట్టుబడి

పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టి రైతులనాకర్షించడానికి చేస్తున్న ప్రయత్నమే ఇది. సంస్కరణ వలన భూములు కోల్పోతున్నవారు తమ భూములు కాంట్రాక్టుపై ఏకీకరణ చేయాలని, పెద్దకమతాలు ఏర్పాటుచేసి భారీయంత్రాలతో వ్యవసాయం చేయాలని ఇందులో బహుళజాతి సంస్థల పాత్ర యుండాలని ప్రభుత్వం తన వ్యవసాయ విధాన ప్రకటనలో చెప్పింది.

రైతులు స్వచ్ఛందంగా తమ భూములు కోల్పోయే విధంగా సంస్కరణలను అమలు జరుపుతున్నది. భూములు కోల్పోయిన వారికి మరో ఉపాధి లేదు. కుప్పం కాంట్రాక్టు వ్యవసాయం కూడా దివాళా మార్గంలోనే ఉంది.

ఆవిధంగా నేడు రాష్ట్రంలో సంస్కరణల వలన వ్యవసాయరంగం పూర్తిగా సంక్షోభంలోకి జారింది. స్వయంసమృద్ధితో యున్న వ్యవసాయోత్పత్తులు దిగుమతులపై ఆధారపడే స్థితి కల్పించబడింది. ఆహారధాన్యాలకు బదులు వాణిజ్య పంటలు ఔషధ మొక్కలు అడవులు పెంచమని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. అందుకనుగుణంగా 'ఆంధ్రప్రదేశ్ నీరు - చెట్టు - భూమి సంరక్షణా చట్టం' 27 మార్చి 2002న తెచ్చింది. దీని ప్రకారం స్వంత భూమిలో 5వ వంతు చెట్లు పెంచాలి. బోర్లు వేయటానికి అనుమతి పొందాలి.

ప్రపంచీకరణ విధానాల అమలుతో 1997 నుండి నేటికి వ్యవసాయ స్థితి అత్యంత తీవ్ర సంక్షోభంలోకి చేరుకుంది. వ్యవసాయం రైతులకు రక్షణలేనిదిగా ఉంది. పంట గ్యారంటీ గల డెల్టా రైతులకు కూడా తప్పని సంక్షోభస్థితి ఏర్పడింది. వ్యవసాయానికి కావాల్సిన ప్రాథమిక వనరుల కల్పనలు పూర్తిగా దూరమయ్యాయి.

రాష్ట్రంలో ఆహారధాన్యాల ఉత్పత్తి - విస్తీర్ణం

1998-99 నుండి 2002-03

(విస్తీర్ణం లక్షల హెక్టార్లలో)
(ఉత్పత్తి లక్షల టన్నులలో)

సం॥	సాగువిస్తీర్ణం		ఉత్పత్తి	సాగువిస్తీర్ణం		ఉత్పత్తి
	ఖరీఫ్	రబీ	మొత్తం	ఖరీఫ్	రబీ	మొత్తం
గత 5సం॥రాల సగటు	44.96	26.56	21.52	86.19	54.38	140.57
1998-99	46.03	27.67	73.70	88.98	60.07	149.05
1999-00	50.76	25.97	76.73	103.34	56.93	160.27
2000-01	50.76	25.97	76.73	103.34	56.93	160.27
2001-02	41.58	28.98	70.56	83.03	65.33	148.36
2002-03	38.93	23.96	62.89	66.53	40.02	106.55

మొత్తం నూనె గింజలు

సం॥	విస్తీర్ణం	ఉత్పత్తి	ఉత్పాదకత
1998-99	27.30	24.49	897
1999-00	25.51	13.61	534
2000-01	26.97	24.99	927
2001-02	24.22	15.95	624
2002-03	22.74	12.15	535

(విస్తీర్ణం- లక్షల హెక్టార్లు) (ఉత్పత్తి- లక్షల టన్నులు) (ఉత్పాదకత కిలోలు/హెక్టార్లు)

1998-99 నుండి 2002-03(చెరకు)

	విస్తీర్ణం (ల.హె.)	ఉత్పత్తి (ల.ట.)	ఉత్పాదకత (హె/కి.)
1998-99	2.14	165.03	77231
1999-00	2.31	185.08	79963
2000-01	2.17	1179.60	81341
2001-02	2.18	180.82	82832
2002-03	2.34	153.87	66190

(ప్రభుత్వ ఉత్పత్తి లక్ష్యం 20 లక్షల టన్నులు)

గోదావరి జలాల సద్వినియోగం

– టి. హనుమంతరావు
(నీరు – మీరు టెక్నికల్ కమిటీ ఛైర్మన్,
ఐక్యరాజ్యసమితి (ఒ.పి.ఎస్) కన్సల్టెంటు,
మాజీ ఇంజనీర్-ఇన్-చీఫ్ (నీటి పారుదల)

గోదావరి నదిలో ఆంధ్రప్రదేశ్ ఇంకా ఉపయోగించుకొనవలసిన వాటా 793 శత కోటి ఘనపుటడుగుల (టి.యం.సి. లేదా యూనిట్లు) దాకా వున్నది. ఇందుకు గాను 113 యూనిట్ల వినియోగానికి పథకాలు నిర్మాణంలో ఉన్నాయి. మిగతా 680 యూనిట్ల వినియోగానికి పథకాలు ఇంకా అమలులో లేవు. రాష్ట్రానికిచ్చిన 1480యూనిట్ల వాటాలో ఇప్పటిదాకా వాడుకున్నది 687యూనిట్లు మాత్రమే. ఎగువ రాష్ట్రాలు, వాళ్ళకిచ్చిన వాటాలు పూర్తిగా వినియోగించే వీలులేనందువలన, ఆ నీరు కూడా క్రింది రాష్ట్రమయిన ఆంధ్రప్రదేశ్‌కి లభ్యమవుతుంది. సగటు వర్షపాతం, మంచి వర్షపాతమున్న సంవత్సరాలలో 793యూనిట్ల కంటే చాలా ఎక్కువగా మన రాష్ట్రం నుండి పారుతూంటుంది. కాబట్టి మనకు లభ్యమయ్యే నీరు 1000యూనిట్ల దాకా ఉంటుందని అంచనా వేయవచ్చును. అయితే ప్రాజెక్టులను రూపకల్పన చేసేటప్పుడు 793యూనిట్ల నికర జలాలకే చేసి, మరొక 300టి.ఎం.సి.లను అదనపు స్టోరేజీ (కారీ ఓవర్ స్టోరేజ్)గా పెట్టుకోవచ్చును. ఈ అదనపు స్టోరేజీ, వరద ముప్పుల నుండి కాపాడడమే గాకుండా, మరుసటి సంవత్సరం దుర్భిక్షమయినప్పుడు, అటువంటి సంవత్సరాల అవసరాలను కూడా తీరుస్తుంది. ఇదే పద్ధతిలో నైలునది (ఆఫ్రికా) మీద 'హై ఆస్వాన్' డాము కట్టినారు. ఆ నదిలో ఉండే నీటి వనరులు 2100టి.ఎం.సి. అయితే రిజర్వాయరు స్టోరేజి 6000 టి.ఎం.సి.ల దాకా పెట్టుకున్నారు. కానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ విధమయిన ఆలోచనలలో లేదు. ఇంకా వెయ్యి యూనిట్ల దాకా వాడుకొనే అవకాశమున్నప్పుడు కేవలం 680యూనిట్లకే రూపొందిస్తున్నారు.

2. గోదావరి జలాలను, ఆంధ్రప్రదేశ్ పూర్తిగా వినియోగించుకోవాలంటే, నాలుగు బ్యారేజీలను, మూడు రిజర్వాయర్లను కట్టాలని, నేను ఇంతకు ముందే సూచించినాను. బ్యారేజీల వలన నీటి నిలువంతా నది ఫ్లడ్ జోన్ (వరద ప్రాంతం)లోనే ఉంటుంది. అనగా ప్రక్కనుండే గ్రామాలు గాని పొలాలు గాని మునిగిపోవు. ఈ నాలుగు బ్యారేజీలలో నీటి నిలువ సామర్థ్యం రమారమి 80టి.ఎం.సి.లు పెట్టుకొని, 150టి.ఎం.సి.ల దాకా ఖరీఫ్, రబీ కాలంలో సేద్యపు నీరందించవచ్చును. ఈ బ్యారేజీల వివరాలు:

ఎ) **పెద్ద బెల్లాల దగ్గర, కడెంనది సంగమం దిగువన :** ఆదిలాబాద్, నిజామాబాదు జిల్లాలోని వర్షపాతమున్న ప్రాంతాల నుండి ఈ బారేజీకి నీరు చేరుతుంది. ఇందులో ముఖ్యమైనది కడెం నది. దీని మీద కట్టిన డాము మీద, నీరు ప్రతి సంవత్సరం భారీగా పొర్లుతూంటుంది. బాగా నీరుండే రెండు 'పెద్దవాగు'లు కూడా ఇక్కడ కలుస్తున్నవి.

బి) **ఎల్లంపల్లి:** ఇక్కడ ఇంతకుముందే ఇన్వెస్టిగేషన్ చేసి 45టి.ఎం.సి.ల నీరు నిలువ పెట్టాలనుకున్నారు. దీనిని 25 టి.ఎం.సి.లకు తగ్గించినట్లయితే ముంపు నది ప్రవాహ ప్రాంతానికి మాత్రమే పరిమితమై ఉంటుంది. మునుపటి ప్రణాళికలో కొన్ని గ్రామాలు, సేద్యపు నీటి భూములు, ముంపుకు గురి అవుతున్నాయి. నీరంతా ఇక్కడే నిలువ చేసుకోకుండా, కొంతమేరకు పెద్ద బెల్లాల దగ్గర కూడా నిలువ పెట్టుకుంటే, ఇక్కడ నీటి సామర్థ్యం తగ్గించుకోవడమే గాకుండా, నిర్వాసితులు పర్యావరణ సమస్యలు లేకుండా చేయవచ్చును. ఇటువంటి మార్పులతో డిటైల్డు ఇన్వెస్టిగేషన్ చేయాలి.

సి) **'ఏదిర' దగ్గర:** ఇక్కడ కూడా 20టి.ఎం.సి.ల నీరు నిలువ చేయవచ్చును. దీనికి ఇంతవరకు ఇన్వెస్టిగేషన్ చేయలేదు. కాబట్టి ఇది వెంటనే చేపట్టాలి.

డి) **దుమ్ముగూడెం:** దీనిలో కూడా 20 టి.ఎం.సి.లు నిలువ చేయవచ్చును. దీనికి ఇప్పటికే కొంత ఇన్వెస్టిగేషన్ జరిగింది. ఇది పూర్తిగా చేయాలి.

పై చెప్పిన నాలుగు బ్యారేజీలకు పర్యావరణ, గ్రామాల ముంపు, ఇతర రాష్ట్రాలలో ముంపు, నిర్వాశితుల సమస్యలేవీ ఉండవు. వీటిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏ ఇతర రాష్ట్రాల ప్రమేయం లేకుండా ఒక దాని తర్వాత ఒకటి నిర్మించవచ్చును. నిర్మాణ వ్యయం రమారమి రూ.8వేల కోట్లు ఉండవచ్చును. 6లక్షల ఎకరాలకు ఖరీఫు వరి, మరియు 4లక్షల ఎకరాల రబీ ఆరు తడి పంటలకు నీరందించే వీలు కలిగించవచ్చును. ఈ బ్యారేజీలు ఇంకా రిజర్వాయర్లు ద్వారా జలరవాణా మార్గం సుగమమవుతుంది. వీటి వలన నదిలో 3మీటర్ల కంటే ఎక్కువలోతు నీరుంటుంది. కాబట్టి, 3వేల టన్నుల కెపాసిటీ గల సముద్రపు పడవలు నదిలో పోయే వీలు కలుగుతుంది. దీనికి గాను ప్రతి బ్యారేజీ దగ్గర లాకులు నిర్మించాలి.

3. **ఎత్తిపోతల పథకాలు:** గోదావరి మీద రిజర్వాయర్లు కట్టినా నీటి మట్టం 130మీ. లోపే వుంటుంది. నీటిని ఉపయోగించుకొనే భూములు విస్తారంగా 200 నుండి 400మీ. ఎత్తులో వున్నాయి. ఈ ప్రదేశానికి నీటిపారుదల కలుగజేయాలంటే, ఎత్తిపోతల పథకాలు తప్ప వేరే మార్గాలు లేవు. ఈ ప్రాంతాల్లో వాటర్‌షెడ్‌ల వలన కొంతమేలు సాధించవచ్చు. కానీ పూర్తి మేలు సాధించాలంటే నీటిపారుదల సౌకర్యాలు కల్గించాలి. గోదావరి కాల్వల ద్వారా నీరు మళ్ళించాలంటే, ఈ సౌకర్యం చాలా తక్కువ ప్రాంతానికి మాత్రమే వినియోగించుకునే వీలుంది. గోదావరి పూర్తి జలాలు వినియోగించుకోవాలంటే ఎత్తిపోతల పథకాల ద్వారానే సాధించాలి.

పంపు చేయవలసిన సగట ఎత్తు 150మీ. ఉంటుంది. 840 యూనిట్ల నీటి వినియోగానికి (అనగా 600 యూనిట్లు ఖరీఫు వరికి మరియు 240 యూనిట్లు రబీ ఆరుతడి పంటలకు) రూపకల్పన చేసుకొంటే 48లక్షల ఎకరాలకు ఖరీఫు వరి, 2లక్షల ఎకరాలకి రబీ ఆరుతడి పంటలు పెట్టుకోవచ్చును. దీనికి 2920మెగావాట్ల విద్యుచ్ఛక్తి కావాలి. విద్యుత్ గ్రిడ్ నుంచి తీసుకొనే ఎకనామిక్ రేటు ఒక యూనిట్ రూ.3 అనుకుంటే, విద్యుత్ ఛార్జీలు బోలెడంత అవుతాయి. (ఉదాహరణకు ఖరీఫు వరికి ఎకరాకు కరెంటు ఛార్జీలు రూ.10,700 అవుతాయి. (సేద్యపు నీరు 900మి.మీ. + ఉపయోగపడే వర్షపాతం 500మి.మీ. అనుకొంటే)) థర్మల్ పవరు స్టేషను, నీటి పారుదల ప్రాజెక్టు ఖర్చుతో కట్టినట్లైతే యూనిటు ఖరీదు రూ.1.50గా పరిగణించవచ్చును. (బొగ్గు, ముడి సరుకులు, యంత్రాలు సిబ్బంది ఖర్చులు లెక్కకు తీసుకోవాలి కాబట్టి)

ఈ విధంగా చేస్తే ఒక ఎకరానికి విద్యుత్ ఖర్చులు మాత్రమే ఈ విధంగా ఉంటాయి : ఖరీఫ్ ఆరుతడి పంటలు (మూడు తడులు 150మి.మీ. మొత్తం) రూ.890, ఖరీఫు వరి (900మి.మీ.) = రూ.5350, రబీ ఆరుతడి పంటలు (10 తడులు 500మి.మీ. మొత్తం) రూ.2970 ఈ కరెంటు ఖర్చులు, పంట పంటకీ రైతులు భరించలేరు. ఇప్పుడంటే ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కీములలో పంపింగ్ ఎత్తు 30మీ. లోపే ఉంటున్నది. కాని వీటి కరెంటు ఖర్చులు రైతులు భరించలేక 50శాతం స్కీములు (560)మూల పడ్డాయి. ఇంతకంటే 5రెట్లు పంపింగు ఎత్తు ఉన్న గోదావరి స్కీములు కరెంటు ఖర్చులు రైతులు ఏ మాత్రమూ భరించలేరన్నది నిర్వివాదాంశం. కాబట్టి ఈ సమస్యకు వేరే ప్రత్యామ్నాయాలు కనుక్కోవాలి. అదేమిటంటే ఈ ప్రాజెక్టుకు కావలసిన విద్యుత్తునంతా జలవిద్యుత్తు ద్వారా సమకూర్చి ఉచిత విద్యుత్తు సరఫరా చేయడమే. గోదావరి ప్రాజెక్టుల ద్వారా 3,400మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి చేయాలి. జలవిద్యుత్తు నిర్మాణ వ్యయం, ప్రాజెక్టులో ఒక భాగంగా పరిగణించినట్లయితే వీటి నిర్వహణ ఖర్చులు స్వల్పముగా ఉండి ఉచిత విద్యుత్తును సరఫరా చేసే వీలు కలుగుతుంది. ఈ కరెంటు నిర్వహణ ఖర్చులు కూడా నీటి పారుదల సాంవత్సరిక ఖర్చులతో కలపాలి. కరెంటు డిస్ట్రిబ్యూషన్ (పంపిణీ) ఛార్జీలను మాత్రమే రైతులు భరిస్తే సరిపోతుంది. 3400 మెగావాట్ల జలవిద్యుత్తు ఉత్పత్తి చేసే దానికి గాను 3 రిజర్వాయర్లు, 4 బ్యారేజీలు కావాలి. బ్యారేజీల వివరాలు పైన చెప్పిన విధంగా వుండి 1000మెగావాట్లు ఉత్పత్తి బ్యారేజీలలో చేయాలి. దేవాదుల వద్ద ఒక భారీ ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రారంభించింది. ఇది మంచిదే. కాని ఉచిత విద్యుత్తు లేకుండా ఈ ప్రాజెక్టు నడిపించేది అసాధ్యమని గ్రహించాలి. ఎత్తిపోతల పథకంతో పాటు దుమ్మగూడెం వద్ద జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మించాలి. ఇప్పుడు రిజర్వాయర్ల సంగతి పరిశీలిద్దాం.

4. **రిజర్వాయర్లు:** ఇవి లేకుండా కేవలం ఎత్తిపోతల ద్వారానే గోదావరి జలాలను పూర్తిగా వినియోగించుకోలేము. సాధారణంగా వరద సమయాల్లో కొన్ని రోజులు 10-15లక్షల క్యూసెక్కుల నీరు గోదావరిలో ప్రవహిస్తూ ఉంటుంది. ఎట్టి పరిస్థితులలోనూ వరద నీటిని మొత్తాన్ని పంపు చేయలేము. 40వేల క్యూసెక్కులు పంప్ చేసినా రమారమి 97శాతం నీరు వృధాగా క్రిందికి పోతుంది. కాబట్టి గోదావరి జలాలను పూర్తిగా ఉపయోగించుకోవాలంటే రిజర్వాయర్లు అవసరమని ఎటువంటి సందేహం లేకుండా చెప్పవచ్చు. ఈ రిజర్వాయర్లు ఎన్ని ఉండాలి. ఎక్కడ ఉండాలి అనే విషయాలను చర్చిద్దాము. ఎక్కువ నీరు ప్రాణహిత, ఇంద్రావతి, శబరి ఉపనదుల ద్వారా లభ్యమవుతూ ఉంది. ఎగువ భాగంలో ప్రాణహిత, ఇంద్రావతి సంగమాల మధ్య ప్రాంతంలో అనగా సూరారం దగ్గర ఒక రిజర్వాయరు, ఇంద్రావతి సంగమం దిగువున ఇచ్చంపల్లికి దిగువన, కాంతాలపల్లి - ఏటూరు నాగారం దగ్గర రెండవ రిజర్వాయరు, పోలవరం వద్ద మూడవ రిజర్వాయరు ఉండాలి. రిజర్వాయర్లకు పూర్తి ఇన్వెస్టిగేషన్ జరగాలి. మొదటి రెండు రిజర్వాయర్లకు ఇంత వరకు ఇన్వెస్టిగేషను జరగలేదు. ఉజ్జాయింపు వివరాలు ఈవిధంగా ఉంటాయి. సూరారం రిజర్వాయరు మట్టం 137మీ. దాకా పెట్టుకోవచ్చు. మంచిర్యాల రైల్వే బ్రిడ్జి దగ్గర వరద నీటి మట్టం 138మీ. ఉంది. కాబట్టి బ్యాక్ వాటర్ ప్రభావం వస్తే కూడా, దీనికి లోపే ఉంటుంది.

కాంతాలపల్లె దిగువ రెండవ రిజర్వాయరు నిర్మించాలి. దీని నీటిమట్టం 105మీ. పెట్టుకోవచ్చును. ఈ రెండు రిజర్వాయర్ల వలన ఎగువ రాష్ట్రాలలో (మహారాష్ట్ర, చత్తీస్‌గడ్) 50 వేల హెక్టార్లు ముంపుకు గురి అవుతాయి. ఇచ్చంపల్లి ప్రాజెక్టు (112.77మీ. ఎత్తు) వలన ఎగువ రాష్ట్రాలలో ముంపుకన్నా (58 వేల హెక్టారులు) ఇది తక్కువ. కాని ఆంధ్రప్రదేశ్‌లో ముంపు 1.3లక్షల హెక్టారులుంటుంది. పూర్తి ప్రయోజనాలు మన రాష్ట్రం పొందుతున్నప్పుడు, మన రాష్ట్రంలోనే ఎక్కువ ముంపు ఉన్నట్లయితే, అది ఇతర రాష్ట్రాలకు ఆమోదయోగ్యంగా ఉంటుంది. ఇచ్చంపల్లి ప్రాజెక్టులో (112.77మీ. ఎత్తు) మన రాష్ట్రంలో ముంపు 38,000హెక్టారులైతే పొరుగు రాష్ట్రాలలోని ముంపు 58,000 హెక్టార్లు. ఇచ్చంపల్లి డాము, సగం భాగం ఛత్తీస్‌గడ్‌లో ఉంటుంది. పైగా దీని విద్యుత్తులో మన రాష్ట్రం వాటా 27శాతం, (మొత్తం ఉత్పత్తి 975 మెగావాట్లు) మాత్రమే ఉన్నది. నీటి పారుదల కూడా మన రాష్ట్రానికి 80యూనిట్లకే పరిమితమై ఉన్నది. కాబట్టి ఈ ప్రాజెక్టు రాష్ట్ర పూర్తి ప్రయోజనాలకు, అనగా 400యూనిట్ల వినియోగానికి పనికిరాదు. పూర్తి విద్యుత్తు, పూర్తి నీరు మన రాష్ట్రానికే లభ్యమయ్యేలాగా రూపకల్పనలు చేయాలి. కాంతాలపల్లె దిగువన డ్యాము కట్టినట్లయితే ఏ ఇబ్బందులూ లేకుండా, పూర్తి జలవినియోగం, విద్యుత్తు మన రాష్ట్రానికే లభ్యమయ్యేలాగా రూపకల్పనలు చేయవచ్చును. కాంతాలపల్లె దిగువన ఉండే డ్యాము రెండువైపులా ఉండేది మన రాష్ట్రమే. ఇక్కడ డ్యాము కట్టినట్లయితే ఏ ఇబ్బందులూ లేకుండా, పూర్తి జలవినియోగం, విద్యుత్తు మన రాష్ట్రానికే ఉంటుంది. అయితే నదిలో రాతి చట్టు ఇక్కడ లేనందువలన డాము కట్టే దానికి వీలు కాదని కొందరనుకుంటారు. ఇది ఒక అపోహమాత్రమే. నది ప్రాంతంలో ఎర్తన్ డాము (మట్టికట్ట) పోలవరం మాదిరి రూపకల్పన చేసి, సర్‌ప్లస్‌ను (అలుగు) రాయి వుండే నది ప్రక్కల కట్టవచ్చును. (ఉదా: నైలునది మీద హై ఆస్వాను డాము : సోమశిల డాము. ఇచ్చంపల్లి ప్రాజెక్టు మీద సరియైన అవగాహన లేక చాలామంది రాష్ట్ర ప్రభుత్వంతో సహా ఈ ప్రాజెక్టే కావాలనని పదే పదే చెబుతున్నారు. దీని కంటే ఎక్కువ మేలుచేసే ప్రాజెక్టు కావాలనుకుంటే కాంతాలపల్లి దగ్గర కట్టాలి. ఇచ్చంపల్లి ప్రాజెక్టు మన రాష్ట్రానికి ఖర్చు ఎక్కువ ఫలితం తక్కువ అని ఇప్పటికైనా గ్రహించాలి. మనకి కావలసిన జల విద్యుత్తును సమకూర్చుకోవాలంటే, ఎగువ ప్రాంతంలో ఒక రిజర్వాయరుకు బదులు రెండు కట్టాలి. (ఉదా॥ శ్రీశైలం, నాగార్జున సాగర్) దిగువ భూములలో పోలవరం వద్ద ఒక రిజర్వాయరు నిర్మించి 301 యూనిట్లు వినియోగించుకొని (70 యూనిట్లు లైవు స్టోరేజీ) 7.2లక్షల ఎకరాలకి సేద్యపు నీటి వసతి కల్పించాలి. 45.7మీ. ఎత్తులో ఉండే నీటి మట్టం ద్వారా 750మెగావాట్ల విద్యుత్తును సమకూర్చుకోవచ్చును. ఈ మూడు రిజర్వాయర్లు, నాలుగు బారేజీల్లో ఉపయోగకర స్టోరేజి (లైవు స్టోరేజీ) 670 యూనిట్లు ఉంటుంది. 3400 మెగావాట్ల దాకా విద్యుదుత్పత్తి సాధించవచ్చును. పోలవరం ప్రాజెక్టు మీద ఇటీవల కొన్ని వార్తలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నీటినిలువ సామర్థ్యం తగ్గించి ముంపుకు గురి అయ్యే ఇతర రాష్ట్రాల ప్రాంతాలను రక్షించవలెననే ఆలోచనలో ఉన్నదనే వార్తలు పేపర్లలో వచ్చినాయి. ఇది చివరి రిజర్వాయరు కాబట్టి ఇది ఎంత మాత్రం సరియైన ఆలోచన కాదు.

5. **పర్యావరణ సమస్యలు:** మునిగిపోయే అటవీ ప్రాంతానికిగాను 'బదులు' అడవిని, ప్రభుత్వ వేస్ట్ లాండులలో పెంపొందించాలి. నిర్వాసితుల సమస్యలను చైనాలో 3గార్జి ప్రాజెక్టులో మాదిరి పరిష్కరించాలి. ఇప్పుడు ఇచ్చే పారితోషికాలే కాకుండా అదనంగా వారి ఆర్థిక పురోగతికి, దోహదం కలుగజేయాలి. దీనికి కావలసిన శిక్షణ, విద్య, ఆరోగ్య సౌకర్యాలు కలిగించి ఉపాధిమార్గాలను కూడా కలుగజేయాలి. ఆర్థికపురోగతి, ప్రతివ్యక్తి ఏమాత్రం సాధిస్తున్నాడో, ప్రతి

సంవత్సరమూ పరిశీలించి, లోపాలున్నట్లయితే వాటిని ఎప్పటికప్పుడు సవరించి, తలపెట్టిన ప్రగతి సాధించేలా చేయాలి. కేంద్రం, రాష్ట్ర అభివృద్ధి పథకాలన్నీ ఈ నిర్వాసితులకు అన్వయించేలా చేయాలి. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆయకట్టుదారులు ప్రాజెక్టు ద్వారా ఏ విధమయిన లబ్ధిపొందుతారో అంతకంటే ఎక్కువగా నిర్వాసితులు లబ్ధిపొందాలి.

6. **నీటి రవాణా, ఉపాధి:** పూర్తి గోదావరీ నదిని నౌకల రవాణాకి వినియోగించుకొంటే చాలా ప్రయోజనకారిగా ఉంటుంది. 3 రిజర్వాయర్లు, 4 బ్యారేజీల ద్వారా ఇది సాధ్యమవుతుంది. 3వేల టన్నుల దాకా ఫ్లాట్ బాటమ్ నౌకలు సముద్రం నుండి శ్రీరాంసాగర్ దాకా పోయే వీలు కలుగజేయాలి. ప్రతి నది కట్టడం దగ్గర లాకులు, చేప నిచ్చెనలు ఏర్పాటుచేయాలి. గోదావరి ప్రాంతంలో లభ్యమయ్యే బొగ్గు, ఇతర ఖనిజాలు చౌకగా బంగాళాఖాతపు ప్రాంతానికి రవాణా అవుతాయి. రోడ్లు, రైళ్ల మీద భారం తగ్గుతుంది. పర్యావరణ కాలుష్యం ఉండదు. నీటి రవాణా సౌకర్యం వలన ఎక్కడికక్కడే పరిశ్రమలు స్థాపించే వీలుంది. తయారైన వస్తువుల రవాణా తక్కువ ఖర్చుతో కూడినది కాబట్టి, ఎక్కువ పరిశ్రమలు వచ్చే అనుకూలాలు ఉన్నాయి. జల నౌకారంగంలో సంవత్సరం పొడుగునా ఉపాధి ఉంటుంది. భూమిలేని పేద గ్రామీణులకు ఇది ఒక వరమవుతుంది. బీద వ్యవసాయదార్లకు కూడా సంవత్సరం పొడుగునా ఉపాధి ఉంటుంది. కాబట్టి వారికి కూడా ఈ రంగంలో ఎంతో మేలు కలుగుతుంది. నది మొత్తం జల రవాణా సౌకర్యం కల్గిఉంటే, ఈ ప్రాంతమంతా ఎంతో అభివృద్ధికి నోచుకుంటుంది. ఉత్తరోత్తర ఈ రవాణా సౌకర్యం ప్రాణహిత మీదుగా వార్ధా దాకా కలుగచేసుకోవచ్చును. ఇవన్నీ ఒకప్పుడు సర్ అర్థర్ కాటన్ మహాశయుడు కన్న కలలు. అవి నిజం చేయాలంటే 3 రిజర్వాయర్లు, 4 బ్యారేజీలు అవసరమవుతాయి. ఈ విధంగా నీటి రవాణా సౌకర్యాలు ఇప్పటికే యూరప్‌లోని 8 దేశాల ప్రభుత్వాలు రైను, డాన్యూబ్ నదుల మీదుగా, నల్లసముద్రం - ఉత్తర సముద్రాలను కలుపుతూ సాధించినారు. చైనాలో యాంగ్జీ నదిలో 2300 కి.మీ., దూరమంతా నీటి రవాణాకి వీలు కలుగచేసే దానికి 3 గార్జిల డామును నిర్మిస్తున్నారు. దీనితో పోలిస్తే మన గోదావరి నది రవాణా మార్గం మూడవ వంతు పొడవు మాత్రమే. ఇంత పెద్ద ఎత్తులో ప్రపంచంలో పెద్దపెద్ద నీటి రవాణా కార్యక్రమాలు జరుగుతుంటే మన దేశంలో ఇప్పటికీ ఏ ప్రాధాన్యతా లేకుండా ఉంది. మార్చినెల 2003న క్యోటో (జపాను)లో జరిగిన ప్రపంచ నీటి సమాఖ్య (వరల్డ్ వాటర్ ఫోరమ్)లో ఇక మీదట తలపెట్టే అన్ని నీటి వనరుల ప్రాజెక్టులలో జల రవాణా సౌకర్యము విధిగా చేపట్టాలి అని తీర్మానించారు. దీని వలన పర్యావరణ సమతుల్యము కాపాడడమే కాకుండా ఆర్థిక అభివృద్ధి తక్కువ ఖర్చుతో సాధించే దానికి వీలౌతుందని నొక్కి వక్కాణించారు. నీటి వనరుల ప్రాజెక్టుల వలన ఒక్క వ్యవసాయ రంగమే కాక, విద్యుత్, జల రవాణా, పరిశ్రమలు, ఉపాధి జలాలు ఎంతైనా ఉపయోగపడుతాయి. ఇక్కడ ఒక ముఖ్య విషయం గమనించాలి. నూరు శాతం భూములకు నీటి పారుదల సౌకర్యము కలిగించినా పేదరికము నిర్మూలనము కాదు. ఎందుకంటే ఈ ప్రాంతములో 55 శాతం ప్రజలకు భూములు లేవు. వ్యవసాయ కూలీలకు సన్నకారు (మార్జినల్) రైతులకు, సంవత్సరంలో 90 రోజులు మాత్రమే (నీటిపారుదల సౌకర్యమున్నా) పని ఉంటుంది. మిగతా 275 రోజులలో ఉపాధి ఉండదు. ఈ గ్రామీణ ప్రజల ఆర్థిక స్థితి బాగుపడాలంటే సంవత్సరము పొడవునా పని ఉండాలి. జలరవాణా, పరిశ్రమలలో ఇటువంటి ఉపాధి కల్పించే వీలుంటుంది.

7. **నిధులు:** 3 రిజర్వాయర్లు, 4 బ్యారేజీల పథకాలను పూర్తిగా ఇన్వెస్టిగేషన్ చేస్తే గాని నిధులెంతకావలెనో చెప్పలేం. రమారమి అంచనాలు ఈ విధంగా ఉండవచ్చును. 4 బ్యారేజీలు వాటి కాలువలు, చిన్నపంపులకు రూ.8వేల కోట్లు, 3 రిజర్వాయర్లు, పెద్దనీటి పంపులు, కాలువలకు 37వేలకోట్లు, జల థర్మల్ విద్యుత్ కేంద్రాలకు 15వేల కోట్లు వెరసి రు.60వేల కోట్లు దాక ఉంటుంది. దీనిలో కొంతభాగం నీటి రవాణా రంగానికి కేటాయించవచ్చును. రాష్ట్ర ప్రభుత్వం బ్యారేజీలకు కావలసిన రు.8 వేల కోట్లు భరించినా, మిగతా వాటికి కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలి. చైనాలోని 3 గార్జిల ప్రాజెక్టును, కేంద్ర ప్రభుత్వం పూర్తిగా భరిస్తున్నది. (సుమారు లక్షకోట్లు) మన దేశంలో ఇంతకుముందు భాక్రానంగల్ ప్రాజెక్టులను ఈ విధంగా కేంద్రమే భరించింది. రిజర్వాయర్ల నుండి కొంతనీటిని (సుమారు 100 యూనిట్లను) కాలువల ద్వారా తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల ఉపయోగానికి మళ్లించవచ్చును. ఈ రాష్ట్రాలు, వారికి కావలసిన ప్రదేశాలకు ఎత్తిపోతల ద్వారా వారి ఖర్చుతో నీటిని వినియోగించుకోవచ్చును. ఈ విధంగా 3 రాష్ట్రాల ప్రయోజనాలకు పథకాలను రూపకల్పన చేస్తే కేంద్ర నిధుల ద్వారా జాతీయ ప్రాజెక్టుగా గుర్తింపు పొందడము సులభమవుతుంది. జలవిద్యుత్‌లో కూడా ఎగువ రాష్ట్రాలకు కొంత వాటా ఇచ్చినట్లయితే ప్రాజెక్టు సుగమమవుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితులలోనూ ఈ మూడు రిజర్వాయర్లను స్వంతంగా భరించజాలదన్నది ఇక్కడ ముఖ్యంగా గమనించవలసిన విషయము. రాష్ట్ర ప్రభుత్వం సత్వరంగా చేయవలసినది ఏమిటంటే ఈ 4 బ్యారేజీలను నిధుల మేరకు ఒకదాని తర్వాత ఒకటి తీసుకుని పూర్తి చేయడం, కేంద్రం మీద ఒత్తిడి తెచ్చి రిజర్వాయర్ల పనులను క్రమేణా చేపట్టేలాగు చేయాలి. ప్రాజెక్టు ఖర్చులలో 15 శాతం దాకా రైతుల భాగస్వామ్యానికి గాను కృషిచేయాలి. ఈ విధంగా ఫిలిప్పైన్స్ దేశంలోని ప్రాజెక్టులు రైతుల భాగస్వామ్యంతో ఇప్పుడు అమలులో ఉన్నాయి.

8. **ముఖ్యాంశాలు:** గోదావరి నదీ జలాల ద్వారా నీటిపారుదల రంగంలో అభివృద్ధి సాధించడమే కాకుండా వివిధ రంగాలలో ప్రగతి సాధించి, ఆర్థిక అభివృద్ధి, దారిద్ర్య నిర్మూలన కలిగేలా చూడాలి. పైన చెప్పిన విధంగా 4 బ్యారేజీలు, 3 రిజర్వాయర్లు చేపట్టినట్లయితే రమారమి 48 లక్షల ఎకరాలకు రెండు పంటలకు నీరు, కాలువల ద్వారానూ, ఎత్తిపోతల పథకాల ద్వారానూ పారించవచ్చును. ఈ ఏడు ప్రదేశాల్లో జలవిద్యుత్తు కేంద్రాలు స్థాపించుకోవాలి. వరద కాలంలో జలవిద్యుత్తును, రెండవ పంటకాలంలో జలవిద్యుత్తును, ఎత్తిపోతల పథకాలకు ఉపయోగించుకోవాలి. మిగులు విద్యుత్తును గ్రిడ్‌కి సప్లయి చేయాలి. గోదావరి పొడవునా, అనగా సముద్రము నుండి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దాకా, సముద్ర నౌకలు (మూడువేల టన్నుల సామర్థ్యముండేది) పోయే విధంగా జలమార్గం కలుగచేయాలి. దీని వలన ముడిసరుకుల రవాణా కాలుష్యం లేకుండా దూర ప్రాంతాలకు తక్కువ ఖర్చుతో చేసే వీలుంది. జల రవాణా సౌకర్యంతో ఇక్కడే ఉండే ఖనిజాలనుపయోగించే పరిశ్రమలు, ఈ ప్రాంతమంతా విస్తరించే అవకాశాలున్నాయి. తద్వారా ఆర్థిక పురోభివృద్ధి కలుగడమే కాకుండా, వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు సంవత్సరం పొడవునా ఉపాధి కలుగుతుంది. జలరవాణాలో కూడా ఉపాధి సౌకర్యాలు బాగా లభిస్తాయి. గోదావరి జలాల ద్వారా సర్వతోముఖంగా అభివృద్ధి సాధించాలంటే ఇటువంటి బృహత్ ప్రణాళికలు ఎంతైనా అవసరము. ○

చార్జీలు పెంచలేదు కాని బిల్లులు పెరిగాయి

- ఎం.వేణుగోపాలరావు

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలలో భాగంగా ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ కమిషన్ 2000-01నుండి 2003-04 వరకు విద్యుత్ ఛార్జీల సవరణపై నాలుగు ఉత్తర్వులనిచ్చింది. 2004-05 సంవత్సరానికి వచ్చే మార్చి 24వ తేదీ నాటికి మరొక ఉత్తర్వునీయాల్సి వుంది.

విద్యుత్ ఛార్జీలను నిర్ణయించేందుకు నియంత్రణ కమిషన్ అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఉత్పత్తిదారులనుండి విద్యుచ్ఛక్తి కొనుగోలు నుండి అంతిమ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసే వరకు అనుమతించిన వ్యయాన్ని కమిషన్ పరిగణనలోకి తీసుకోవాలి. విద్యుత్ ఉత్పత్తిదారుల, విద్యుత్‌ను ప్రసారం చేసే ఎపిట్రాన్స్‌కో విద్యుత్ పంపిణీ కంపెనీల లాభాలను కూడా పరిగణనలోకి తీసుకుని నియంత్రణ కమిషన్ వివిధ కేటగిరీల వినియోగదారులకు విద్యుత్ ఛార్జీలను నిర్ణయిస్తున్నది. ఆయా కేటగిరీల వినియోగదారులకు విద్యుత్ సరఫరాకు అయ్యే మొత్తం వ్యయాన్ని బట్టి ఒకో కేటగిరీకి సేవనందించే వ్యయాన్ని (కాస్ట్ టు సర్వ్) ట్రాన్స్‌కో, పంపిణీ కంపెనీలు సమర్పించిన వివరాలను పరిశీలించి, కమిషన్ నిర్ణయిస్తున్నది. ప్రసార, పంపిణీ కష్టాలను కూడా కమిషన్ లెక్కలోకి తీసుకోవాలి. వినియోగదారుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని, విద్యుత్ కొనుగోలు, పంపిణీ, సరఫరా, వినియోగాలను, సేవానాణ్యతను చెల్లించాల్సిన ఛార్జీలను నియంత్రించాలని 1998, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణ చట్టంలోని సెక్షన్ 11(1)(ఇ) నిర్దేశిస్తున్నది. సరఫరా చేసిన విద్యుచ్ఛక్తికి తగినంతగా ఛార్జీలను నిర్ణయించి, సక్రమంగా వసూలు చేయకపోతే, సరఫరా, పంపిణీలను నిర్వహించలేమనే పరిగణనను కూడా కమిషన్ దృష్టిలో వుంచుకోవాలని ఈ సెక్షన్ నిర్దేశిస్తున్నది. ప్రస్తుతమున్న విద్యుత్‌ఛార్జీల ఆధారంగా ట్రాన్స్‌కో, పంపిణీ కంపెనీలకు లభించే వార్షిక ఆదాయం, వాటి వ్యయాల మధ్య వ్యత్యాసాన్ని లెక్కలోకి తీసుకుని వాటి లోటును భర్తీ చేసేందుకు కమిషన్ నిర్ణయాలు తీసుకొంటుంది. అంతిమంగా వినియోగదారులు చెల్లించాల్సిన ఛార్జీలను నిర్ణయించడంలో కాస్ట్ టు సర్వ్‌ను బట్టి కొన్ని కేటగిరీల వినియోగదారులకు, ప్రధానంగా వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులకు, క్రాస్ సబ్సిడీని ఎంత ఇవ్వాలనేది కమిషన్ నిర్ణయిస్తున్నది. ఇంకా మిగిలిన లోటును భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేందుకు అంగీకరించిన సబ్సిడీ కూడా పోగా, ఇంకా మిగిలి వుండే లోటును భర్తీ చేసేందుకు కమిషన్ సంబంధిత విద్యుత్ సంస్థల అంతర్గత సామర్థ్యాన్ని పెంపొందించుకొనడం ద్వారా పొందాల్సిన అదనపు ఆదాయాన్ని నిర్ణయిస్తున్నది. ఇంకా మిగిలి వుంటుందని అంచనా వేసిన లోటును భర్తీ చేసేందుకు విద్యుత్ ఛార్జీలను పెంచుతున్నది.

ఒక ఆర్థిక సంవత్సరంలో కమిషన్ అనుమతించిన విధంగా ట్రాన్స్‌కో, నాలుగు విద్యుత్ పంపిణీ కంపెనీలకు ఆదాయం లభించక, లోటు ఏర్పడితే, ఆ నష్టాలను భవిష్యత్‌లో ఛార్జీల పెంపుదలతో తిరిగి రాబట్టుకొనేందుకు లోటు మొత్తాలను రెగ్యులేటరీ ఎసెట్‌గా, లేదా రెగ్యులేటరీ ట్రీట్‌మెంట్‌గా అనుమతించాలని ఆ సంస్థలు కోరుతూ వస్తున్నాయి. అయితే, నియంత్రణా కమిషన్ ఇంతవరకు అలాంటి ఏర్పాటును అనుమతించలేదు. అయితే, దీర్ఘకాలిక విద్యుత్ ఛార్జీల సూత్రాల కింద అలాంటి ఏర్పాటును అనుమతించే అవకాశం వుంది. ట్రాన్స్‌కో, పంపిణీ కంపెనీల అదుపులో లేని కారణాల వల్ల వ్యయం పెరిగి, లోటు ఏర్పడితే, ఆ మొత్తాలను కమిషన్ అనుమతించే అవకాశముంది. వీటిలో భాగంగా, ఛార్జీలను నిర్ణయించే నాటికి విద్యుత్ ఉత్పత్తికి వాడే ఇంధన వ్యయం తరువాత పెరిగితే, అదనపు వ్యయాన్ని ఆ తరువాత ఛార్జీల రూపంలో వసూలు చేయడానికి కమిషన్ అనుమతిస్తున్నది. దీనిని ఇంధన సర్‌ఛార్జి సర్దుబాటు (ఎఫ్ఎస్ఎ)గా పరిగణిస్తున్నారు.

చట్టప్రకారం ప్రతి ఏడాది డిసెంబరు చివరిలోగా ఎపిట్రాన్స్‌కో, నాలుగు విద్యుత్ పంపిణీ కంపెనీలు తమ వార్షిక ఆదాయ అవసరాలు (ఎఆర్ఆర్), లోటువుంటే దానిని భర్తీ చేసుకొనేందుకు నిర్దిష్ట ప్రతిపాదనలతో సహా నియంత్రణ కమిషన్‌కు సమర్పించాలి. ఆ తరువాత నియంత్రణ కమిషన్ వాటిపై బహిరంగ విచారణ జరిపి, అందులో పాల్గొన్నవారి, లిఖితపూర్వకంగా అభ్యంతరాలు, సూచనలు తెలిపిన వారి అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకొని మార్చి 24వ తేదీ నాటికి విద్యుత్‌ఛార్జీల ఉత్తర్వునీయాలి. వాటిని పత్రికలలో ప్రకటించిన వారం రోజుల తరువాత, అనగా ఏప్రిల్ మొదటి తేదీ నుండి నిర్ణయించిన విద్యుత్‌ఛార్జీలు అమలులోకి వస్తాయి.

విద్యుత్ సంస్థలు ఎఆర్ఆర్‌లలో చూపిన వివరాలు సరైనవా కావా అని పరిశీలించే అవకాశం నియంత్రణా కమిషన్ నిర్వహించే బహిరంగ విచారణలో పాల్గొనే వారందరికి లభించటం లేదు. కమిషన్ సిబ్బంది తరపున విచారణలో చేస్తున్న వివరణలకు, కమిషన్ పరిశీలనకు అవి పరిమితమవుతున్నాయి. విద్యుత్ సంస్థల ప్రతిపాదిత వ్యయానికి సంబంధించి, ఏ అంశానికి ఎంత అనుమతించాలనేది కమిషన్ నిర్ణయిస్తున్నది. కాస్ట్ టు సర్వ్ అంచనాలకు అనుసరిస్తున్న విధానాలను, వాటికి ఆధారంగా తీసుకొన్న గణాంకాలను, ఇతర

వివరాలను కమిషన్ రహస్యంగా వుంచుతున్నది. వాటిపై కూడా బహిరంగ విచారణ జరపాలన్న విజ్ఞప్తులను కమిషన్ పట్టించుకొనటం లేదు. ఆవిధంగా, కాస్ట్ టు సర్వ్ వ్యవహారం రహస్యంగా ఉండిపోతూ, వివాదాస్పదంగా కొనసాగుతున్నది. క్రాస్ సబ్సిడీలను క్రమేణా ఉపసంహరించాలన్న చట్ట నిబంధనను కమిషన్ అనుసరిస్తూ, క్రాస్ సబ్సిడీని క్రమేణ తగ్గిస్తూ వస్తున్నది.

నియంత్రణ కమిషన్ తన తొలి ఛార్జీల ఉత్తర్వులో గృహ విద్యుత్ వినియోగదారుల శ్లాబ్‌లకు తనంత తాను తగ్గించింది. గృహ విద్యుత్ వినియోగదారులకు రెండు శ్లాబులే వుండాలన్న ప్రపంచ బ్యాంకు వాదనలను తన అభిప్రాయంగా కూడా నియంత్రణ కమిషన్ తన ఉత్తర్వులలో వ్యక్తం చేసింది. అయితే, దీనికి వ్యతిరేకంగా వచ్చిన విమర్శలు, ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా 2000 సంవత్సరంలో మూడు మాసాల పాటు జరిగిన ఉధృతమైన ప్రజాందోళనను దృష్టిలో పెట్టుకుని నియంత్రణ కమిషన్ గృహ విద్యుత్ వినియోగదారులకు శ్లాబులను 6కు పెంచి, ప్రస్తుతం 5కు కుదించింది. గృహవిద్యుత్ ఛార్జీలకు టెలిస్కోపిక్ విధానాన్ని ప్రవేశపెట్టడం, ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తిదారులు తృతీయపక్ష విక్రయాలు చేయకుండా విద్యుత్‌ను ట్రాన్స్‌కోకే విక్రయించాలని ఇచ్చిన ఉత్తర్వులు, కాప్టివ్ విద్యుత్‌ను ప్రత్యేక కేసులలోనే పరిమితంగా అనుమతించాలన్న నిర్ణయం ప్రజా ప్రయోజనానికి అనుకూలమైనవి.

అదేవిధంగా, అనుమతించిన దాని కన్నా వ్యవసాయానికి అదనంగా విద్యుచ్ఛక్తిని సరఫరా చేసినప్పుడు అందుకైన అదనపు వ్యయాన్ని ప్రభుత్వం భరించాలని కమిషన్ పేర్కొంది.

నియంత్రణ కమిషన్ చేసిన విశ్లేషణ ప్రకారం గత మూడేళ్ళలో ట్రాన్స్‌కో, విద్యుత్ పంపిణీ కంపెనీల నిర్వహణ ఫలితాలు ఇలా వున్నాయి.

	2000-01	2001-02	2002-03	2003-04
1. ఎపిట్రాన్స్‌కో పంపిణీ కంపెనీలకు అమ్మినది (మి.యూ)	41799	40678	43188	44392
2. పంపిణీ కంపెనీల విక్రయాలు (మి.యూ)	26976	28556	31277	33457
3. ప్రసార, పంపిణీ నష్టాలు	35.5%	29.8%	27.6%	24.6%
4. మీటరుతో కొలిచిన విక్రయాలు (మి.యూ)	15905	17353	20040	22107
5. మొత్తం విక్రయాలలో మీటరుతో కొలిచిన విక్రయాల శాతం	38.1%	42.7%	46.4%	49.8%
6. అమ్మిన యూనిట్ కయిన రేటు వ్యయం (రూ.)	3.32	3.17	2.89	2.92
7. అమ్మిన యూనిట్‌కు వసూలైన సగటు రేటు	2.07	2.17	2.31	2.38
8. వ్యయం వసూలు శాతం	62.5%	68.4%	80.2%	81.4%

(2003-04కు సంబంధించినవి ఛార్జీల ఉత్తర్వులోని అంచనాలు).

పంపిణీ కంపెనీల విక్రయాలు మీటరుతో కొలిచిన విక్రయాలు, సగటున యూనిట్‌కు వసూలు చేస్తున్న మొత్తం పెరిగినట్లు, ప్రసార, పంపిణీ నష్టాల శాతం తగ్గినట్లు పై పట్టికలోని వివరాలు స్పష్టం చేస్తున్నాయి.

క్రాస్ సబ్సిడీలనిస్తున్న కేటగరీల వినియోగదారులకు ఛార్జీలను తగ్గిస్తూ, సబ్సిడీ పొందుతున్న కేటగరీల వినియోగదారులకు ఛార్జీలను పెంచుతూ నియంత్రణ కమిషన్ క్రాస్ సబ్సిడీని తగ్గిస్తూ వస్తున్నది. ఇందుకు ప్రసార పంపిణీ నష్టాల తగ్గింపు, ట్రాన్స్‌కో, పంపిణీ కంపెనీలు అంతర్గత సామర్థ్యం పెంపుదల ద్వారా పొందగలుగుతున్న అదనపు ఆదాయాలను క్రాస్ సబ్సిడీల తగ్గింపు నిమిత్తం నియంత్రణ కమిషన్ సర్దుబాటు చేస్తూ వస్తున్నది. 2001-02లో రూ.1939కోట్లు (యూనిట్‌కు రూ.2.09), 2002-03లో రూ.1970కోట్లు (యూనిట్‌కు రూ.2.07) మేరకు క్రాస్ సబ్సిడీనిచ్చినట్లు కమిషన్ అంచనా. 2003-04లో రూ.2110కోట్ల మేరకు (యూనిట్‌కు రూ.1.80) క్రాస్ సబ్సిడీని ఇస్తున్నట్లు నియంత్రణ కమిషన్ అంచనా వేసింది. పై నాలుగేళ్ళలో దాదాపు రూ.1600కోట్లకు పైగా విద్యుత్ ఛార్జీలు, ఇతర ఛార్జీల పెంపుదల భారం వినియోగదారులపై పడింది. అయినప్పటికి, ప్రభుత్వం భారీగా సబ్సిడీలనీయాల్సి వస్తున్నది. మరోపక్క పంపిణీ కంపెనీలకు నష్టాలు వాటిల్లి, ప్రభుత్వం వాటికి అదనపు ఆర్థిక మద్దతునీయాల్సి వస్తున్నది.

రూ.కోట్లలో	2000-01	2001-02	2002-03	2003-04
1. ప్రభుత్వ సబ్సిడీ	1626	1561	1509	1513
2. పంపిణీ కంపెనీల లాభనష్టాలు	-1073	-876	-819	-
3. కమిషన్ అంచనాల ప్రకారం వాటి నష్టం	-1024	-	-254	-
4. ప్రత్యేక ఎప్రోప్రియేషన్	-	90	-163	73
5. వ్యవసాయ విద్యుత్‌కైన అదనపు వ్యయం ప్రభుత్వం భరించాల్సింది	934	-	-	473*
6. ప్రభుత్వ అదనపు మద్దతు	1133	896	350	-

★ 2001-02లో రూ.106కోట్లు, 2002-03లో రూ.367కోట్ల మొత్తాన్ని 2003-04 ఛార్జీల ఉత్తర్వులో సర్దుబాటు చేశారు.

పంపిణీ కంపెనీలు నియంత్రణ కమిషన్ అనుమతించిన దానికన్నా 2001-01లో 10.4శాతం, 2001-02లో 0.4శాతం తక్కువగా ఆదాయాన్ని వసూలు చేసుకున్నాయి. అయితే, 2002-03లో కమిషన్ రూ.6434కోట్ల ఆదాయాన్ని అనుమతించగా, నాలుగు పంపిణీ కంపెనీలు కలిసి రూ.7239కోట్ల మేరకు బిల్లింగు చేశాయి. ఆవిధంగా, అనుమతించిన దానికన్నా 12.5శాతం ఎక్కువగా బిల్లింగ్ చేసిన దానిలో 98శాతంగా నాలుగు కంపెనీలు రూ.7094కోట్లు వసూలుచేశాయి.

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ కమిషన్ నాలుగేళ్ళుగా అనుమతించిన విద్యుత్ ఛార్జీల పెంపుదల భారం వాస్తవ స్థాయి స్పష్టంగా పైకి కన్పించే రీతిలో లేదు. ఛార్జీల పెంపుదల కొంతమేరకు మరుగుపడి వుండే విధంగా కమిషన్ జారీ చేసిన ఉత్తర్వులున్నాయి. 2000-01 సంవత్సరానికి నియంత్రణ కమిషన్ జారీ చేసిన ఛార్జీల సవరణ ఉత్తర్వు ప్రకారం ఆ ఏడాది ఛార్జీల పెరుగుదల వల్ల వినియోగదారులపై పడిన అదనపు భారం రు.802.49కోట్లు. అయితే, ఏప్రిల్ మొదటి తేదీ బదులు జూన్ మొదటి తేదీ నుండి ఆ ఉత్తర్వులోని పెంపుదల అమలులోకి వచ్చినందున, 12 నెలల్లో వసూలు చేయాల్సిన మొత్తాన్ని పది నెలల్లోనే వసూలు చేసే విధంగా ఛార్జీల పెంపుదలను కమిషన్ అనుమతించింది. 2001-02 సంవత్సరంలో కూడా ఆ పెంపుదల కొనసాగింది. ఆవిధంగా 12 నెలల పాటు వసూలు చేయడంతో నెలకు దాదాపు రు.80కోట్ల చొప్పున రెండు మాసాల కాలానికి అదనంగా రూ.160కోట్ల మొత్తాన్ని 2001-02లో వసూలు చేయడానికి ముందుగానే ఛార్జీలను పెంచినట్లయింది. ఇదిగాక, ఆ ఏడాది రూ.90కోట్ల మొత్తాన్ని ప్రత్యేక ఎప్రోప్రియేషన్ ఛార్జీలను పెంచి వసూలు చేసుకునేందుకు కమిషన్ అనుమతించింది. 2000-01లో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గి, అదనంగా థర్మల్ విద్యుత్‌ను కొనాల్సివచ్చినందున అయిన అదనపు తేడా మొత్తం రూ.62కోట్లు, న్యాయస్థానం స్టే వల్ల సర్‌ఛార్జీ వసూళ్ళు జరగక తగ్గిన ఆదాయం రు.28కోట్ల మొత్తాలను 2001-02లో కమిషన్ ప్రత్యేక ఎప్రోప్రియేషన్‌గా అనుమతించింది. ఇదిగాక, విద్యుత్ పంపిణీ కంపెనీలు కోరిన రూ.46కోట్ల మేరకు ఛార్జీల పెంపుదలను కమిషన్ అనుమతించింది. అనగా, 2001-02లో అనుమతించిన మొత్తం ఛార్జీల పెంపుదల రూ.296కోట్లు (160+90+46=296కోట్లు).

2001-02లో ప్రత్యేక ఎప్రోప్రియేషన్‌గా అనుమతించిన మొత్తం రూ.90కోట్లు ఒక ఏడాది లోటులో పూడ్చుకొనడానికి అనుమతించిందే తప్ప, ప్రతి ఏటా కొనసాగించాల్సినది కాదు. అందువల్ల ప్రత్యేక ఎప్రోప్రియేషన్ మొత్తాన్ని కమిషన్ ఛార్జీల పెంపుదలలో చేర్చకుండా వివిధ కేటగిరీలు, స్లాబ్‌ల పెంపుదలలో చేర్చకుండా వివిధ కేటగిరీలు, స్లాబ్‌ల వినియోగదారుల వినియోగాన్ని, ఛార్జీల రేట్లను బట్టి అదే నిష్పత్తిలో ఆ మొత్తాలను విద్యుత్ బిల్లులలో విడిగా చూపి వసూలు చేసి వుండాల్సింది. అలాగాకుండా, ఆ మొత్తాలను ఛార్జీల పెంపుదలలో చేర్చినందున తదుపరి సంవత్సరం 2002-03లో కూడా ఆ పెంపుదలలో భాగంగా వినియోగదారుల నుండి అదనపు మొత్తాలను వసూలు చేయడానికి దారితీసింది. ఛార్జీలను పెంచినట్లు చూపకుండానే, చెప్పకుండానే పెంచి, వసూలు చేసే ట్రిక్కును నియంత్రణ కమిషన్ వినియోగదారులపై ప్రయోగించింది.

2001-02లో కమిషన్ అనుమతించిన 27651 మిలియన్ యూనిట్లపై ప్రత్యేక ఎప్రోప్రియేషన్ రూ.90కోట్లు కాగా, 2002-03లో నాలుగు పంపిణీ కంపెనీలు చూపిన 31277మి.యూ. విక్రయాలపై అదే నిష్పత్తిలో వసూలైన అదనపు మొత్తం రూ.101.80 కోట్లు అవుతుంది.

2002-03 సంవత్సరానికి విద్యుత్ ఛార్జీల పెంపుదల భారం రూ.130కోట్లు కాగా, వినియోగదారుల సర్వీసు ఛార్జీల పెంపుదల భారం రూ.130కోట్లు. అయితే, పరిశ్రమలకు విద్యుత్ ఛార్జీలను తగ్గించినందున రూ.84కోట్లు తగ్గుతున్నట్లు నియంత్రణ కమిషన్ పేర్కొంది. ఆవిధంగా, ఛార్జీల పెంపుదల వల్ల 2002-03లో విద్యుత్ పంపిణీ కంపెనీలకు లభించే అదనపు ఆదాయం తగ్గినా, పరిశ్రమేతర వినియోగదారులపై పడిన అదనపు భారం రూ.130కోట్లు మాత్రం తగ్గదు. అందువల్ల, వినియోగదారులకు సంబంధించినంత వరకు విద్యుత్ ఛార్జీల పెంపుదల అదనపు భారం రూ.260కోట్లు.

2002-03 సంవత్సరంలో ఇంధన సర్‌ఛార్జి సర్దుబాటు (ఎఫ్ఎస్ఎ) పేరుతో రూ.87.24కోట్ల మొత్తాన్ని అదనంగా విద్యుత్ వినియోగదారుల నుండి వసూలు చేయడానికి పంపిణీ కంపెనీలకు అనుమతినిస్తూ నియంత్రణ కమిషన్ మూడు ఉత్తర్వులను జారీచేసింది. 2000-01 సంవత్సరంలో ఎపిజెన్‌కోకు బొగ్గు కొనుగోలుకు అయిన అదనపు వ్యయాన్ని ఎఫ్ఎస్ఎ పేరుతో 2002-03లో సర్దుబాటు చేయాలని ఎపిట్రాన్స్‌కో కోరగా, నియంత్రణ కమిషన్

ఆవిధంగా అనుమతించింది. ఆవిధంగా 2002-03లో వినియోగదారులపై పడిన విద్యుత్‌ఛార్జీల పెంపుదల భారం రూ. 449.04కోట్లు (101.80+260+87.24=449.04కోట్లు) అవుతుంది.

2003-04 సంవత్సరానికి చేసిన విద్యుత్‌ఛార్జీల సవరణలో ఎల్‌టి కేటగిరీలో వాణిజ్య వినియోగదారులకు శ్లాబ్‌లను రెండు నుంచి మూడుకు పెంచి 51 నుండి 100 యూనిట్లు వరకు గల శ్లాబ్‌కు యూనిట్‌కు రూ.6.60గా ఛార్జీని కమిషన్ నిర్ణయించింది. దీనివల్ల ఈ శ్లాబ్ వినియోగదారులకు రూ.46కోట్లు మేరకు అదనపు భారం పడుతోంది.

ఈవిధంగా 2000-01 నుండి 2003-04 వరకు నాలుగేళ్లలో పెరిగిన విద్యుత్ ఛార్జీల మొత్తం రూ.1593.53కోట్లు (802.49.296.449.04.46=1593.53కోట్లు)

2001-02 సంవత్సరానికి రూ.876కోట్లు, 2002-03 సంవత్సరానికి రూ.819 కోట్లు నష్టాలను ట్రాన్స్‌కో, పంపిణీ కంపెనీలు చూపాయి. ఈ రెండేళ్ళకు కలిపి రూ.473కోట్లు మొత్తాన్ని వ్యవసాయానికి అదనంగా విద్యుత్ సరఫరాకు అయిన వ్యయం కింద ఈ సంస్థలకు ప్రభుత్వం సర్దుబాటు చేయాలని కమిషన్ సలహా ఇచ్చింది. ఈ రెండేళ్ళకు కలిపి రూ. 73కోట్ల మొత్తాన్ని 2003-04 సంవత్సరంలో విద్యుత్ ఛార్జీల రూపంలో సర్దుబాటు చేయడానికి కమిషన్ అనుమతించింది. జరగని వ్యయం కింద ఈ రెండేళ్ళలో రూ. 518కోట్ల మొత్తాన్ని ఈ సంస్థలు చూపిన నష్టాల నుండి కమిషన్ తగ్గించింది. ఇది కాక, ఇంధన ఛార్జీల పెరుగుదల సర్దుబాటు కింద 2001-02 సంవత్సరానికి రూ.52కోట్లు, 2002-03 సంవత్సరానికి రూ. 65కోట్లు మొత్తాన్ని విడిగా అనుమతిస్తామని కమిషన్ పేర్కొంది.

ట్రాన్స్‌కో, పంపిణీ కంపెనీలు గత రెండేళ్లలో వ్యయం చేస్తామని చూపిన మొత్తాలను వాస్తవంగా వ్యయం చేయనందున వాటి నష్టాల నుండి రూ.518కోట్లు మొత్తాన్ని తగ్గించటమంటే ఆ మొత్తంమేరకు ఆ రెండేళ్ళ విద్యుత్ ఛార్జీలను కమిషన్ అదనంగా రాబట్టే విధంగా అనుమతించిందన్న మాట. చూపిన విధంగా ఈ సంస్థలు గత రెండేళ్ళలో నిర్ణీత మొత్తాలను వ్యయం చేసి వుంటే, రూ. 518కోట్ల మొత్తాన్ని కూడా నియంత్రణ కమిషన్ ప్రత్యేక ఎప్రోప్రియేషన్‌గా అనుమతించి, 2003-04లో ఆ మేరకు ఛార్జీలను పెంచాల్సి వచ్చేది లేదా భవిష్యత్‌లో పెంచేందుకు ఆ మొత్తాన్ని రెగ్యులేటరీ ఎసెట్‌గా అనుమతించాల్సి వచ్చేది.

2003-04 సంవత్సరానికి సంబంధించి అక్టోబరు చివరి వరకు ట్రాన్స్‌కో, పంపిణీ కంపెనీలకు కలిసి రూ. 180కోట్ల నష్టం వచ్చినట్లు చూపుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా జలవిద్యుత్ ఉత్పత్తి అంచనాలు తగ్గి, థర్మల్ విద్యుత్‌ను అదనంగా కొనాల్సి రావటంతో పాటు వ్యవసాయం విద్యుత్ వినియోగం అంచనాకు మించి జరిగినట్లు చూపుతున్నారు. వచ్చే మార్చి చివరి వరకు ఈవిధంగా అదనపు వ్యయం గణనీయంగా జరిగే అవకాశముంది. వ్యవసాయానికి అయిన అదనపు వ్యయాన్ని ప్రభుత్వం సర్దుబాటు చేయాలని కమిషన్ తిరిగి సలహా ఇవ్వవచ్చు. అయితే, మిగిలిన నష్టాలు ఏమేరకు వుంటాయో కమిషన్ నిర్ధారించి ఆ మొత్తాన్ని 2004-05 సంవత్సర ఛార్జీలలో భాగంగా ప్రత్యేక ఎప్రోప్రియేషన్‌గా అనుమతించాలి. లేదా రెగ్యులేటరీ ఎసెట్‌గా అనుమతించాలి. ఇదిగాక, గత రెండేళ్ళకు ఇంధన సర్ ఛార్జి సర్దుబాటు కింద కమిషన్ అనుమతిస్తానన్న రూ.117కోట్ల మొత్తాన్ని ట్రాన్స్‌కో ఇంకా క్లెయిము చేయలేదు. ట్రాన్స్‌కో క్లెయిము చేస్తే ఆ మొత్తాన్ని కూడా కమిషన్ అనుమతించి, ఆ మేరకు ఛార్జీలలో భాగంగా అదనంగా వినియోగదారుల నుండి వసూలుచేసేందుకు కమిషన్ అనుమతిస్తుంది. అదేవిధంగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్యాస్ ధరలు పెరిగినందున ఎఫ్ఎస్ఏ కింద ట్రాన్స్‌కో మొదటి అర్థ సంవత్సరానికి చేసిన క్లెయిముల మొత్తాన్ని కూడా అనుమతిస్తూ కమిషన్ ఉత్తర్వులనీయాల్సి వుంది. ద్వితీయ అర్థ సంవత్సరానికి కూడా ట్రాన్స్‌కో క్లెయిము చేసే ఎఫ్ఎస్ఏను కమిషన్ అనుమతించాల్సి వుంటుంది.

ఈ పూర్వ రంగంలో ట్రాన్స్‌కో, నాలుగు పంపిణీ కంపెనీలు 2004-05 సంవత్సరానికి తమ వార్షిక ఆదాయ అవసరాలు, 2003-04 సంవత్సర లోటు అంచనాలను, రాబోయే సంవత్సరంలో ప్రస్తుతమున్న విద్యుత్ ఛార్జీల కింద వచ్చే ఆదాయ లోటు వుంటే దానిని భర్తీ చేసుకునేందుకు నిర్దిష్ట ప్రతిపాదనలను డిసెంబరు చివరిలో కమిషన్‌కు సమర్పించాలి. రెవెన్యూ లోటును తగ్గించుకొనేందుకు అంతర్గత సామర్థ్యం పెరుగుదల కింద సాధిస్తామని ప్రతిపాదించే అదనపు మొత్తాన్ని ఆ సంస్థలు చూపవచ్చు. మిగిలిన లోటుకు సంబంధించి ప్రభుత్వం సబ్సిడీగా ఇవ్వజూపే మొత్తంపోను, ఇంకా లోటు వుంటే దానిని భర్తీ చేసుకునేందుకు కమిషన్ ఛార్జీలను పెంచాల్సి వస్తుంది. ఇదంతా జరగడానికి ముందు ఫిబ్రవరిలోనే ముందస్తు ఎన్నికలు జరగాలని ప్రభుత్వం భావించింది. ఆవిధంగా, బడ్జెటులో చూపాల్సిన విద్యుత్ సబ్సిడీ మొత్తం, విద్యుత్ ఛార్జీల పెంపుదల ఎన్నికల అనంతర కాలంలో తేలితే, దీనికి సంబంధించిన ప్రజా వ్యతిరేకత నుండి ఎన్నికల ముందు కాలంలో తప్పుకోవచ్చునని ప్రభుత్వం భావించింది. అయితే, అలా జరిగే సూచనలు కన్పించటం లేదు.

వ్యవసాయానికి సబ్సిడీ ఛార్జీలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేయడం విద్యుత్ రంగ ఆర్థిక సమస్యలకు ఒక ప్రధాన కారణమని ఉదారవాద సంస్కరణల మద్దతుదారులు చిత్రిస్తున్నారు.

అయితే, వ్యవసాయరంగానికి ఇస్తున్న విద్యుత్, క్రాస్ సబ్సిడీ, ప్రభుత్వ సబ్సిడీలకు సంబంధించి విద్యుత్ సంస్థలు, నియంత్రణ కమిషన్ అంచనాలు అధికంగా వుంటున్నాయి. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు లేనందున, వ్యవసాయ విద్యుత్ వినియోగం అంచనాలలో కొంతకాలం పంపిణీ వాణిజ్య నష్టాలను చేర్చి చూపుతున్నారన్న సహేతుక విమర్శలున్నాయి.

ప్రభుత్వం ఇస్తున్న విద్యుత్ ఛార్జీల సబ్సిడీ వివిధ రూపాలలో

వివిధ వర్గాలకు పోతున్నది. విద్యుత్ వ్యవస్థలో వున్న లోటుపాట్ల వల్ల ప్రసార, పంపిణీలలో నష్టాల నిమిత్తం ప్రభుత్వ సబ్సిడీలో కొంత మొత్తం పోతున్నది.

విద్యుత్ చౌర్యం, అక్రమ వినియోగాల వల్ల వాటిల్లుతున్న వాణిజ్య నష్టాలు, వాటిని అరికట్టడంలో అసమర్ధత, అవినీతికి కొంత మొత్తం సబ్సిడీ పోతున్నది. ప్రైవేటు విద్యుత్ ప్రాజెక్టుల పెట్టుబడి వ్యయాన్ని చాలా ఎక్కువగా అనుమతించడం వల్ల వాటితో లోపభూయిష్ట విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకొనటం వల్ల, వాటి యజమానులకు విపరీతమైన లాభాలను కట్టబెడుతూ, వినియోగదారుల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారు.

ఆవిధంగా ప్రైవేటు విద్యుత్ ప్రాజెక్టుల నుండి చాలా అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేయడం వల్ల నివారించదగిన అదనపు వ్యయం నిమిత్తం ప్రభుత్వ సబ్సిడీ గణనీయంగా పోతున్నది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలలోని లోపభూయిష్ట షరతుల వల్ల డీమ్డ్ జనరేషన్ నిబంధన కింద ఒక్క యూనిట్ విద్యుత్‌ను కూడా కొనకుండా, లేదా పాక్షికంగా కొనుగోలు చేస్తూ, కొన్ని ప్రాజెక్టులకు పూర్తి స్థిర ఛార్జీలను, కొన్ని ప్రాజెక్టులకు డీమ్డ్ జనరేషన్‌పై ప్రోత్సాహకాలను, ఇంధన సరఫరాకు సంబంధించి కొన్ని ఖర్చులను చెల్లిస్తున్నారు.

వినియోగదారులకు పెట్టుబడికి తగిన ప్రయోజనం చేకూరకుండా, వానిపై నివారించదగిన అదనపు భారాన్ని మోపుతూ, విద్యుత్ సంస్థలు - అవివేకమైన వ్యయం చేసిన చోట వృధా అవుతున్న మొత్తాన్ని సర్దుబాటు చేయడానికి ప్రభుత్వ సబ్సిడీలో కొంతభాగం పోతున్నది.

ఇలాంటి నివారించదగిన అధిక, వృధా వ్యయం పోగా, ప్రభుత్వమిస్తున్న సబ్సిడీలో వ్యవసాయ, గృహ, తదితర కేటగిరీల విద్యుత్ వినియోగదారులకిస్తున్న సబ్సిడీ మొత్తం చాలా తక్కువగానే వుంటుంది. విద్యుత్ వినియోగంలో పొదుపుకు, ముఖ్యంగా వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన డిమాండు పక్ష నిర్వహణ (డిఎస్ఎం) చర్యలను తీసుకొనేందుకు ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు పూనుకొనటం లేదు.

2001-02 నుండి 2006-07 వరకు ఎపిట్రాన్స్‌కో సమర్పించిన విద్యుత్ డిమాండు పెరుగుదల అంచనాలు, విద్యుత్ సేకరణ ప్రణాళికలపై బహిరంగ విచారణ జరపకుండా విద్యుత్ నియంత్రణ కమిషన్ గత ఏప్రిల్ 8న ఇచ్చిన ఉత్తర్వు దీర్ఘకాలిక ప్రభావం చూపేదిగా వుంది. పై ప్రణాళికా కాలంలో అదనంగా చేర్చాల్సిన సామర్థ్యాన్ని తొలుత 2405 మెగావాట్లుగా అంచనావేసిన కమిషన్ దానిని 3180మె.వా.కు, తిరిగి 5182మె.వా.కు పెంచింది. డిమాండు తీర్చడానికి పోను పీక్ డిమాండు, అత్యవసర పరిస్థితులలో అదనంగా ప్రత్యామ్నాయంగా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు వీలుగా రిజర్వ్ మార్జిన్‌కు స్థాపన సామర్థ్యంలో తొలుత 14శాతంగా నిర్ణయించిన కమిషన్ తరువాత దానిని 29శాతానికి పెంచింది. ఆవిధంగా 2006-07 నాటికి 13639మె.వా. స్థాపన సామర్థ్యాన్ని చేర్చితే, 78,880 మిలియన్ యూనిట్ల విద్యుత్ లభిస్తుంది. కాగా, 2006-07లో అవసరమవుతుందని అంచనా వేసిన విద్యుత్ 61017మి.యూ.లు మాత్రమే. అనగా, 17683మి.యూ.ల మేరకు మిగులు తేలుతుంది. దీనిని రాష్ట్రం బయట, లోపల అమ్ముకోలేకపోతే, డీమ్డ్ జనరేషన్ కింద దాదాపు రూ.2000కోట్ల మొత్తాన్ని అదనంగా చెల్లించాల్సి వస్తుంది.

పెట్రోలియం ఉత్పత్తులపై నియంత్రిత ధరల విధానాన్ని (ఎపిఎం) కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసినందున, గ్యాస్ ధరలు పెరుగుతున్నందున, విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం పడుతున్నది. ప్రభుత్వం ప్రకటించిన విధంగా గ్యాస్ ధరలను 107శాతం పెంచితే, ప్రస్తుతమున్న కొత్తగా నియంత్రణ కమిషన్ విద్యుత్ కొనుగోలు ఒప్పందాలకు అనుమతులనిచ్చిన గ్యాస్ ఆధారిత విద్యుత్‌ప్రాజెక్టుల అస్థిరఛార్జీలు రూ.1050కోట్ల దాకా పెరుగుతాయి.

పార్లమెంటు ఆమోదించిన విద్యుత్ చట్టం, 2003లోని నిబంధనలు వ్యవసాయ, గృహ తదితర సబ్సిడీ పొందే విద్యుత్ వినియోగదారులపై ఛార్జీల భారాన్ని విపరీతంగా పెంచేందుకు దారితీస్తాయి. క్రాస్ సబ్సిడీలను క్రమేణా ఉపసంహరించటం, తృతీయపక్ష విక్రయాలను అనుమతించటం, కాప్టివ్ విద్యుత్ పేరుతో క్రాస్ సబ్సిడీకి సర్‌ఛార్జి లేకుండా ఎక్కువమందికి సరఫరా చేసుకొనేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తున్నది. క్రాస్ సబ్సిడీని సమకూర్చుతున్న వినియోగదారులు గ్రిడ్ నుండి తప్పుకొనటానికి, క్రాస్ సబ్సిడీలను పొందుతున్న కేటగిరీల వినియోగదారులు ప్రభుత్వ విద్యుత్ సంస్థలకు మిగిలిపోవటానికి ఇవి దారితీస్తాయి. అలాంటి పరిస్థితిలో, క్రాస్ సబ్సిడీలను ఉపసంహరించడం వల్ల ముఖ్యంగా వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరుగుతాయి. లేదా ప్రభుత్వమివ్వాల్సిన సబ్సిడీ భారీగా పెరుగుతుంది. ప్రభుత్వ సబ్సిడీలను కూడా తగ్గించినా, ఉపసంహరించినా, వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల పెంపుదల భారం మరింత అధికంగా వుంటుంది. వీటికి తోడు, విద్యుత్ పంపిణీని ప్రైవేటీకరించే ప్రమాదం కూడా ముంచుకొస్తున్నది. అలా జరిగితే, అది పై పరిస్థితిని మరింత వేగవంతం చేయడంతో పాటు కొత్త సమస్యలను తెచ్చిపెడుతుంది. రాష్ట్రంలో వివిధ విద్యుత్ పంపిణీ కంపెనీల కింద ఒకే కేటగిరీ కిందనున్న విభిన్న ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు విభిన్న ఛార్జీలను చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రాంతీయ అసమానతలు, అశాంతికి ఆజ్యంపోయడానికి ఇది దారితీస్తుంది. విద్యుత్ ఛార్జీలలో శ్లాబ్ విధానానికి మంగళం పాడటానికి ఇది దారితీస్తుంది. వ్యవసాయ పంపుసెట్లుతో బావులు, బోరు బావుల వంటి వనరుల కింద సాగుచేసుకునేందుకు రైతులు మితిమీరిన విద్యుత్‌ఛార్జీలను చెల్లించలేని పరిస్థితి ఏర్పడి, ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతుంది. కేంద్ర విద్యుత్ చట్టం అమలు విద్యుత్ రంగంలో అరాచకానికి, అంధకారానికి బాటలు వేస్తుంది. ◆

ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక సంస్కరణలు - సాంఘిక సంక్షేమం

-ప్రొ. కె. చక్రధరరావు

ఆంధ్రప్రదేశ్‌లో 1996-97లో ఆర్థిక సంస్కరణల అమలు ప్రారంభమయినప్పటి నుండి సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు, పథకాలకు ప్రాధాన్యత, అలాగే వాటికి బడ్జెట్ కేటాయింపులు, వ్యయాలు కూడా తగ్గిపోయినాయి. అందుకు కారణం, సంక్షేమ వ్యయాలు అనుత్పాదక లేక వృధా వ్యయాలనీ, వాటిపై ప్రభుత్వం ఎక్కువ వ్యయం చేస్తే అభివృద్ధి వ్యయాలు తగ్గిపోతాయనే తప్పుడు అభిప్రాయాలే. నిజానికి యిప్పుడు వాషింగ్‌టన్‌లోని ప్రపంచ బ్యాంకు మొదలుకొని మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని వారందరూ అభివృద్ధికి ఒక వక్రమైన, సంకుచితమైన నిర్వచనాన్ని యిస్తున్నారు. స్వేచ్ఛా మార్కెట్ ఆర్థికవ్యవస్థలో ప్రైవేటు రంగ పెట్టుబడుల ద్వారా ఉత్పత్తులను, జాతీయాదాయాన్ని పెంచడాన్నే అభివృద్ధి అని చెప్తున్నారు. అభివృద్ధిలో ప్రభుత్వ భాగస్వామ్యం అవసరం లేదనీ, అది ప్రైవేటు పెట్టుబడులకు, విదేశీ పెట్టుబడులకు కావలసిన సౌకర్యాలను మాత్రం సమకూరిస్తే సరిపోతుందనీ చెప్తున్నారు. 19వ శతాబ్దపు నవ్య సంప్రదాయ ఆర్థికవేత్తల స్వేచ్ఛా మార్కెట్, పోటీ, స్వేచ్ఛా వ్యాపారం మొదలైన సిద్ధాంతాల ఆధారంగా యిటీవల వృద్ధి చెందిన నవ్య ఉదారవాద భావాలు, విధానాలు, అలాగే పెట్టుబడి దారీ ప్రపంచీకరణలు ఈ రకమైన అభివృద్ధి దృక్పథాన్ని పెంపొందిస్తున్నాయి. మార్కెట్ వ్యవస్థ ప్రైవేటు సరుకులను మాత్రమే ఉత్పత్తి చేసి సరఫరా చేయగలుగుతుందనీ, సాంఘిక సంక్షేమం, సాంఘిక భద్రతలకు సంబంధించిన అనేక వస్తు సేవలను అది అందించలేదనీ, ప్రభుత్వం మాత్రమే వీటిని అందించగలుగుతుందనీ పాశ్చాత్యులతో సహా అనేకమంది ఆర్థిక శాస్త్రవేత్తలు వ్యక్తపరిచారు.

వాస్తవానికి అభివృద్ధి, సంక్షేమం వేరు కావు. సంక్షేమం పెరుగుదలే అభివృద్ధి. వనరుల వినియోగం, సాంకేతిక పద్ధతులు, శ్రమ వినియోగం, ఉపాధులు, ఉత్పత్తి, సమత్వ ఆదాయపంపిణీ, అందరి అవసరాలు తీరడం, అందరి జీవన నాణ్యత మెరుగవ్వడం - యిదంతా అభివృద్ధి క్రమంలో భాగమే. కానీ యిప్పటి వక్ర దృక్పథంలో ఉత్పత్తి పెరుగుదల వేరు, ఉపాధి కల్పన వేరు, సంక్షేమం వేరుగా చూడబడుతున్నాయి. అందుకనే ఒక దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశం అయినా, అక్కడ ఆకలి, ఆహారకొరత, వ్యాధులు, నిరుద్యోగం, బీదరికం, ఆర్థిక అభద్రత, అసమానతలు కొనసాగుతున్నాయి. వీటిని మార్కెట్ తొలగించలేదు. ప్రభుత్వాలే ఇందుకు పూనుకోవాలి. యుఎన్‌డిపి మానవాభివృద్ధి నివేదిక 2000లో 18 అభివృద్ధి చెందిన దేశాలకు రూపొందించిన బీదరికపు సూచికలో అమెరికా అట్టడుగున వుండి అత్యధిక పేదరికాన్ని కలిగి వుంది. అమెరికా యిప్పుడు ప్రపంచంలోకెల్లా అత్యధికంగా అభివృద్ధి చెందిన దేశం కదా మరి! యిదీ యిప్పటి అభివృద్ధి కథ. అందుకే యిప్పుడు అమెరికా మరియు యూరపు దేశాలలో ప్రపంచీకరణకు, పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకత పెరుగుతుంది.

సామాజిక శాస్త్రవేత్తలు మానవ సంక్షేమాన్ని లేక సామాజికాభివృద్ధిని అంచనా వేయడానికి వివిధ పద్ధతులను అనుసరించారు. వాటిలో అనేక సామాజిక సూచికలను ఉపయోగించారు. వాటిలో ముఖ్యమైనవి యీ క్రిందివి.

కనీస మానవ అవసరాలు:

కనీస అవసరాలు ఎంతవరకు తీరుతున్నాయనే దాన్ని బట్టి యిందులో సంక్షేమాన్ని అంచనావేస్తారు. కనీస అవసరాలు వివిధ రకాలుగా చెప్పబడవచ్చు. కానీ సాధారణంగా కనీస స్థాయిలో ఆహారం, ఆరోగ్యం, యిల్లు, విద్య మరియు అభివృద్ధి అవకాశాలు వుండాలని అందరూ అంగీకరిస్తారు. శిశు మరణాలు, శిశువులకు ఆహారం, ఆయు ప్రమాణం మరియు వయోజన విద్య వంటివి వీటిని తగిన సూచికలు.

భౌతిక జీవన నాణ్యత సూచిక:

అంతర్జాతీయ అభివృద్ధి సమితి రూపొందించిన యీ సూచికకు ఆయు ప్రమాణం, శిశు మరణాల రేటు మరియు సాక్షరతా రేటు అనే అంశాలను ఆధారంగా తీసుకొన్నారు. యీ సూచికను బట్టి చూస్తే జీవన నాణ్యత అతి సంపన్న దేశాల కంటే కొన్ని అల్పాదాయ దేశాలలో ఎక్కువగా వున్నట్లు తేలింది.

మానవాభివృద్ధి సూచిక:

ఐక్యరాజ్యసమితి అభివృద్ధి సంస్థ 1990 నుండి మానవాభివృద్ధి నివేదికను వెలువరిస్తోంది. అభివృద్ధి అంటే మానవాభివృద్ధేననీ, ప్రజల స్తోమతలు, అవకాశాల పెరుగుదలే అభివృద్ధి లక్ష్యాలనే చర్చను యీ సంస్థ లేవనెత్తింది. ఆయుప్రమాణ సూచిక, విద్యా సూచిక, స్థూల జాతీయోత్పత్తి సూచికల ఆధారంగా మానవాభివృద్ధి సూచికను యీ నివేదికలో చేర్చారు. ఆ సూచిక ఆధారంగా 174దేశాలకు మానవాభివృద్ధి ర్యాంకులు నిర్ణయించి వాటిని అధిక, మధ్య మరియు అల్ప మానవాభివృద్ధి దేశాలుగా వర్గీకరించారు. 1990లో అల్ప మానవాభివృద్ధి దేశంగా వున్న మనదేశం యిప్పుడు మధ్యదేశంగా చూడబడుతోంది.

II

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రపంచ బ్యాంకుతో చేసుకొన్న ఒప్పందం ప్రకారంగా 1997 జనవరిలో పెట్టుబడిదారీ ఆర్థిక సంస్కరణలను ప్రారంభించింది.

ఏడేళ్ల సంస్కరణల అమలు తరువాత కొన్ని సామాజిక ఆర్థిక సూచికలను పరిశీలిస్తే రాష్ట్ర పరిస్థితి దయనీయంగా వుంది. సాక్షరతారేటు (61.11%) అతి తక్కువగా వుండి, బాల కార్మికత(12.5%), శిశు మరణాల రేటు (6.3%), స్త్రీల పౌష్టికాహార లోపం (98%), వ్యవసాయ రంగంలో జనాభా (70.4) అత్యధికంగా వున్నాయి. మానవాభివృద్ధి సూచిక 10వ ర్యాంకు వుంది. వీటన్నిటిని బట్టి చూస్తే మనరాష్ట్రం బాగా వెనుకబడిన రాష్ట్రాల సరసన వుంది.

రాష్ట్రంలో 1986-87లో రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 11%గా వున్న సామాజిక

రంగ వ్యయం 1990 దశకంలో 7% సగటుకు తగ్గిపోయింది. విద్య, వైద్య రంగాలలో ప్రైవేటు రంగం ప్రోత్సహించబడింది. ప్రైవేటు హాస్పిటల్ల శాతం 64.5గా వుంది. పన్నుల రాబడి కొరకు మద్యనిషేధం ఎత్తివేశారు. సబ్సిడీ బియ్యం ధర పెంచారు. ఉద్యోగాల భర్తీని ఆపివేశారు. నిరుద్యోగం బాగా పెరిగింది. విద్యుత్ ఛార్జీలను పెంచారు.

వీటితో పాటు, సాంఘిక సంక్షేమం స్థితిగతులు యిందుకు భిన్నంగా ఏమిలేవు. సాంఘిక సంక్షేమ కార్యక్రమాల్లోకి షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, యితర వెనుకబడ్డ తరగతులు, స్త్రీలు, శిశువులు, వృద్ధులు, వికలాంగులు, జోగినులు, యాచకులు వస్తారు. వీరు జనాభాలో 70% వరకు వుంటారు. వీరి సంక్షేమం కోసం ప్రభుత్వం చేసే వ్యయం ఎంతో చూద్దాం.

సామాజిక సంక్షేమం ఖర్చు:

యిందుకు చేసిన బడ్జెట్ కేటాయింపులు, ఖర్చుల మొత్తాలను చూస్తే పెరుగుతున్నట్లు వుంటాయి. కానీ మొత్తం ప్రభుత్వ వ్యయంలో గానీ, రెవెన్యూ పద్దు కింద వ్యయంలో గానీ లేదా రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో గానీ యీ వ్యయం శాతాన్ని చూస్తే యిందులో ధోరణి స్పష్టమవుతుంది. సామాజిక సంక్షేమ వ్యయం 1991-92లో రెవెన్యూ పద్దు కింద ఖర్చులో 5.87%, 1992-93లో 5.63%గా వుంటే సంస్కరణల కాలంలో అది ఎలా తగ్గిందో క్రింది పట్టిక నుండి తెలుస్తుంది.

(కోట్ల రూ)

సం॥	రెవెన్యూ పద్దు ఖర్చు	సామాజిక సంక్షేమం ఖర్చు	శాతం
1996-97	13,354	545	4.08
1997-98	13,663	565	4.13
1998-99	15,250	449	2.94
1999-00	18,023	546	3.03
2000-01	21,295	511	2.40
2001-02	24,726	624	2.52
2002-03	27,272	717	2.62
2003-04	31,423 (కేటాయింపు)	858	2.73

Source: 1. AP Economy 1996-2001, An Alternative survey, Praja Shakthi Book House. 2. Annual Plan, A.P. 2003-04.

పై పట్టికలో సామాజిక సంక్షేమం ఖర్చు రెవెన్యూ పద్దు కింద ఖర్చు శాతంగా 1996-97 నుండి 2003-04 వరకు తగ్గుతూ వచ్చిందని తెలుస్తూంది.

యస్.సి., యస్.టి., బి.సి.ల సంక్షేమం (కోట్ల రూ॥)

వీరికై ప్రభుత్వం చేసిన వ్యయాలు యీ క్రింది విధంగా వున్నాయి.

సం॥	యస్.సిలపై ఖర్చు	రెవెన్యూఖర్చు లో శాతం	యస్.టిలపై ఖర్చు	రెవెన్యూఖర్చులో శాతం	బి.సి.లపై వ్యయం	రెవెన్యూఖర్చులో శాతం
1996-97	319	2.4	244	1.8	17	0.1
1997-98	307	2.3	325	2.3	20	0.1
1998-99	421	2.8	353	2.3	152	1.0
1999-00	527	2.5	252	1.3	228	1.2
2000-01	229	1.1	371	1.7	220	1.0
2001-02	570	2.3	324	1.3	235	0.9
2002-03	376	1.3	341	1.2	112	0.4
2003-04	523 (కేటాయింపు)	1.6	335 (కేటాయింపు)	1.0	186 (కేటాయింపు)	0.5

Source: As above.

మహిళా శిశు సంక్షేమ వ్యయం

సం॥	మహిళా శిశుసంక్షేమం ఖర్చు	రెవెన్యూ ఖర్చులో శాతం
1996-97	56	0.4
1997-98	56	0.4
1998-99	75	0.5
1999-00	140	0.7
2000-01	117	0.5
2001-02	301	1.2
2002-03	210	0.7
2003-04	358 (కేటాయింపు)	1.1

III

తుది పరిశీలన:

1. పై పట్టికలను బట్టి చూస్తే సంస్కరణల కాలంలో సాంఘిక సంక్షేమానికి ప్రభుత్వ ప్రాధాన్యత తగ్గినట్లు తెలుస్తుంది.
2. సాంఘిక సంక్షేమం, యస్.సి., యస్.టి., బి.సి., మహిళా, శిశు సంక్షేమ ఖర్చులు అతి తక్కువగా వుండి, మొత్తం రెవెన్యూ ఖర్చులో వాటి శాతం తగ్గుతూ వున్నాయి. ఖర్చులు కేటాయింపుల కంటే తక్కువగా వున్నాయి.
3. యస్.సిల కోసం చేసిన ఖర్చులో 70% స్కాలర్‌షిప్‌లు, హాస్టల్లపైనే. యిళ్ల వసతి, భూవసతి, నీటిపారుదల మొదలైన వాటికి చేసిన ఖర్చు తక్కువ. అంటరానితనం కొనసాగుతుంది. దళితులపై దాడులు పెరుగుతున్నాయి.
4. గిరిజనుల విద్య కోసం ఆశ్రమ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, హాస్టళ్లు, స్కాలర్‌షిప్‌లు, పోషకాహారం, ఆరోగ్యం, నీటిపారుదల మొదలైన వాటిపై తక్కువ వ్యయం చేయబడింది. మొత్తం రెవెన్యూ ఖర్చులు యస్.సి.లకు 15శాతం, యస్.టి.లకు 6% ఖర్చు చేయవలసి వుండగా, చేసిన ఖర్చు అతి తక్కువగా వుంది.
5. బి.సి.లకు విద్య, శిక్షణ, స్వయం ఉపాధి, స్వయం సహాయక సంఘాలు, దారిద్ర్య నిర్మూలనలపై కేటాయింపులు వ్యయాలు తగ్గిపోయినాయి. ఆదరణ పథకానికి యిటీవల కేటాయింపులే లేవు. ప్రైవేటీకరణతో రిజర్వేషన్లు నామమాత్ర మయినాయి.
6. మహిళా శిశువుల అంగన్ వాడీలకు, శిక్షణ, పోషకాహారాలపై వ్యయాలు తగ్గాయి.
7. యీ సామాజిక వర్గాల అభివృద్ధి జరగాలంటే వీరి సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యతనిచ్చి ఎక్కువ నిధులు ఖర్చు చేయాలి.

త్రాగునీరు, పారిశుధ్యం - కొన్ని వాస్తవాలు

- డా. సి. రామచంద్రయ్య
రీడర్, సెస్, హైదరాబాదు.

గడచిన అయిదు దశాబ్ధాలలో భారతదేశం వివిధ రంగాలలో ఎంతో పురోగతిని సాధించింది. కాని అత్యంత ప్రాధాన్యమైన పేదరిక నిర్మూలన, సామాన్య ప్రజలకు సరిపడ త్రాగునీరు అందించడంలోను, పారిశుధ్య వసతి కల్పించడంలోను ఘోరంగా విఫలమైంది. వందకోట్ల జనాభాలో దాదాపు మూడవ వంతు కటిక పేదరికంలో మగ్గుతున్నారంటే ఈ దేశం సాధించిన ప్రగతి వారికి చేరలేదనే చెప్పవచ్చు. దాదాపు 22కోట్ల జనాభాకు సరైన త్రాగునీరు అందడం లేదని, కలుషితమైన నీరు, పారిశుధ్య వసతి లేకపోవడం వలన కలిగే వ్యాధుల మూలంగా ప్రతి యేటా దాదాపు 15లక్షల పిల్లలు మరణిస్తున్నారనీ దక్షిణాసియా మానవ అభివృద్ధి నివేదిక తెలుపుచున్నది. ఈ వ్యాధులు, మరణాల వలన ప్రతియేటా 18-20కోట్ల పని దినాలు కోల్పోతున్నారు. వీరంత పేదవారు, అల్పాదాయ వర్గాలవారే.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఎక్కువ మరణాలకు కారణమవుతున్న 37వ్యాధులలో 21వ్యాధులు నీటి కాలుష్యం, పారిశుధ్యానికి సంబంధించినవి. సామాన్య ప్రజలు గురౌతున్న వ్యాధుల్లో 80శాతం ఈ రంగానికి చెందినవే. ముఖ్యంగా పట్టణాలలో తాగునీటి సరఫరా, పారిశుధ్య కల్పన చాలా అసమానతలను, అన్యాయంగాను, ధనిక వర్గాలకు అనుకూలమైనవిగాను వున్నాయని కేంద్రప్రభుత్వంచే నియమించబడిన జాతీయ నగరీకరణ కమిషన్ 1988లో సమర్పించిన నివేదికలో స్పష్టంగా తెలిపింది. ఎంత పేదవారైనప్పటికి తలసరి 70లీటర్ల శుభ్రమైన నీరు ప్రతి ఒక్కరికి అందేలా చేయాలని, అందుకు యిప్పుడు అందుబాటులో వున్న నీరు సరిపోతుందని తేల్చి చెప్పింది. చిత్తశుద్ధి కలిగి, నీటి పంపిణీ విధానంలో మార్పు తీసుకురావాలని సూచించింది. ఆ నివేదిక సూచనలను అమలు చేయడానికి కేంద్రంలోగాని, రాష్ట్రాలలో కాని ఏ ప్రభుత్వాలు చిత్తశుద్ధి కనపరచలేదు.

నేషనల్ శ్యాంపిల్ సర్వే సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం 1998లో గ్రామీణప్రాంతాలలో 18.7శాతం, పట్టణాలలో 70.1శాతం కుటుంబాలకు కుళాయి ద్వారా ప్రధానంగా నీటి సరఫరా (పట్టిక 1) జరుగుతున్నది. కుళాయి ద్వారా అందే నీటిని సురక్షితమైనదిగా పరిగణిస్తారు. ఇందులో మినహాయింపులున్న మాట వాస్తవమైనప్పటికి ఈ పట్టికలో గమనించవలసిన దేమంటే 1988-98 దశకంలో గ్రామాలలో కుళాయిల ద్వారా నీటి సరఫరా చాలా తక్కువ మోతాదులోనే పెరిగింది. దురదృష్టమేమిటంటే నగరాలలో అది తగ్గింది. అభివృద్ధి క్రమంలో కుళాయిల ద్వారా నీరు అందుతున్న వాళ్ళ శాతం పెరగాలి. బోరుబావులు, చేతిపంపుల మీద ఆధారం పెరిగింది. అంటే త్రాగునీటి కోసం భూగర్భ జలాల మీద ఆధారపడే కుటుంబాల శాతం పెరిగింది. ఈ పరిణామం కూడా ప్రజల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది.

1988-98 మధ్య వివిధ వనరుల ద్వారా తాగునీటి సౌకర్యం పొందుతున్న కుటుంబాలు (శాతం)

	రూరల్			అర్బన్		
	1988	**1993**	**1998**	**1988**	**1993**	**1998**
కుళాయిలు	15.5	18.9	18.7	72.1	70.4	70.1
ట్యూబ్‌వెల్, హాండ్ పంప్	39.1	44.5	50.1	17.2	18.5	21.3
వెల్	39.1	31.7	25.8	9.2	8.6	6.7
ట్యాంక్, పాండ్స్ ఎక్స్‌ట్రా	2.2	2.1	1.9	0.3	0.8	0.3
రివర్/&కెనాల్/లేక్	2.4	1.7	1.3	0.3	0.1	0.2
స్ప్రింగ్	1.4	0.9	1.7	0.2	0.1	0.1
అదర్స్	0.6	0.3	0.4	0.8	1.4	1.1
ఆల్	100.0	100.0	100.0	100.0	100.0	100.0
నో లెట్రిన్ యూజ్‌డ్	89.0	85.8	82.5	31.8	30.6	25.5

సోర్స్ : ఎన్ఎస్ఎస్ఓ

దేశంలోని ప్రధాన రాష్ట్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యంగల కుటుంబాలు

	డ్రింకింగ్ వాటర్				నో లెట్రిన్ యూజ్‌డ్	
	రూరల్		అర్బన్			
స్టేట్	కుళాయిలు	ట్యూబ్‌వెల్/	టాప్	ట్యూబ్‌వెల్/	రూరల్	అర్బన్
1. ఆంధ్రప్రదేశ్	26.2	46.9	75.1	12.8	88.5	30.8
2. అస్సాం	7.3	49.5	42.2	38.4	24.7	2.0
3. బీహార్	0.7	70.3	35.3	43.1	89.4	45.3
4. గుజరాత్	46.6	31.7	91.1	7.3	79.9	21.1
5. హర్యానా	31.1	49.9	80.5	19.4	84.5	32.9
6. కర్ణాటక	26.6	53.9	80.9	11.2	88.9	30.0
7. కేరళ	10.6	1.4	40.2	3.5	23.1	5.1
8. మధ్యప్రదేశ్	5.0	52.2	76.1	13.1	94.5	45.2
9. మహారాష్ట్ర	41.1	24.4	92.0	5.3	85.8	15.8
10. ఒరిస్సా	2.9	53.2	38.7	32.3	96.1	35.8
11. పంజాబ్	14.8	82.7	64.4	35.5	67.9	14.8
12. రాజస్థాన్	19.2	36.2	85.4	10.4	87.0	25.5
13. తమిళనాడు	50.0	31.1	74.0	18.7	88.5	32.5
14. ఉత్తరప్రదేశ్	8.8	63.5	43.2	53.2	90.6	28.2
15. వెస్ట్‌బెంగాల్	4.1	75.6	56.0	38.2	76.1	15.2
ఇండియా	18.7	50.1	70.1	21.3	82.5	25.5

సోర్స్ : ఎన్ఎస్ఎస్ఓ

పరిశ్రమల వ్యర్థాల వలన, నగరాల మురికి నీటి వలన, వర్షాభావం వలన భూగర్భనీరు అనేక ప్రాంతాలలో త్రాగడానికి పనికిరాకుండా పోతున్నది. అనేక రాష్ట్రాల్లో నీటిలో ఫ్లోరైడు శాతం ఎక్కువై గ్రామీణప్రజల జీవితాలు చిన్నాభిన్నమవుతున్నవి. మన రాష్ట్రంలో నల్గొండ జిల్లాలోని 112.2గ్రామాలు ఈ ఫ్లోరైడు సమస్యతో బాధపడుతున్నాయి. వెన్నెముకను, కీళ్ళను, యితర అవయవాల పెరుగుదలను అరికట్టే 'స్కెలిటల్ ఫ్లోరోసిస్' అనే ఈ వ్యాధి నల్గొండ జిల్లాలో భయంకర రూపం దాల్చుతున్నది.

పట్టిక 1లోని ఆఖరు వరుసను గమనించితే పారిశుద్ధ్యం అవసరాలకు లెట్రిన్ వాడని కుటుంబాల శాతం తెలుస్తుంది. 80శాతం పైగా గ్రామీణ కుటుంబాలు, 25శాతం పట్టణ కుటుంబాలు తమ విసర్జనాలకు లెట్రిన్‌ని వాడడం లేదు. అంటే బహిర్గత ప్రదేశాలలోనే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. ఇలా చేసేవారు పట్టణాలలో పేదవారు మాత్రమే. ముఖ్యంగా యిల్లు లేనివారు, చిన్న గుడిసెలలో వుంటూ పారిశుద్ధ్య సౌకర్యం లేనివారు. బాక్టీరియా, వైరస్, దోమలు, దుర్వాసన మొదలగు కారణాల వలన అలాంటి ప్రాంతాలలో ప్రజారోగ్యం అధ్వాన్నంగా తయారై రోగాలు పెరుగుతున్నాయి. విసర్జనాలకు లెట్రిన్‌లను వాడడం ద్వారా డయేరియా (విరేచనాల) వ్యాధిని 40శాతం తగ్గించవచ్చునని ఒక అధ్యయనంలో తేలింది. గ్రామీణ ప్రాంతాల విషయానికొస్తే లెట్రిన్ వాడని వాళ్ళందరూ పేదవాళ్ళు కాదు. అక్కడ మధ్యతరగతివారు, స్థిరంగా ఆదాయం వున్నవాళ్ళు, అగ్రకులాల వాళ్ళు కూడా లెట్రిన్ వాడని శాతం ఎక్కువగా వుంటున్నది. ఎందుకిలా జరుగుతున్నది? దీనికి కూడా ప్రభుత్వాలనే నిందించే వారు చాలామంది ఉన్నారు.

భారత ఉపఖండంలోని ప్రజలలో స్వభావసిద్ధంగా తమ ఆరోగ్యం, ప్రజారోగ్యం, పరిసరాల పరిశుభ్రతలపై చాలా అజ్ఞానం, నిర్లక్ష్యం వున్నట్లు ఒక దశలో మహాత్మాగాంధీ చాలా క్షోభకు గురవుతాడు. పెంటకుప్పల మధ్య నుండి గ్రామాలలోకి వెళ్ళాల్సి వస్తుందని, అనేకచోట్ల పెంటకుప్పలు, పేడ, యిల్లు ఒకే చోట వుంటున్నాయని ఆయన వాపోతాడు. ఈ విషయంలో ఆఫ్రికాలో వున్న తెల్లవాళ్ళని (ఐరోపావాళ్ళు) అయిష్టంగానయినా ఆయన అభినందించాడు. తాము వున్న ప్రాంతాలలో పారిశుద్ధ్యం శుభ్రతపై వారినుంచి నేర్చుకోవడానికి జంకకూడదని ఆయనంటాడు.

తాగునీరు, పారిశుద్ధ్యం గురించిన వివరాలను 15 పెద్ద రాష్ట్రాలకు పట్టిక 2లో చూడవచ్చు. దేశంలో వున్న 35రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని మొత్తం జనాభాలో ఈ 15 రాష్ట్రాలు 90శాతం కలిగి వున్నాయి. అస్సాం, బీహార్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలోని గ్రామాలలో కుళాయి ద్వారా నీటి సరఫరా ప్రధానంగా పొందే కుటుంబాలు 10శాతం కంటే తక్కువగానే వున్నాయి. వీటిలో బోరుబావి, చేతిపంపులపై ఆధారం ఎక్కువగా ఉంటున్నది. పట్టణాలలో 50శాతం కంటే తక్కువ కుటుంబాలకు మాత్రమే కుళాయి ద్వారా నీరు లభిస్తున్న రాష్ట్రాలు – అస్సాం, బీహార్, కేరళ, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్‌లు. పశ్చిమబెంగాల్‌లో 56శాతం కుటుంబాలకు మాత్రమే పట్టణాలలో కుళాయి ద్వారా త్రాగునీరు లభిస్తున్నది.

పారిశుధ్యానికి వస్తే జాతీయ సగటు కంటే ఎక్కువశాతం గ్రామీణ కుటుంబాలు లెట్రిన్ వాడని రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌తో సహా చాలా వున్నాయి. అలాగే పట్టణ ప్రాంతాలలో కూడాను అభివృద్ధి చెందిన రాష్ట్రాలుగా చెప్పబడుతున్న గుజరాత్, హర్యానా, పంజాబు, మహారాష్ట్ర, తమిళనాడులలో కూడా పారిశుధ్య అవగాహన, వసతులు అధ్వాన్నంగానే వున్నాయి. పట్టిక2 లోని గణాంకాలను విశ్లేషించినప్పుడు కేరళ రాష్ట్రం గురించి ఒక విషయం స్పష్టం చేయాలి. కుళాయి ద్వారా నీటి సరఫరా జరుగుతున్న కుటుంబాల శాతం చాలా తక్కువగా వున్నాయి. కాబట్టి వెనుకబడిన రాష్ట్రాలలో సరిచేయరాదు. ఏ యితర రాష్ట్రం కంటే అతి తక్కువ శాతం కుటుంబాలు కేరళలో భూగర్భజలాల మీద (బోరుబావి, చేతి పంపు) ఆధారపడివున్నాయి. ఈ రాష్ట్రంలో ఎక్కువశాతం కుటుంబాలు తమ యిళ్ళలోని, పరిసరాలలోని బావుల (ఓపెన్ వెల్స్) మీద ప్రధానంగా ఆధారపడివున్నాయి. ఆరోగ్యం, విద్య ప్రధానంగా గల మానవాభివృద్ధిలో కేరళ దేశంలోనే ప్రథమంగా వున్నదని ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి.

ఈ దేశంలో ప్రజారోగ్య సమస్యలు తీవ్రమవుతాయనడంలో సందేహం లేదు. ఈ సర్వే నాటికి (జనవరి–జూన్ 1998) ముందు అయిదు సంవత్సరాలలో (1993లో జరిగిన సర్వే తర్వాత) దోమల సమస్య పెరిగినట్లు మెజారిటీ కుటుంబాలు (63శాతం గ్రామీణ, 64శాతం పట్టణ) తెలిపాయి. అలాగే ఈగల సమస్య కూడా పెరిగినట్లు 48శాతం గ్రామీణ, 42శాతం పట్టణ కుటుంబాలు తెలిపాయి.

ముగింపు:

తరుగుతున్న నీటి వనరులు, పెరుగుతున్న నీటి అవసరాలతో పాటు తాగునీటి పట్ల, ప్రజారోగ్యం పట్ల ప్రజలలో చైతన్యం పెరగాలి. ఈ బూర్జువా వ్యవస్థలో యివన్నీ మామూలే అనడం సమస్యను దాటవేయడం, ప్రజల బాధ్యతను కావాలనే నిర్లక్ష్యం చేయడం అవుతుంది. ప్రభుత్వాల ద్వారా ఎన్నో పథకాలు అమలవుతున్నాయి. స్థానిక నాయకత్వానికి, అధికార యంత్రాంగానికి వున్న చిత్తశుద్ధిని బట్టి అవి ప్రజలకు చేరువవుతున్నాయి. లేదంటే అవినీతి ప్రవాహంలో కొట్టుకుపోతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చి తమ ప్రాబల్యం వున్న గ్రామాలలో ఆర్థిక స్థోమత వున్న వారిని లెట్రిన్ సదుపాయాలు కల్పించుకొని తమ మరియు ప్రజారోగ్యాన్ని కాపాడుకోవడంలో ప్రధానపాత్ర వహించేటట్లు చేయగలిగితే ఎన్నో సమస్యలు పరిష్కారమవుతాయి. దురదృష్టవశాత్తూ మన దేశంలోని రాజకీయ పార్టీలకు, వామపక్షాలతో సహా, ప్రతి విషయంలోను నెగటివ్ (ప్రతికూల) అజెండాతోనే ప్రజలలోకి వెళ్ళే సంస్కృతి అలవాటు పడింది. ○

ఆరోగ్య కేంద్రాలకు అనారోగ్యం

*(అన్ని కేబుల్ టివి ఛానళ్ల ద్వారా ప్రభుత్వం సాధించిన విజయాల గురించి ముఖ్యమంత్రి డిసెంబరు నెలాఖరు **10**రోజుల్లో అభివృద్ధి నివేదికలు ప్రజల ముందుంచారు. పుంఖానుపుంఖాలుగా గణాంకాలను కుప్పించారు. లక్షలు, కోట్ల రూపాయలు వెచ్చించినట్లు చెప్పుకొన్నారు. ఈ లెక్కలకు, వాస్తవాలకు పొంతన లేదని పాఠకులు ఈ పాటికే గ్రహించివుంటారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ఈ ప్రత్యేక సంచికలో అనేక వ్యాసాలు పరిశోధనల స్థాయిలో వున్నాయి. గణాంకాలను బేరీజు వేసి, విశ్లేషించి అభిప్రాయ ప్రకటనలు చేశారు. ఈ వ్యాసంలో మాత్రం అట్టడుగున వున్న గ్రామాలకు వెళ్లి అక్కడి స్థితిగతులను వివరించే ఒక రిపోర్టును ప్రజాశక్తి జూలై **21**న ప్రచురించింది. దానిని యధాతథంగా ప్రచురిస్తున్నాం. అలాగే రంగారెడ్డి జిల్లా రిపోర్టును కూడా ప్రచురిస్తున్నాం. ముఖ్యమంత్రి చెప్పే దానికి, గ్రామాల్లో ఉన్న పరిస్థితికి ఉన్న అంతరాన్ని ఈ రిపోర్టులు చెప్పకనే చెబుతాయి...*

– సం.)

ఆందోళనగా ఆసుపత్రికెళ్లిన రోగులకు 'డాక్టరు లేర'ని సమాధానం. ఒకవేళ డాక్టరున్నా మందులు లేవని మరో కబురు. విశాఖ ఏజెన్సీ ప్రాంతాల్లోనైతే 16వేల మందికి ఒక వైద్యుడు. అన్నీ అరకొరగా ఉన్నచోట మంచానికి ఇద్దరు ముగ్గురు రోగులు సర్దుకోవాలి. ప్రభుత్వం నియమించని డాక్టరు కోసం ఎదురుచూసే రోగులు.. మందులు బయట కొనడానికి చేతిలో డబ్బులు లేక భోరున విలపిస్తున్న దృశ్యాలు...ఆరోగ్య కల్పన నుండి తప్పుకుంటున్న ప్రభుత్వం రోగులను కార్పొరేట్ వైద్య సంస్థలకు అప్పజెబుతోంది. దీంతో వైద్యం పేదలకు అందక రాష్ట్రంలో నేడీ అనారోగ్య పరిస్థితులు నెలకొన్నాయి. పలు జిల్లా కేంద్ర ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సిబ్బంది, మందుల కొరతపై ప్రజాశక్తి పరిశీలన ఇది.

వ్యాధుల నివారణకు ఎన్నో చర్యలు చేపడుతున్నట్లు చెబుతున్న ప్రభుత్వం అసలు వాటిని పట్టించుకోవడం లేదని పలు జిల్లాల వివరాలు తెలియజేస్తున్నాయి. అన్ని జిల్లాల్లోనూ సిబ్బంది కొరత వెన్నాడుతోంది. అనంతపురం జిల్లాలో 68 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా 39మంది డాక్టర్లు తక్కువగా ఉన్నారు. 25 పురుష ఆరోగ్య కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 1991 నాటి జనాభా లెక్కల ఆధారంగానే మందుల సరఫరా ఉంది. మూడు నెలలకొకసారి మందులకు విడుదల చేసే నిధులు నెలరోజుల వరకు కూడా చాలడం లేదు. దగ్గు, జ్వరాలతో వచ్చే రోగులకు దగ్గు తగ్గించే మందులు, పారాసిటమాల్ వంటి మందులు లేవని సిబ్బంది చెబుతున్నారు. కంచుకాగడా పెట్టి వెదికినా కుక్కకాటు, పాముకాట్లకు మందు దొరికే ప్రశ్నలేదు. కడపలో 54మంది ఆరోగ్య సిబ్బందికిగాను 17ఖాళీలున్నాయి. కడప జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పారిశుధ్యం పనులను సులభ్ సంస్థకు ఇచ్చారు. వీరు వార్డులను తప్పితే బయట, చుట్టూ శుభ్రతను పట్టించుకోరు. దీంతో ఆసుపత్రి పరిసరాలు అనారోగ్యానికి నిలయాలుగా ఉన్నాయి. మందుల కొరతే లేదని అధికారులు చెబుతుండగా మందుల చీటీలతో రోగులు బిక్కుబిక్కుమంటూ కనిపిస్తున్నారు. కర్నూలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 168పోస్టులకు గాను 24డాక్టర్ల పోస్టులు భర్తీ కాలేదు. 60 పురుష, 20 మహిళా పారామెడికల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అత్యవసర మందులు కాదుకదా సాధారణ జ్వరం, తలనొప్పి వంటి వాటికి కూడా సిబ్బంది వెతకాల్సిన పరిస్థితి నెలకొంది. తెలంగాణా జిల్లాల్లో సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 137మంది ప్రభుత్వ డాక్టర్లకు గాను 27 పోస్టులను భర్తీ చేయలేదు. 45 ఎఎన్ఎం పోస్టులు, 145 ల్యాబ్‌టెక్నీషియన్లు, 108 హెల్త్ అసిస్టెంట్ల పోస్టులు భర్తీ కాలేదు. కరీంనగర్ జిల్లాలోని రెండు ప్రత్యేక ఆసుపత్రులు, 63ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 23 మంది డాక్టర్ల కొరత ఉంది. పారామెడికల్ విభాగంలో 120మంది తక్కువగా ఉన్నారు. మందుల సరఫరా అరకొరగా ఉన్నట్లు పరిశీలనలో వెల్లడైంది. నిజామాబాద్ జిల్లా కేంద్రాసుపత్రిలో రెండు డిప్యూటీ సివిల్ సర్జన్లు, సివిల్ సర్జన్లు నలుగురు, నర్సుల ఖాళీలు నాలుగు, ఎఎన్ఎం ఒకరు లేరు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 20 మెడికల్ ఆఫీసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇతర విభాగాలలో 112 మంది సిబ్బంది కొరత ఉంది. అరకొర సేవలున్న ఈ ఆసుపత్రిలో యూజర్‌ఛార్జీల మోత భారీగా ఉంది. మహబూబ్‌నగర్‌లో 250 మంచాలపై 539 రోగులు చికిత్స పొందుతున్నారు. రంగారెడ్డి జిల్లాలోని 37 రెవెన్యూ మండలాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గాను 20 ఆసుపత్రులలో మందుల కొరత ఉంది. డిఎం అండ్ హెచ్ఓ-మాత్రం మందుల కొరత లేదని చెప్పారు. శంకర్‌పల్లి, తాండూరు, వికారాబాద్, ఇబ్రహీంపట్నం, యాచారం తదితర మండలాలలో మందుల కొరత ఉందని పరిశీలనలో వెల్లడైంది. మెదక్‌లో 119 పారామెడికల్ సిబ్బంది భర్తీకి రాతపరీక్ష నిర్వహించినా కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో వాటి భర్తీ నిలిచిపోయింది. 86మంది డాక్టర్లకు 14పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖమ్మం ఆసుపత్రిలో ఆరుగురు డాక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. లక్షన్నర బడ్జెట్‌తో మూడు నెలలకు సరిపడా తెచ్చిన మందులు నెలకే అయిపోతున్నాయని అధికారులు చెబుతున్నారు. అసుపత్రిలోని 250బెడ్‌లలో 362మంది సర్దుకుని ఉన్నారు. వరంగల్ జిల్లాలో 78 డాక్టర్ పోస్టులుండగా ఆరుస్థానాలు ఖాళీలున్నాయి. ఇక్కడ పిజి విద్యార్థులను ఉపయోగిస్తున్నారు. 29మంది పారామెడికల్ సిబ్బంది తక్కువగా ఉన్నారు. 197 మంది ఆరోగ్య కార్యకర్తలను ఇటీవల కాంట్రాక్టు పద్ధతిపై తీసుకున్నారు. ఇక వ్యాధుల నివారణకు ఇక్కడ సరఫరా చేసిన అత్యుత్తమ మందుల్లో క్లోరిన్ బిళ్లలు అతి ముఖ్యమైనవి.

విశాఖ, విజయనగరం జిల్లాల్లో సిబ్బంది కొరత దారుణంగా ఉంది. ఏజెన్సీలలో ఈ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వైద్యం కొరతతో ఏడాది కాలంగా నయం కాని రోగాలతో తల్లడిల్లుతున్న రోగులను విజయనగరం ఆసుపత్రిలో పరిశీలించగా. కాంట్రాక్టు వైద్యులతో అందుతున్న అరకొర సేవలే ఇక్కడి వారికి అందుబాటులో ఉంటున్నాయి. రోగాలకు మించి రక్తహీనత, పౌష్టికాహార లోపం రోగులను పట్టి పీడిస్తున్నాయని వైద్యాధికారులంటున్నారు. విశాఖలో అన్ని విభాగాలలో కలిపి 30పోస్టులు ఖాళీగా ఉండగా 150మంది పారామెడికల్ సిబ్బందిని కాంట్రాక్టుపై నియమించారు. ఏజెన్సీలోని గ్రామాలకు రవాణా ఇతరత్రా సౌకర్యాలు తక్కువ కావడం, సిబ్బంది, మందుల కొరత తదితర కారణాల వల్ల విషజ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. ప్రకాశం జిల్లా ఒంగోలులోని జిల్లా ఆసుపత్రి, మాతా శిశు వైద్యశాల, చీరాల, మార్కాపురం, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, కనిగిరి, గిద్దలూరు, కంభం పిల్లల ఆరోగ్య కేంద్రాలలో 108 మంది వైద్యులుండాల్సి ఉండగా 81మంది మాత్రమే ఉన్నారు. 27పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గుంటూరు జిల్లాలోని 57 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు గాను 10 కేంద్రాలలో డాక్టర్లే లేరు. దీంతో ఉన్న డాక్టర్లనే డిప్యూటేషన్ మీద పంపుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా ప్రభుత్వాసుపత్రులలోనూ మందుల కొరత, సిబ్బంది కుదింపు రోగులపాలిట శాపాలుగా పరిణమించాయి. 'అత్యయిక పరిస్థితి విధించి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం కష్టం...ఆహారం, పరిసరాలు, వైద్య సదుపాయాలు ఒకచైన్ రియాక్షన్‌లాగా సాగాల్సిన ప్రక్రియలు హడావుడితో ఆరోగ్యం బాగుపడదు' ప్రభుత్వ హంగామాపై స్పందించిన కెజిహెచ్ వైద్యులు వ్యాఖ్యానించారు.

గోడు వినే వారేరీ...?

చాలామంది గిరిజనులది ఇదే ప్రశ్న. ఈ నెల 16న విశాఖ జిల్లా హుకుంపేట మండలం రాపగ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరానికి వచ్చిన వారు అడిగిన ప్రశ్న. గిరిజనులు మందులు వేసుకోరనీ, మూఢనమ్మకాలతో వనర్లు, తాయెత్తులతో సరిపెట్టుకుంటారనీ ప్రచారంలో వున్న విషయాన్ని ప్రస్తావిస్తే వారిచ్చిన సమాధానం ఇది. ఈ వైద్య శిబిరానికి వచ్చిన 65ఏళ్ల ఉప్పల బాలమ్మను ప్రచారంపై అడిగితే నిర్వికారంగా చూసింది. "మందులెందుకు పారేస్తాను బాబూ... కళ్లు కనిపించకున్నా అంత దూరం నుండి ఎందుకొచ్చాను.. రోగంతో కునారిల్లి చావాలని నాకెందుకుంటుందని" ప్రశ్నించింది. మరి ఇదివరకు మందులు వేసుకోలేదా అంటే "మా ఊరు వచ్చిందెవరు? మందులిచ్చిందెవరని?" ప్రశ్నించింది. సమాధానం ప్రభుత్వమే చెప్పాలి.

ప్రభుత్వం ఏం చూస్తోంది? చేస్తోంది?

విశాఖ ఏజెన్సీలోని ప్రతి పిహెచ్‌సిలోనూ ఇద్దరు వైద్యులు వున్నారు. అందులో ఒకరు నెలకు 20 రోజులు గ్రామాలలో పర్యటించాలి. వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలి. మరొకరు ఆసుపత్రికి వచ్చే రోగులను చూడాలి. ఏ డాక్టరు సెలవుపెట్టినా ఇబ్బందే. గిరిజన గ్రామాలు అక్కడొకటి ఇక్కడొకటిగా వుంటాయి. దీంతో షెడ్యూలు ప్రకారం ఉన్న ఒక్కరూ పర్యటించడం తలకు మించిన భారంగా వుంది. ఇక్కడ అన్ని పిహెచ్‌సిల పరిధిలో 189 సబ్ సెంటర్లున్నాయి. వాటిలో 120సబ్ సెంటర్లకు అసలు భవనాలే లేవు. ఉన్న వాటిలో కొన్ని శిథిలావస్థలో ఉన్నాయి. 27 హెల్త్ సూపర్‌వైజర్ల పోస్టులు ఖాళీగా వున్నాయి. ఒక్కొక్క కేంద్రంలో ఒక ల్యాబ్ టెక్నీషియన్ వున్నారు. వీరు 60రక్తపు నమూనాలను పరిశీలించగలరు. దాదాపుగా ఇక్కడి ఆసుపత్రులకు 300 దాకా రక్తపు పూతలొస్తాయి. సిబ్బంది లేకపోవడంతో దాదాపు 200పైగా ఎటువంటి పరీక్షకు నోచుకోవు. దీంతో జ్వరపడీడితులు ఒక్కడోసుతోనే సరిపెట్టుకోవాలి. విశాఖలోని మినుములూరు ఆరోగ్యకేంద్రానికి మందుల కొనుగోలుకు లక్ష రూపాయలు కేటాయించారు. ఇక్కడ జనాభా 50వేలు. అంటే ఒక్కొక్కరి వైద్యునికి ప్రభుత్వం కేటాయించిన మొత్తం అక్షరాలా రెండు రూపాయలు!

16వేల మందికి ఒక వైద్యుడు!

విశాఖ ఏజెన్సీ ప్రాంతం విస్తీర్ణం 6,22,360 హెక్టార్లు. ఇది జిల్లాలో సగం కన్నా ఎక్కువ. ఖచ్చితంగా చెప్పాలంటే 55.72శాతం. కానీ, ఈ ప్రాంతం మొత్తానికి లభించే వైద్య సేవలు జిల్లాలోని ఏ పట్టణంతో పోల్చి చూసినా తక్కువే! ఉదాహరణకు నర్సీపట్నంలో ఉండే ప్రభుత్వ ప్రైవేట్ డాక్టర్ల సంఖ్య కన్నా ఏజెన్సీ మొత్తంలో ఉండే డాక్టర్ల సంఖ్య తక్కువ. ఈ ప్రాంతంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇదొక ఉదాహరణ. ఏజెన్సీలోని 11మండలాల పరిధిలో 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరు మొబైల్ మెడికల్ యూనిట్లు, ఎనిమిది ప్రభుత్వ డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటన్నిటిలో 36మంది వైద్యులు ఉన్నారు. ఇందులో 17మంది కాంట్రాక్టు పద్ధతిపై నియమితులయ్యారు. ఇంకా 13 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విశాఖ ఏజెన్సీ జనాభా 5లక్షల 80వేలు. అంటే 16వేల మందికి ఒక వైద్యుడు ఉన్నట్టు లెక్క. 13 పోస్టులను భర్తీ చేస్తే ఈ నిష్పత్తి 1:12వేలు అవుతుంది. ఒక వైద్యుడు ఇంతమందికి ఆరోగ్యం చేకూర్చడం సాధ్యమయ్యే పనేనా?

ఆ ఇద్దరూ ఎవ్వరూ లేని అనాథలు

సుల్తాన్ అనే ఏడేళ్ల బాలుడు బక్కచిక్కి మంచంపై పడి వైద్యం కోసం రోదిస్తున్నాడు. అతనికి పదేళ్ల అన్నయ్య. పేరు సంజయ్. తమ్ముడి చికిత్స కోసం నానా తాపత్రయం పడుతున్నాడు. చిన్నప్పుడే తండ్రిని కోల్పోయిన ఆ చిన్నారులు, కొంతకాలం తర్వాత తల్లి కూడా వారికి దూరం అయింది. దిక్కుతోచక నాలుగేళ్ల క్రితం ఖర్గపూర్ నుంచి విజయనగరం జిల్లా గజపతినగరం వచ్చి ఒక హోటల్‌లో ఇద్దరూ కలిసి పనిచేసేవారు. రోజుకి చెరొక పదిహేనురూపాయలు సంపాదించుకుని జీవనం గడిపేవారు. అకస్మాత్తుగా తమ్ముడు సుల్తాన్ ఆరోగ్యం క్షీణించడంతో జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రికి వచ్చి వారం రోజులైంది. ఎనీమియా అని డాక్టర్లు నిర్ధారించారు. లేచి కూర్చొనే ఓపిక కూడా సుల్తాన్‌కు లేదు. తక్షణమే రక్తం ఎక్కించాలని డాక్టర్లు చెప్పారు. అంతేగాక విశాఖ కెజిహెచ్‌కి వెళ్లిపోవాలని అనడంతో ఏం చేయాలో తోచక ఆందోళన చెందుతున్నాడు. తినడానికి కూడా చేతిలో చిల్లిగవ్వ లేని స్థితిలో కెజిహెచ్ వెళ్లడం ఎలాగని చిన్నారి సంజయ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రస్తుతం ఆసుపత్రి వార్డులోని రోగులకు చెందిన కొంతమంది దయదలచి వారికి కాస్త తిండి పెడుతున్నారు.

ఆరోగ్యం గురించి అంధకారంలో యువత :

యుక్తవయస్సు బాలబాలికల్లో ఆరోగ్యం గురించిన అవగాహన గురించి హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న అకాడమీ ఫర్ నర్సింగ్ స్టడీస్ అండ్ వుమెన్స్ ఎంపవర్‌మెంట్ రిసెర్చి స్టడీస్ సంస్థ రంగారెడ్డి జిల్లాలో 30 గ్రామాల్లో యుక్తవయస్సు వచ్చిన 926 బాలురు, 928 మంది బాలికలను కలిసి ఆరోగ్యం గురించి వారి అవగాహన, ఆచరణ సర్వే జరిగింది.

అధ్యయనం చేసిన బాలికల కనీస వయస్సు 14 సంవత్సరాలు, బాలుర వయస్సు 17సంవత్సరాలు. అసలు పాఠశాలకే వెళ్లని బాలురకన్నా మూడురెట్లు ఎక్కువమంది బాలికలు పాఠశాలకు పోనేపోలేదు. పదవ తరగతి తర్వాత చదువు కొనసాగించిన బాలురు 13.7శాతం వుంటే, బాలికలు కేవలం 1.9శాతం మాత్రమే. వీరిలో సగం మంది పూర్తికాలం, లేదా కొంత కాలం పనిచేస్తున్నారు. కూలీలుగా పనిచేసే బాలికలు 11.85శాతం అయితే, బాలుర శాతం 6.80. వీరిలో వివాహితుల్లో బాలికలే ఎక్కువమంది వున్నారు. వివాహితులైన బాలికలమీద కట్టడి ఎక్కువగా ఉంది. వీరు ఇంటికే పరిమితమవుతారు. వయస్సు దృష్ట్యా వారు యుక్త వయస్కులే. కాని వారిలో భార్యలు, తల్లులు అయినవారు కూడా వున్నారు. వీరిని కొన్ని సందర్భాల్లో కలుసుకోవటం కూడా కష్టమైంది. 16ఏళ్ల వయస్సు గల బాలికలను స్త్రీలుగా భావిస్తే, అదే వయస్సు గల బాలురను పిల్లలుగా భావిస్తారు.

వారి అవగాహన, జ్ఞానం ఎంత అత్యల్పంగా వుందో ఈ సర్వే ఫలితాలు తెలియచేస్తున్నాయి.

- ఎయిడ్స్ అనే వ్యాధి సెక్స్‌లో పాల్గొనటం వల్ల వస్తుందని 41.53శాతం మంది బాలబాలికలకు మాత్రమే తెలుసు.
- కుటుంబ సంక్షేమ పద్ధతుల గురించి వారిలో చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. కేవలం ఎనిమిది మంది బాలురు, 13బాలికల(వివాహితులు)కు మాత్రమే కుటుంబ సంక్షేమ పద్ధతులు గురించి తెలుసు.
- పుట్టిన బిడ్డ ఎంత బరువుండాలో 28.58శాతం మందికి మాత్రమే తెలుసు.
- అప్పుడే పుట్టిన బిడ్డకు స్థన్యం ఎప్పుడు ప్రారంభించాలో సుమారు మూడో వంతు మందికి మాత్రమే సుమారుగా తెలుసు.

అలాగే ఇతర ఆహారం ఇవ్వటం ఎప్పుడు ప్రారంభించాలో అనే విషయంలో కూడా వారికి తెలిసింది తక్కువ.

- కొన్ని జబ్బులు రాకుండా వేసే టీకాలు, ఇతర సూదిమందుల గురించి చాలా తక్కువ తెలుసు. అయితే పోలియోవ్యాధి గురించి అందుకు ఇవ్వవల్సిన మందు గురించి ఎక్కువ మందికి తెలుసు.
- బాలబాలికల్లో మూడోవంతుమంది ప్రసూతి ఇంట్లోనే జరగాలని అన్నారు. రెండు వంతులు ఆసుపత్రిలోనే జరగాలని చెప్పారు. ఇంటివద్దనే ప్రసూతి జరగాలని అన్నవారిలో 77శాతం మంది మంత్రసానే చెయ్యాలని అన్నారు.
- హెల్త్ వర్కర్లు గ్రామాలకు రావటం చాలా అరుదని అందరూ అన్నారు. నాలుగోవంతు మంది మాత్రం నెలకొకసారి వస్తారని చెప్పారు.
- గత ఆరునెలల్లో ఒక్కసారే ఆరోగ్య కేంద్రానికి వెళ్లినవారు 12శాతం మంది మాత్రమే. 3.82శాతం మంది మాత్రమే గత నెల కాలంలో ఈ కేంద్రాల సేవలను ఉపయోగించుకున్నారు.
- బాలికలెవ్వరూ సానిటరీ నాప్కిన్స్ వాడలేదు. పాతగుడ్డలు, పీలికలు ఉపయోగిస్తున్నారు.
- 208బాలికల్లో 13.6శాతం మంది మాత్రమే కుటుంబ సంక్షేమ పద్ధతులను పాటిస్తున్నారు.
- చాలా తక్కువమంది బాలికలు డ్వాక్రా గ్రూపుల్లో సభ్యురాళ్లుగా వున్నారు.
- ప్రసూతి సమయంలో వచ్చే సమస్యలను గురించి, తెలుసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, ట్రీట్‌మెంట్ గురించిగాని వారికి తెలియదు.

హైదరాబాద్ నగర సరిహద్దుల్లో వున్న రంగారెడ్డి జిల్లాలో ఆరోగ్య, వైద్య పరిస్థితులివి. రాజధాని నగరానికి దూరంగా వున్న జిల్లాల్లో పరిస్థితులేమిటో వూహించుకోవచ్చు.

○

అంగడిలో సరుకైన విద్య

-డా॥ ఎమ్. గంగాధర్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,
(డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2005 నాటికి రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యతను సాధిస్తానని చెపుతున్నారు. బడికి పోయే వయస్సులో ఉన్న బాలబాలికలు రాష్ట్రంలో 3,64,500 మంది మాత్రమే బడి బయట ఉన్నారని, బాల కార్మిక వ్యవస్థను రూపుమాపి, ఈ బాలబాలికల నందరిని 2005 నాటికి బడిలో చేర్పిస్తానని ప్రభుత్వం చెపుతున్నది. 8-12-2003నాడు రాష్ట్రప్రభుత్వం హైదరాబాద్‌లో ఒక విద్యా సదస్సును జరిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ సదస్సులో మాట్లాడుతూ తమ ప్రభుత్వానికి 2005నాటికి సంపూర్ణ అక్షరాస్యతను సాధించే లక్ష్యం మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్‌ను విజ్ఞాన సమాజంగా తీర్చిదిద్దాలని ఉన్నదని అన్నారు. ఈ మాటలన్నీ వింటూ ఉంటే గత అయిదారు దశాబ్దాలుగా మనం సాధించలేని అద్భుత మేదో సాధ్యమవుతున్నట్లుగా అనిపిస్తుంది. కాని అలాంటి అద్భుతమేదో నిజంగానే జరుగుతున్నదా? వాస్తవ పరిస్థితులేమిటి? మనం ఎక్కడ ఉన్నాం? మన కృషి ఎటువంటిది? ప్రభుత్వం చేస్తున్న ప్రచార సందడి నుండి బయటకు వచ్చి, మనం ఈ ప్రశ్నల గురించి ఆలోచించాలి.

సమాజాన్ని నియంత్రించడంలో విద్యారంగం ఒక కీలకమైన పాత్రను నిర్వర్తిస్తుంది. భావజాలాన్ని, ఉత్పత్తిచేయడంలోనూ, దాన్ని ప్రచారం చేయడంలోనూ విద్యారంగానికి ఉన్న వెసులుబాటు కారణంగా ఆ రంగం మీద పాలకవర్గాలు తమ పట్టును ఎల్లప్పుడూ నిలుపుకుంటూనే వచ్చాయి. ఆంగ్లేయులు మన దేశంలో 1835లో ప్రవేశపెట్టిన మెకాలే విద్యా విధానపు లక్ష్యం భారతీయుల్లో తమకు కావలసిన ఆలోచనా విధానాన్ని తీసుకురావడమేనని చెప్పినప్పుడు ఇది మనకు స్పష్టంగానే అర్థమవుతుంది. బ్రిటిష్ వలసవాదులు వలసవాద భావజాలాన్ని ఉత్పత్తి చేయడానికే మెకాలే విద్యావిధానాన్ని ప్రవేశపట్టినప్పటికి, ఆ విద్యావిధానం బ్రిటిష్ వలసపాలనకు దేశంలో ఒక విధేయవర్గాన్ని తయారుచేయడంతో పాటు, తదనంతరకాలంలో దేశంలో తలెత్తిన జాతీయోద్యామానికి దన్నుగా నిలబడిన ఆధునిక జాతీయ భావజాలాన్ని కూడా అందించింది. అయితే అనేక సామాజికార్ధిక కారణాల రీతిన అది ఒక స్వతంత్రమైన, సమగ్రమైన భావజాలంగా మనదేశంలో ఎదగలేకపోయింది. పెట్టుబడిదారీ విధానపు పురోగమన క్రమంలో గుత్త పెట్టుబడి ప్రవేశించి, సామ్రాజ్యవాదం ఆవిర్భవించిన తరువాత దేశంలో సామ్రాజ్యవాద భూస్వామ్య భావజాలాలు చెట్టాపట్టా లేసుకుని విహారం చేయడం ప్రారంభించాయి. గడచిన దశాబ్దాలలో విద్యారంగంలో వచ్చిన మార్పులెన్ని ఉన్నా ఈ రెండు భావజాలాల సాంకర్యం మాత్రం కొనసాగుతూనే ఉంది. పెట్టుబడిదారీ ప్రపంచానికి, సోషలిస్టు ప్రపంచానికి మధ్య ప్రచ్ఛన్న యుద్ధం అంతరించిపోయిన తరువాత, సోషలిస్టు దేశాలు కుప్పకూలిన తరువాత సామ్రాజ్యవాద దేశాలు, వాటి బహుళజాతి సంస్థలు ప్రపంచాన్నంతా పెట్టుబడుల రూపంలో, వాణిజ్యం రూపంలో పునరాక్రమించుకోవడానికి ప్రపంచీకరణ విధానాన్ని ముందుకు తెచ్చిన తరువాత "మార్కెట్" అత్యున్నతమైన స్థానాన్ని పొందింది. ప్రస్తుతం ఆ మార్కెట్ అవసరాలు, మార్కెట్ విలువలు సమాజాన్ని, విద్యారంగాన్ని శాసించడానికి పూనుకున్నాయి.

ప్రపంచీకరణ యుగంలో విద్యారంగంలో రావలసిన మార్పులకు నూతన విద్యావిధానం శ్రీకారం చుట్టింది. రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 1986లో పార్లమెంటు ఆమోదంతో ఈ నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నాలుగు దశాబ్దాల కాలంలో దేశంలో అమలైన విద్యావిధానాన్ని కేంద్రప్రభుత్వం ఆ సమయంలో విడుదల చేసిన ఒక డాక్యుమెంట్‌లో విమర్శకు గురిచేసింది. సమాజంలో ఎదురవుతున్న సమస్యలను తట్టుకోవడానికి, పరిష్కరించుకోవడానికి తగిన సామర్థ్యాలను ఈ విద్యావిధానం ఇవ్వడంలేదని తప్పు పట్టింది. 21వ శతాబ్దం కొత్త సవాళ్ళను విసురుతుందని, ఆ పరిస్థితికి దీటైన విద్యావిధానం మనకు అవసరమని నూతన విద్యా విధానాన్ని తెచ్చారు. కేంద్రప్రభుత్వం తాను విడుదల చేసిన డాక్యుమెంట్‌ను (చర్చాపత్రాన్ని) దేశమంతా చర్చించాలని చెప్పింది కాని ఆ డాక్యుమెంట్ మీద దేశంలో జరిగిన చర్చను, మేధావుల అభిప్రాయాలను పట్టించుకోకుండా నూతన విద్యావిధానాన్ని పార్లమెంట్ ఆమోదానికి పెట్టింది. కేంద్రప్రభుత్వం ఆ డాక్యుమెంట్‌లో 1985లో పుట్టిన పిల్లలు 21వ శతాబ్దం వచ్చేనాటికి పాఠశాల విద్యను పూర్తి చేసుకుంటారని, అందువలన ఆ శతాబ్దానికి దీటైన పిల్లల్ని తయారుచేసే విధంగా మన విద్యావిధానం ఉండాలని గొప్ప భవిష్యద్దర్శనాన్ని చూపుతున్నట్లుగా చెప్పింది. ఆ 21వ శతాబ్దం రానే వచ్చింది. **విద్య ఖరీదైన వస్తువుగా మారిపోయి అసంఖ్యాకంగా ఉన్న ప్రజానీకానికి అందుబాటులో లేకుండా పోయింది. విద్యారంగంలో సామాజిక శాస్త్రాల అధ్యయనానికి ప్రాధాన్యం తగ్గిపోయింది. సమాచార సాంకేతిక విద్యలకు ప్రాధాన్యం పెరిగింది. మనుషులను మానవీయంగా చూసే సంస్కృతి పోయి, సరుకులుగా, సరుకులను సృష్టించే యంత్రాలుగా, సరుకులను కొనే మార్కెట్‌గా చేసేసంస్కృతి వచ్చింది.** ప్రపంచీకరణ మేధోవలసను పెంచివేసింది. మనదేశం, మన మనుషులు, మన వనరులు ఇవన్నీ మన ప్రజలకే ఉపయోగపడాలనే ఆలోచన పోయింది. ఇంజనీర్లో, డాక్టర్లో, మరొకరో అయి విదేశాలకు వెళ్ళి డాలర్లను సంపాదించడమే ఆదర్శంగా, అభివృద్ధిగా మారిపోయింది. సుమారు ఒక శతాబ్దం పాటు బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా దేశంలో జరిగిన జాతీయోద్యమం ముందుకు తెచ్చిన విలువలన్నీ తలకిందులైనాయి. వలస వ్యతిరేక జాతీయోద్యమం కాలంలో ఆంగ్లేయ ప్రభుత్వం నడుపుతున్న పాఠశాలలను, కళాశాలలను బహిష్కరించి జాతీయ పాఠశాలలను, కళాశాలలను,

విశ్వవిద్యాలయాలను నెలకొల్పుతున్న చరిత్ర మనకు ఉంది. ఇప్పుడు ఇంటర్నేషనల్ స్కూళ్లు, ప్రైవేట్ రంగంలో విదేశీయులకు చెందిన విశ్వవిద్యాలయాలు అభివృద్ధికి చిహ్నాలుగా మారిపోతున్నాయి.

మన విద్యావిధానం మతాతీత లౌకిక విలువలనే ప్రధానంగా కలిగి ఉన్నదిగా ఎప్పుడూ లేకపోయినప్పటికిని, ఒక దశాబ్దకాలంగా మతతత్త్వ భావాల దాడికి విద్యారంగం బాగా గురవుతున్నది. అనేక దశాబ్దాలుగా దేశంలో చాపకింద నీరులాగా వ్యాపించిన హిందూత్వవాద విద్యాసంస్థలు వాటి కనుకూలమైన రాజకీయ వాతావరణం, ప్రభుత్వాలు వచ్చిన తరువాత బాగా వెలుగులోకి, చర్చలోకి వచ్చాయి. విద్యారంగ కాషాయీకరణను కేంద్రప్రభుత్వం ఒక విధానంగానే చేపట్టి సిలబస్‌లో, పాఠ్యపుస్తకాల్లో, కర్రిక్యులమ్‌లో మార్పులను తీసుకువచ్చింది. ఆర్ఎస్ఎస్‌కు చెందిన విద్యాసంస్థ విద్యాభారతి రూపొందించిన పుస్తకాలను ఎన్‌సిఇఆర్‌టి 1996లో సంస్కృతీ జ్ఞానం పేరుమీద మతమూఢత్వాన్ని, మత దురభిమానాన్ని చెపుతున్నాయని విమర్శించింది. కాని ఇప్పుడు ఆ ఎన్‌సిఇఆర్‌టి యే పాఠ్యప్రణాళికలో ఆ మతతత్త్వ వాదాన్ని చొప్పించడానికి పూనుకున్నది. హిందూత్వం మాత్రమే భారతీయ జీవనవిధానమని, హిందూత్వం కానిదేదైనా పరాయిదేనని చెపుతూ ప్రాథమిక స్థాయి నుండి ఉన్నతస్థాయి వరకు భారతీయీకరణ, జాతీయీకరణ, ఆధ్యాత్మీకరణలను ప్రవేశపెట్టడానికి పూనుకున్నది.

ప్రపంచీకరణ యుగంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కొరకు నిర్వహించవలసిన రంగాలను క్రమంగా వదిలించుకుంటూ వస్తున్నాయి. అందులో విద్యారంగం కూడా ఒకటి. ఒకవైపు చూస్తే ప్రభుత్వాలు అక్షరాస్యతను గణనీయంగా పెంచడానికి, సంపూర్ణ అక్షరాస్యతను సాధించడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నట్లుగా ఆపరేషన్ బ్లాక్ బోర్డ్, డిపెప్, సర్వ శిక్షా అభియాన్ వంటి ఎన్నో ప్రణాళికలను అమలు జరుపుతున్నది. ప్రాథమిక విద్య ప్రభుత్వాల బాధ్యత అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. కాని ప్రాథమిక విద్యారంగంలో కూడా ప్రైవేటీకరణ పెరిగిపోతున్నది. ప్రాథమికస్థాయిలో నాణ్యమైన విద్య లభించడానికి అవసరమైన చర్యలన్నింటిని తీసుకోవడం లేదు.

నూతన విద్యావిధానం అమల్లోకి వచ్చిన తరువాత ప్రభుత్వాలు చేపట్టిన అనేక మార్పుల్లో విద్యాకమిటీల నిర్మాణం ముఖ్యమైంది. సెంట్రల్ అడ్వయిజర్ బోర్డ్ ఆన్ ఎడ్యుకేషన్ (కేబ్ కమిటీ) దాదాపు పదేళ్ళ కిందనే విద్యాకమిటీల నిర్మాణాన్ని సిఫారసు చేసింది. స్థానికంగా ప్రజల చొరవ, భాగస్వామ్యం పేరుతో ప్రభుత్వానికి, ప్రభుత్వం ప్రజలకు విద్యనందించడానికి మధ్య ఒక ఏజెన్సీని సృష్టించి పెట్టడం జరిగింది. కేబ్ కమిటీ సిఫారసులే ఆంధ్రప్రదేశ్‌లో కోనేరు రామకృష్ణారావు కమిటీ సిఫారసులుగా వచ్చాయి. ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వచ్చిన ఈ సిఫారసులకు ఉపాధ్యాయ సంఘాల నుండి వ్యతిరేకత రావడంతో ఆ సిఫారసుల అమలు తాత్కాలికంగా ఆగిపోయింది. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా వచ్చిన తరువాత కోనేరు రామకృష్ణారావు కమిటీ పేరులేకుండా స్వల్పమైన మార్పులతో అవే సిఫారసులకు 1998లో పాఠశాల విద్యలో ప్రజల భాగస్వామ్యం పేరుమీద ఒక చట్టాన్ని చేసి విద్యాకమిటీలను తీసుకువచ్చారు. ఉపాధ్యాయులను నియమించడం ద్వారా ప్రాథమిక విద్యను, పాఠశాల విద్యను పటిష్ఠం చేయవలసి ఉండగా, దానికి బదులుగా విద్యా కమిటీలను మధ్యలో ఏజెన్సీలుగా ఉంచి, విద్యావాలంటీర్లను ఆ కమిటీల చేత నియమింపజేసి ప్రాథమిక విద్యారంగాన్ని నడిపించడానికి ప్రభుత్వం పూనుకున్నది. ఈవిధంగా నియమితులైన విద్యావాలంటీర్లు నేరుగా ప్రభుత్వం చేత నియమింపబడిన వారు కాదు. వారికి ఉద్యోగభద్రత లేదు. సేవా నియమాలు లేవు. సమాన పనికి సమాన వేతనమనే సహజన్యాయం వారికి వర్తించదు. ప్రభుత్వం సృష్టించిన ఒక వెట్టిచాకిరీ వ్యవస్థ ఇది. ఇలాంటి అప్రజాస్వామికమైన, అన్యాయమైన విధానాలను అమలుచేయడానికి ప్రభుత్వం విద్యాకమిటీలను వాడుకుంటున్నది.

ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాననే ఆకర్షణీయమైన నినాదంతో చంద్రబాబునాయుడు విజన్ 2020 డాక్యుమెంట్‌లో విద్యారంగం గురించి ఒక అధ్యాయం ఉంది. తాను అనుకున్న అభివృద్ధిని సాధించడానికి వివిధ సామాజిక జీవన రంగాలను, ఉత్పత్తిరంగాలను ప్రైవేటీకరించాలని నిర్ణయించుకున్న ప్రభుత్వం ఏడు ముఖ్యమైన రంగాలను మాత్రం తానే నిర్వహించాలని అనుకున్నది. అందులో ప్రాథమిక విద్య కూడా ఉంది. అయితే విద్యను గురించి ఈ డాక్యుమెంట్‌లో ప్రభుత్వం కనబరిచిన అవగాహనను చూస్తే విద్యను లాభాన్ని ఆర్జించే ఒక సరుకుగా చూసిందని అర్థమవుతుంది. సమాజాన్ని, ప్రకృతిని అర్థం చేసుకుని ఆ రెండింటి మధ్య ఒక మానవీయమైన పద్ధతిలో జీవించడానికి విద్య మనిషికి తోడ్పడాలి. కాని "మార్కెట్ ఆధారిత ఆర్థికవ్యవస్థ నిర్మాణానికి విద్య కీలకమైనది" అని ఆ డాక్యుమెంట్‌లో ప్రభుత్వం అంటున్నది. "విద్యావంతులు పెట్టుబడిని సమర్థవంతంగా ఉపయోగిస్తారు" అని మెచ్చుకుంటుంది. విద్య మనిషికోసమని, సమాజంకోసమని దాని అవగాహన కాదు. మార్కెట్ ఆర్థికవ్యవస్థ కొరకు ఉపయోగపడే విద్య మానవీయ లక్షణాలను కలిగి ఉండలేదు.

అక్షరాస్యతలో ఆంధ్రప్రదేశ్ బాగా వెనుకబడే ఉంది. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో 26వ స్థానాన్ని పొందింది. గ్రామీణ ప్రాంత మహిళలు, ఎస్.సి.లు, ఎస్.టి.లు, బి.సి.లు, మైనారిటీలు విద్యలో వెనుకబడుతున్నారని డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు. ఈవిధమైన వెనుకబాటుతనానికి పేదరికం, పాఠశాలలు పిల్లలకు అందుబాటులో లేకపోవడం, ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి తగినవిధంగా లేకపోవడం, పాఠశాలల్లో వసతి సౌకర్యాల కొరత, ఎన్‌రోల్‌మెంట్ తక్కువగా ఉండడం, డ్రాపవుట్స్ ఎక్కువగా ఉండడం కారణాలని డాక్యుమెంట్‌లో చెప్పిన ప్రభుత్వం యొక్క విధానాలు అందుకు భిన్నంగా ఉండడం విచారించవలసిన విచారం. ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ రీ-కన్‌స్ట్రక్షన్ ప్రోగ్రాంలో 2002నాటికి ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని 1:45గా పెంచుతానని చెప్పిన ప్రభుత్వం తద్విరుద్ధంగా ప్రాథమిక పాఠశాలల్లో ఈ నిష్పత్తిని 1:50గా పెంచింది. ఈ నిష్పత్తి ప్రకారం ఉండవలసిన సంఖ్యలో రెగ్యులర్ ఉపాధ్యాయులతో పాటు విద్యా వాలంటీర్లను కూడా భాగంగా చేసింది. తద్వారా పాఠశాల విద్యలో పారా టీచర్ల వ్యవస్థను సుస్థిరం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. విద్యారంగాన్ని ప్రైవేటీకరిస్తున్న క్రమంలో, ప్రాథమిక విద్యకు సంబంధించిన బాధ్యతలను కూడా క్రమంగా వదిలించుకునే క్రమంలో తరగతి గదిలో ఉపాధ్యాయులకు సహకరించడానికి, ఎన్‌రోల్‌మెంట్‌ను

(తరువాయి 39వ పేజీలో)

ఆంధ్రప్రదేశ్‌లో సేవారంగ అభివృద్ధి

- ఎన్.వేణుగోపాల్

ఒక ఆర్థికవ్యవస్థ అభివృద్ధి చెందిందని చెప్పడానికి, ఆ ఆర్థికవ్యవస్థలో సేవారంగం వాటా ఒక చిహ్నమని, సేవారంగం అభివృద్ధి చెందితే ఆర్థికవ్యవస్థ అభివృద్ధి చెందినట్టేనని ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి, ఎంతోమంది ముఖ్యులైన తెలుగుదేశం నాయకులు ఈ ఎనిమిది సంవత్సరాలలో ఎన్నోసార్లు అన్నారు. అమెరికా, సింగపూర్ ఆర్థికవ్యవస్థల్లాగా ఆంధ్రప్రదేశ్ ఆర్థికవ్యవస్థలో కూడా సేవారంగం వాటా ఇతోధికంగా పెరిగిపోతున్నది అంటే మనం అమెరికాతో, సింగపూర్‌తో సమానం కావడానికి చేరువలో ఉన్నామని పదే పదే ప్రభుత్వ ఆర్థికపత్రాలు ప్రకటిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో సేవారంగం స్థితి ఏమిటో 1995-96 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకూ గడిచిన ఎనిమిది సంవత్సరాలలో సేవారంగం ఎట్లా మారుతూ వచ్చిందో, విజన్ 2020, శ్వేతపత్రాలు వంటి ప్రభుత్వ విధాన పత్రాలలో చేసిన ప్రకటనలు ఎట్లా వాస్తవరూపం ధరించి, ప్రజాజీవనంలో ఏ ప్రభావాలు కలగజేశాయో విశ్లేషించుకోవలసి ఉంది.

ఆంధ్రప్రదేశ్ ఆర్థికవ్యవస్థలో సేవారంగం వాటా 1995-96 నాటికి 49శాతం అని, దాన్ని 2020-21 నాటికి 67శాతానికి పెంచవలసి ఉందని విజన్ 2020 నిర్ధారించింది. సేవారంగంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పర్యాటకరంగం, చిన్నతరహా సేవలు, రవాణా, జ్ఞాన-ఆధారిత సేవలు, విద్య, ఆరోగ్యం అనే ఏడు రంగాలను ప్రత్యేకంగా విడదీసి ప్రగతికారకాలుగా, ప్రత్యేక శ్రద్ధ చూపవలసిన రంగాలుగా ప్రకటించింది. ఈ సేవారంగాలలో వార్షిక ప్రగతిరేటు 1995-2000 మధ్య 7శాతంగా, 2000-05 మధ్య 9.5శాతంగా, మొత్తంగా 1995-2000 మధ్య 11.7శాతంగా ఉండాలని సూచించింది. ఈ రకమైన పెరుగుదల సాధిస్తే 2020 నాటికి స్థూల రాష్ట్రాదాయంలో రూ.5,40,000కోట్లు సేవారంగం నుంచే వస్తాయని విజన్ 2020 అంచనా వేసింది. ఈ లక్ష్యాలను సాధించాలంటే మొత్తంగా రూ.17,27,000కోట్లు పెట్టుబడులు పెట్టాలని కూడా ప్రకటించింది. ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడులు అవసరం గనుక ఈ సేవారంగంలోకి ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించక తప్పదని, తద్వారా మాత్రమే ప్రగతి అవకాశాలు సాధ్యమవుతాయని విజన్ 2020 రాసింది.

అంతకు ముందే 'ఆంధ్రప్రదేశ్-ఎజెండా ఫర్ ఎకనమిక్ రిఫార్మ్స్' లో రాసిన విషయాలనే విజన్ 2020 పునరుద్ఘాటించగా, విజన్ 2020లోని విషయాలను ఆ తర్వాతి బడ్జెట్ ప్రసంగాలు, శ్వేతపత్రాలు, ఇతర ప్రకటనలు ప్రతిధ్వనిస్తున్నాయి.

సేవారంగం మీద మన పాలకుల ఈ మితిమీరిన శ్రద్ధకు కారణం ప్రజలకు అవసరమైన సేవలను ఇంకా ఎక్కువగా అందించడం కాదు. నిజానికి ప్రజా జీవితాలను మెరుగుపరిచే ఎన్నో సంక్షేమ రంగాలను రద్దుచేసి, సంక్షేమ సేవల కేటాయింపులను కత్తిరించిన ప్రభుత్వం సేవారంగం అభివృద్ధి గురించి ఇంతగా మాట్లాడడం వెనుక అసలు కారణాలు వేరు. సేవారంగం అభివృద్ధి పేరిట రాష్ట్రంలో జరిగినదాని వల్ల రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదు.

వ్యాపారం, హోటళ్ళు, రెస్టారెంట్లు, రవాణా, నిలువ, సమాచార సంబంధాలు, బ్యాంకులు, భీమా, రియల్‌ఎస్టేట్, ప్రభుత్వపాలన, ఇతరసేవలను అర్థశాస్త్రం తృతీయ రంగమైన సేవారంగంలో భాగంగా గుర్తిస్తుంది. వీటిలో తక్షణలాభాలు విపరీతంగా ఉన్నప్పటికీ, అర్థశాస్త్ర పరిభాషలో ఇవి మౌలిక ఉత్పాదక రంగాలు కావు. సామాజిక ఉత్పత్తి పెరుగుదలకు మూలమైన ప్రాథమిక (వ్యవసాయం, అడవులు, చేపలు, గనులు-ప్రధానంగా ప్రకృతి ఆధారపనులు), ద్వితీయ (పరిశ్రమలు, నిర్మాణం, విద్యుచ్ఛక్తి, ఇంధనం, నీటి సరఫరా- ప్రధానంగా యంత్రాల మీద ఆధారపడే పనులు) రంగాల కన్నా భిన్నంగా తృతీయ రంగాన్ని పరిశీలించడం ఆనవాయితీ. మొదటి రెండు రంగాలలో పనిచేసే వ్యక్తులకు, మొత్తంగా సమాజానికి అవసరమైన సామూహిక, వ్యక్తిగత సేవలను అందించడం ఈ మూడోరంగం పని.

అయితే, అంతకంతకు ఎక్కువగా ఈ మూడోరంగంలో బహుళజాతి సంస్థల గుత్తాధిపత్యం పెరిగిపోతోంది. విపరీతమైన లాభాలు ఉండే ఈ రంగం మీద ఆధిపత్యం చెలాయిస్తున్న బహుళజాతి సంస్థలు మూడో ప్రపంచదేశాల ప్రజలకు అవసరం ఉన్నా లేకపోయినా తమ లాభాల కోసం తమ సేవలు అమ్మడం ప్రారంభించాయి. స్థానిక సేవాసంస్థలతో మిలాఖత్తు అయ్యో, తమ సొంత శాఖలను ఏర్పాటు చేసుకునో, ప్రభుత్వానికి తమ సేవలను అమ్మడం ద్వారానో ఈ బహుళజాతి సంస్థలు ఇబ్బడిముబ్బడిగా లాభాలు చేసుకుంటున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ఆర్థికవ్యవస్థను ప్రపంచీకరణ రథచక్రాలకు కట్టివేసిన తర్వాత సహజంగానే ఇక్కడ కూడా సేవారంగం మీద శ్రద్ధ పెరిగింది. పైన చెప్పినట్టు సేవారంగంలో ఏడు అంశాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళిక వేసుకుంది. ఈ ఏడు అంశాలలో కూడా పేరుపొందిన బహుళజాతి సంస్థలు రాష్ట్రంలో ప్రవేశించాయి. ప్రైవేటు, విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం ద్వారానే ఈ రంగాలలో ప్రగతి సాధ్యమని ప్రభుత్వం స్పష్టంగానే ప్రకటించింది.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ

ప్రభుత్వ సేవారంగ ప్రాధాన్యతలలో అగ్రభాగాన ఉన్నది ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ. ఈ రంగం ద్వారా ఉపాధికల్పనకూ, ఆర్థికఅభివృద్ధికీ, బ్రహ్మాండమైన అవకాశాలున్నాయనీ, ఆంధ్రప్రదేశ్ వాటిని అందుకోవలసి ఉన్నదనీ, చాలావరకు అందుకున్నదనీ ప్రభుత్వం అంటోంది. సాఫ్ట్‌వేర్ ఎగుమతులు, పెట్టుబడులు, ఉపాధికల్పన మూడు రంగాలలోనూ ఈ ఎనిమిది సంవత్సరాలలో ఘన విజయాలు సాధించామని ప్రభుత్వం చెప్పుకుంటోంది. ఈ ఎనిమిది సంవత్సరాలలో సాఫ్ట్‌వేర్ ఎగుమతులు రూ.60కోట్లు (1995-96) నుంచి రూ.3600కోట్ల(2002-03)కు పెరిగాయని, డెబ్బైవేల ఉద్యోగాలు కల్పించామని, రూ.3000కోట్ల (2002-03) పెట్టుబడులు రాష్ట్రంలోకి వచ్చాయని ప్రభుత్వం చెపుతోంది.

అంకెల్లో చూస్తే ఇది అభివృద్ధిగానే కనబడుతుంది. కాని అ అంకెల సారాంశంలోకి వెళ్లి పరిశీలిస్తే ఈ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అభివృద్ధి వల్ల రాష్ట్రానికి జరిగిన మేలు పెద్దగా ఏమీ లేదని తేటతెల్లమవుతుంది. రాష్ట్రంలో నుంచి సాఫ్ట్‌వేర్ ఎగుమతులు వందలరెట్లు పెరిగిన మాట నిజమే. కాని ఆ ఎగుమతుల ఆదాయమంతా కొన్ని బహుళజాతి సంస్థల చేతుల్లోకో, కొందరు పెట్టుబడిదారుల చేతుల్లోకో తప్ప రాష్ట్ర ఆర్థికవ్యవస్థకు వచ్చిందేమీ లేదు. ఎందుకుంటే ప్రభుత్వమే స్వయంగా ఈ రంగం అభివృద్ధి కోసం అదే పేరుతో వారికి పన్నుల రాయితీలిచ్చింది. మినహాయింపులు ఇచ్చింది. మామూలుగా ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయంపై రాష్ట్ర ప్రభుత్వానికి రావలసిన పన్నును కూడా ప్రభుత్వం వదిలేసుకుంది. ఇక ఉద్యోగ కల్పన రంగంలో చూపుతున్న అభివృద్ధి కూడా అంత గొప్పదేమీ కాదు. చూపుతున్న డెబ్బైవేల ఉద్యోగాల్లో స్థానికులెందరో ఏ నైపుణ్య స్థాయి కలవారికి ఉద్యోగాలొచ్చాయో, ప్రధానంగా ఏ వర్గాలకు ఉద్యోగాలందాయో విశ్లేషిస్తే గాని అసలు వాస్తవం బయటపడదు. అందులోను ముప్పై లక్షల మంది విద్యావంతులైన నిరుద్యోగులు ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజిల్లో నమోదు చేసుకుని ఉన్న నేపథ్యంలో పన్నెండు సంవత్సరాలుగా ఊదరగొట్టుకుంటూ అనేక రకాల సౌకర్యాలు రాయితీలు పొందుతూ నడుస్తున్న పరిశ్రమ డైబ్బైవేల ఉద్యోగాలు కల్పించడం గొప్ప విషయమేమీ కాదు. ఇక పెట్టుబడుల విషయానికి వస్తే ఇన్ని సంవత్సరాలుగా విస్తరిస్తున్న రంగంలో పెట్టుబడులు మూడు నాలుగువేల కోట్ల రూపాయల కన్నా ఎక్కువ లేకపోవడం ప్రచార్భాటానికి, వాస్తవానికి సంబంధం లేదని చూపుతున్నది.

పైగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగం వల్ల రాష్ట్ర ప్రజలకు, రాష్ట్ర ఖజానాకు చెప్పుకోదగిన మేలు ఏది జరగకపోగా ప్రభుత్వమే ప్రజాధనం నుంచి కొన్ని వేల కోట్ల రూపాయిలు ఈ రంగానికి వెచ్చించవలసివచ్చింది. వందల ఎకరాల భూమిని ఉచితంగానో తక్కువ ధరలకో అప్పగించడం ఆయా ప్రాంతాలకు రోడ్లు, త్రాగునీరు విద్యుత్‌శ్చక్తి సౌకర్యాలు కల్పించిపెట్టడం, విద్యుత్ ఛార్జీల్లో నీటి పన్నులు రాయితీలివ్వడం వంటివెన్నో రూపాలలో ఈ రంగానికి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం జరిగింది. **అంటే ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ రంగం అభివృద్ధి వల్ల రాష్ట్రానికి జరిగిన మేలుకన్నా రాష్ట్ర వనరుల వల్ల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగానికి జరిగిన మేలే ఎక్కువ.**

పర్యాటకరంగం

పర్యాటకరంగం విపరీతంగా డబ్బులు సంపాదిస్తుందని విదేశీమారకద్రవ్యాన్ని సంపాదిస్తుందని విస్తృతంగా ఉద్యోగ కల్పన సాధిస్తుందని ప్రభుత్వం చెబుతుంది. ఈ ఎనిమిది సంవత్సరాల్లో పర్యాటకరంగ అభివృద్ధి పేరు మీద ఎంపిక చేసిన స్థలాల అభివృద్ధికి ప్రచారానికి ఆర్భాటానికి వందలకోట్ల రూపాయలు ఖర్చు పెట్టింది. నిజానికి విజన్ 2020లో పర్యాటకరంగ అభివృద్ధికి ఆదర్శంగా చూపిన థాయ్‌లాండ్, మెక్సికో ఉదాహరణలు చాలా దుర్మార్గమైనవి. విపరీతమైన ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ రంగాన్ని అభివృద్ధి చేయాలని ముందే చెప్పుకున్న ప్రభుత్వం రాష్ట్రంలోని పాత పర్యాటక ప్రాంతాల మీద కొత్తగా రూపొందించిన పర్యాటక ప్రాంతాల మీద ప్రైవేటు రంగానికి గుత్తాధిపత్యం ఇచ్చింది. పదిలక్షల రూపాయిల ఖర్చుకు పర్యాటకరంగంలో 48ఉద్యోగాల కల్పన జరుగుతుందని చెప్పుకున్న ప్రభుత్వం ఈ అంకెలగారడీతో రెండురకాల మోసం చేసింది. మొదటిది ఈ 48ఉద్యోగాలు ఏ స్థాయి ఉద్యోగాలో మనుగడకు తగినంత ఆదాయాన్ని ఇవ్వగలవో లేదో ఎక్కడా మాట్లాడలేదు. రెండూ ఈ ఎనిమిది సంవత్సరాల్లో ఈ రంగంలో వెచ్చించిన వందల కోట్ల రూపాయలు ఈ చెప్పిన నిష్పత్తిలోనే ఉద్యోగాలు కల్పించాయో లేదో ఎక్కడా చెప్పడం లేదు.

వాస్తవం ఏమంటే ప్రైవేటురంగంలో పర్యాటకరంగం అభివృద్ధి అతి తక్కువ ఉద్యోగాలకు, విపరీతమైన లంచగొండితనానికి దారితీసింది. వేశ్యావ్యాపారం, మాఫియాల అభివృద్ధి, పర్యావరణ సమస్యలు వంటి ఇతర సమస్యలకు దారితీసింది.

చిన్నతరహా సేవలు

స్థానిక రవాణా, రెస్టారెంట్లు, దుకాణాలు, పర్యాటక సంస్థలు, ప్యాకేజింగ్, ప్రచురణ, శిరోజాలంకరణ, సౌందర్యపోషణ, వడ్రంగం, రజకసేవలు, స్థానిక ప్రకటనలు, ప్రోత్సాహక సంస్థలు వంటి అనేక చిన్న తరహా సేవలు సేవారంగాన్ని విస్తరిస్తాయని రాష్ట్ర స్థూల ఉత్పత్తికి దోహదంచేస్తాయని ప్రభుత్వం చెప్పుకుంది. వీటిలో సగం సేవలు ఏ ప్రభుత్వ విధానంతో సంబంధం లేకుండానే అంతకు ముందునుంచి ప్రజలకు అందుబాటులో ఉన్నవే. మిగిలిన సగం సేవలు ఈ రాష్ట్రంలోకి బహుళజాతి సంస్థల సరుకులను, సేవలను ప్రవేశపెట్టడానికి వారికి లాభాలు సమకూర్చిపెట్టడానికి ఉపయోగపడేవే తప్ప ప్రజల మేలుకోసం వస్తున్న సేవలేమి కావు.

లాజిష్టిక్స్

సరుకుల రవాణా మనుషుల ప్రయాణం మొదలైన అవసరాలకు ఒక మజిలీగా కేంద్రంగా ఉపయోగపడే సేవలను లాజిష్టిక్స్ అంటారు. ఆంధ్రప్రదేశ్‌ను లాజిష్టిక్స్ సేవాకేంద్రంగా అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రంలో ఉపాధికల్పనకు ఆదాయ సమీకరణకు వీలు కలుగుతుందని ప్రభుత్వం చెబుతుంది. రాష్ట్రానికి వెయ్యి కిలోమీటర్ల సముద్ర తీరమున్నందు వల్ల ఎన్నో ఓడరేవులను నిర్మించవచ్చునని హైదరాబాద్, విశాఖపట్నం విమానాశ్రయాలను అంతర్జాతీయ విమానాశ్రయాలుగా అభివృద్ధి చేయవచ్చునని రాష్ట్రమంతటా నాలుగు లైన్ల రహదారులు నిర్మించివచ్చునని ప్రభుత్వం అంటుంది. నిజానికి ఈ అన్నీ కార్యక్రమాలు రాష్ట్ర సంపదలను బహుళజాతి సంస్థల సంపన్నుల చేతులలో పెట్టు కార్యక్రమాలే తప్ప ప్రజలకు వీటివల్ల ఉపయోగం అంతంత మాత్రమే. ఈ పేరుతో కాకినాడ, కృష్ణపట్నం ఓడరేవు, గంగవరం ఓడరేవులను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం జరిగింది. కళింగపట్నం, బావనపాడు, ముత్యాలమ్మపాలెం, నరసాపురం, మచిలీపట్నం, నిజాంపట్నం, భీమునిపట్నం ఓడరేవులను ప్రైవేటీకరణకు సిద్ధంగా ఉంచారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణాన్ని ఒక ప్రైవేటు సంస్థకు అప్పగించి ఈ సంస్థ కోరినట్టుగా వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వడ్డీ లేకుండా అందజేశారు. బహుళజాతిసంస్థల సరుకులు మారుమూల పల్లెటూర్లకు కూడా ప్రవహించడానికి వీలుగా నాలుగులైన్ల, ఆరులైన్ల రహదారులు నిర్మించారు. దీన్నంతా అభివృద్ధిగా ప్రచారం చేస్తూ మధ్యతరగతిని భ్రమల్లో ముంచుతున్నారు. ఈ రోడ్ల వల్ల మధ్యతరగతి ప్రయాణసౌకర్యాలు ఏమాత్రమైనా మెరుగుపడ్డాయని అనుకున్నా అది ఒక కొసరే తప్ప అసలు మాత్రం బహుళజాతి సంస్థల ప్రయోజనాలే.

ఇతరసేవలు

విజన్ 2020లో ప్రాధాన్యత సేవలుగా చూసిన జ్ఞాన ఆధారిత సేవలు, విద్య-ఆరోగ్య రంగాలు కూడా ఉన్నాయి. విద్య, ఆరోగ్య రంగాల గురించి వివరంగా ప్రత్యేక వ్యాసాల అవసరం ఉంది గనుక ఇక్కడ ప్రస్తావించడం లేదు. జ్ఞాన ఆధారిత సేవలు అనే అంశంలో బయోటెక్నాలజీ వంటి వాటి ద్వారా ప్రభుత్వం కొన్ని వేల ఎకరాల భూమిని ఐసిఐసిఐ, షాపూర్జీ పల్లోంజి వంటి దేశంలోని బడా గుత్తా పెట్టుబడిదారీ సంస్థలకు అందచేసింది.

నిజంగా ప్రభుత్వం ప్రజలకు అందించవలసిన సేవలు ఎన్నో ఉన్నాయి. ప్రజలకు ఆ సేవలు అందడంలో ప్రభుత్వం సహకరించవలసిన రంగాలెన్నో ఉన్నాయి. విద్య, వైద్యం, ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, నీటిపారుదల, త్రాగునీరు, రక్షణ, రవాణా సంబంధాలు, సమాచార సంబంధాలు వంటి ఎన్నో రంగాలు ప్రజాధనం ఖర్చుపెట్టి ప్రభుత్వం పాల్గొనవలసిన రంగాలే. కాని క్రమక్రమంగా ఈ రంగాలన్నింటి నుంచి తప్పుకుంటున్న ప్రభుత్వం ఈ రంగాలన్నింటిని ప్రైవేటు లాభాపేక్షకు బలిచేస్తున్న ప్రభుత్వం తనకు సేవారంగం మీద ఎంతో ప్రేమ ఉన్నట్లు సేవారంగాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు నటించడం ఒక క్రూరమైన పరిహాసం. ○

(36వ పేజీ తరువాయి)

అంగడిలో సరుకైన విద్య

పెంచడానికి, డ్రాపవుట్స్‌ను తగ్గించడానికి విద్యావాలంటీర్లను ఉపయోగించడం జరుగుతుందని విజన్ 2020 డాక్యుమెంట్‌లో చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయంగా మాత్రమే కాకుండా, ఉపాధ్యాయులను తొలగించి కూడా విద్యావాలంటీర్లను నియమిస్తున్నది. విద్యను పరిశ్రమగా గుర్తిస్తామని చెప్పి ప్రైవేటీకరణను ప్రోత్సహించినందువలన సామాన్య ప్రజలకు విద్యావ్యయాన్ని భరించడం కష్టమవుతుందని, అలాంటి వారిని ఆదుకోవడానికి ఒక నిధిని ఏర్పాటు చేస్తానని చెప్పిన ప్రభుత్వం అలాంటి నిధి నేదీ ఇంతవరకు ఏర్పాటుచేయలేదు. పైగా వృత్తి విద్యల్లో, సాంకేతిక విద్యల్లో ఫ్రీసీట్లు కూడా లేకుండా పోయి, సామాన్య ప్రజలకు అలాంటి చదువులు గతంలో కంటే అందుబాటులో లేకుండా పోయాయి. కరిక్యులమ్ సంకుచితంగా ఉందని, మొక్కుబడిగా ఉందని, జీవితాలకు సంబంధం లేనిదిగా ఉందని, అనాసక్తిదాయకంగా ఉందని, ఈ పరిస్థితినంతా మార్చి స్థానిక పరిస్థితులకు సంబంధం ఉండేవిధంగా మార్చుతానని ప్రభుత్వం చెప్పింది కాని మార్కెట్ ప్రయోజనాలే కరిక్యులమ్ నిర్ణయానికి గీటురాళ్ళుగా మారాయి.

ఇలాంటి పరిస్థితుల్లో అందరికీ ఒకేరకమైన విద్య గాని, విద్యలో అందరికి సమానావకాశాలు గాని లభ్యం కావడం లేదు. గ్రామీణ ప్రాంతంలో ఎలాంటి వసతి సౌకర్యాలు లేని పాఠశాలలు ఒకవైపు ఉండగా సకల సౌకర్యాలతో మరొక వైపు ఇంటర్నేషనల్ స్కూళ్లు ఉన్నాయి. సమాజంలో గణనీయమైన సంఖ్యలో ఉన్నవారికి పాఠశాల విద్యను పొందడమే కష్టంగా ఉండగా, కొంతమంది సంపన్నులు మాత్రం డబ్బు సంపాదనకు వీలయ్యే ఖరీదైన విద్యలను పొందగలుగుతున్నారు. విద్యారంగంలో ఈనాడున్న అసమానతలు గతంలో ఎప్పుడూ ఉండి ఉండవు. దాదాపు నాలుగు దశాబ్దాల కిందటే డా.డి.ఎస్.కొఠారీ చెప్పిన కామన్ స్కూల్ విధానాన్ని అమలుచేయడం, విద్యారంగాన్నంతా ప్రభుత్వమే నిర్వహించడం, సమాజంలో లభ్యమవుతున్న మానవవనరులను, ప్రకృతి వనరులను సంపూర్ణంగా ఉపయోగించుకోగలిగిన ఉత్పత్తి విధానానికి పనికివచ్చే హేతుబద్ధమైన, శాస్త్రీయమైన విద్యావిధానాన్ని సాధించుకోవడం ఈనాడు ప్రజలముందున్న కర్తవ్యం. అప్పుడు సంపూర్ణ అక్షరాస్యత దాని నిజమైన అర్థంలో సాధ్యమవుతుంది. అప్పుడు విద్యావంతమైన, విజ్ఞానవంతమైన సమాజం సాధ్యమవుతుంది. ప్రభుత్వరంగంలోనే ప్రజలందరి అవసరాలు తీరేవిధంగా పాఠశాలలను, కళాశాలలను స్థాపించడానికి అవసరమైన నిధులను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించవలసిన అవసరం ఉంది. విద్యారంగానికి సంబంధించి ఇవాళ మన సమాజం ముందున్న లక్ష్యం, ముఖ్యంగా పాఠశాల విద్యకు సంబంధించి, కామన్ స్కూల్‌లో శాస్త్రీయ విద్యావిధానం అని గుర్తించవలసిన అవసరం ఉంది. ○

గ్రామీణ మహిళలు - డ్వాక్రా పథకం

-కాత్యాయని
సంపాదకులు, 'చూపు'

చంద్రబాబు ప్రభుత్వం తను సాధించిన అభివృద్ధి గురించి మాట్లాడినప్పుడల్లా ముందుగా ప్రదర్శించేది డ్వాక్రా సంఘాలనే. ఈ సంఘాల్లో మహిళలు కోట్లాదిరూపాయల ఉత్పత్తుల్ని తయారుచేసి మార్కెట్‌చేస్తున్నారనీ, నెలకు వేలాది రూపాయలు సంపాదిస్తున్నారనీ ప్రభుత్వం చెప్పుకుంటోంది. పేదరికాన్ని తరిమికొట్టినందుకు కర్నూలు జిల్లా కాల్వ గ్రామసర్పంచ్ ఫాతిమాబీకి ఐక్యరాజ్యసమితి అవార్డు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ పొదుపు పథకాలకు అంతర్జాతీయ ఖ్యాతి దక్కింది.

వీటిన్నిటితోబాటు తెలుగుదేశం ప్రభుత్వమూ, ముఖ్యమంత్రిగా చంద్రబాబూ సాధించిన ప్రయోజనాలూ చాలానే వున్నాయి. ప్రభుత్వం సంక్షేమ పథకాల రద్దుతో, ఆర్థిక సరళీకరణ విధానాలతో ప్రజలు ముందెన్నడూ లేనంతగా సమస్యల వలయంలో కూరుకుపోయారు. వ్యవసాయమూ, యితర గ్రామీణ వృత్తులూ పూర్తిగా దెబ్బతిన్నాయి. మహిళలు పోరాడి సాధించుకున్న మద్యనిషేధాన్ని ఎత్తివెయ్యటమే గాక, మద్యం అమ్మకాలపై టార్గెట్లు విధించి గ్రామాలను సారాతో ముంచెత్తుతోంది ప్రభుత్వం. ఇవన్నీ కలిసి గ్రామాల్లోని పేద మహిళల మీద మొయ్యలేని భారాన్ని మోపుతున్నాయి. వాళ్ళలో సహజంగానే ప్రభుత్వం మీద అసంతృప్తి పెరిగింది. ముఖ్యంగా మద్యనిషేధం ఎత్తివేత స్త్రీలను ఆగ్రహానికి గురిచేసింది. ఈ అసంతృప్తిని చల్లార్చి, జనాభాలో సగభాగమైన మహిళా ఓటర్లను కాపాడుకోవలసిన అవసరం ప్రభుత్వానికి గుర్తొచ్చింది. వెంటనే రకరకాల మహిళా పథకాలు ముందుకొచ్చాయి. వాటన్నిటిలోనూ బలమైనదీ, సమర్థవంతమైనదీ డ్వాక్రా పథకం.

ప్రజల పట్ల ప్రభుత్వం నెరవేర్చాల్సిన సంక్షేమ బాధ్యతల్ని వదులుకునే క్రమంలోనే, ప్రజల కష్టసుఖాలకు వాళ్ళనే బాధ్యుల్ని చేసే ప్రయత్నం మొదలైంది. దానికే 'ప్రజల భాగస్వామ్యం' అనే అందమైన పేరుపెట్టారు. కుటుంబ పోషణ భారంతో సతమతమవుతున్న స్త్రీల దృష్టిని పొదుపువైపు మరలిస్తూ డ్వాక్రా పథకం ప్రవేశపెట్టారు. ఇట్లా సమీకరించిన మహిళలతో ప్రభుత్వ కార్యక్రమాలన్నిటికీ వెట్టిచాకిరీ చేయించుకోవటంలో ప్రభుత్వం సఫలమయింది.

'డ్వాక్రా' అని సంక్షిప్తంగా పిలుస్తున్న యీ పథకం పూర్తి పేరు 'డెవలప్‌మెంట్ ఆఫ్ విమెన్ అండ్ చిల్డ్రన్ ఇన్ రూరల్ ఏరియాస్' (గ్రామీణ స్త్రీ, శిశు అభివృద్ధి పథకం). గ్రామీణ స్త్రీలను పొదుపు ప్రాతిపదికన ఐక్యం చెయ్యటం ద్వారా వారి అభివృద్ధిని సాధించవచ్చని యీ పథకకర్తల వుద్దేశ్యం. మొదట్లో యీ డ్వాక్రా పథకాన్ని సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నడిపారు. ఆ తర్వాత 1999లో గ్రామీణాభివృద్ధి సంస్థనూ ట్రెసమ్ వంటి పథకాలనూ కలిపి స్వర్ణజయంతి స్వరోజ్‌గార్‌యోజన పేరిట ఏర్పాటయింది. అప్పటినుంచి డ్వాక్రా కూడా స్వయం సహాయక బృందాల పథకంగా అందులోనే కొనసాగుతోంది.

మనరాష్ట్రంలో అమలవుతూవున్న ప్రపంచబ్యాంకు పథకాల్లో యీ స్వయం సహాయక బృందాల ఏర్పాటుకూడా ఒకటి. స్త్రీలను యిలాంటి బృందాల ద్వారా సంఘటితం చెయ్యడమే వాళ్ళ దారిద్ర్య నిర్మూలనకు మార్గమని యీ పథకం చెప్తుంది. స్త్రీల దృష్టినంతటిని వడ్డీ లెక్కల మీదా, అప్పుల లావాదేవీల మీదా వుండేలా చేస్తే, వాళ్ళ మౌలిక సమస్యల గురించి ఆందోళన చెయ్యకుండా నిరోధించవచ్చు. అలాగే ఆర్థిక సరళీకరణ విధానాల వల్ల గ్రామీణబ్యాంకులు దెబ్బతినిపోయాయి. గ్రామీణ ప్రజలు అవసరాలకు తక్కువ వడ్డీతో అప్పులిచ్చే బాధ్యత నుండి వెనక్కు తగ్గాయి. దానివల్ల గ్రామీణ ప్రజల్లో కలిగే వ్యతిరేకతను దారి మళ్ళించటానికి కూడా 'మైక్రోక్రెడిట్' విధానం పేరిట యీ పొదుపుసంఘాలు అవసరమయ్యాయి.

పేద ప్రజల్ని సమీకరించి, పొదుపు చేయించటం ద్వారా వాళ్ళ రుణ అవసరాలను వాళ్ళే తీర్చుకునేట్టుగా చెయ్యాలి. దాంతోబాటు ప్రభుత్వం నిర్వర్తించాల్సిన యితర విధుల్ని కూడా ఈ బృందాల చేతనే చేయించవచ్చునన్నది ఈ పథకంలో విధానం. ఈ పద్ధతి ద్వారా ప్రభుత్వం మీద ఆధారపడకుండా ప్రజలు అభివృద్ధి చెందుతారని ప్రపంచబ్యాంకు తీర్మానించింది. ఆ విధానం ప్రకారమే మన రాష్ట్రంలోనూ డ్వాక్రా మహిళలను పరిశుభ్రత, కుటుంబ నియంత్రణ, మధ్యాహ్న భోజన పథకం వంటి ప్రభుత్వ కార్యక్రమాలన్నిటికీ వుపయోగించుకుంటున్నారు. చంద్రబాబు దీన్ని మరింత సృజనాత్మకంగా విస్తరించాడు. నక్సలైట్లను తరిమికొట్టటానికీ, మహిళా ఉద్యమాల ఆందోళనల్లో ఆ కార్యకర్తల మీద దాడులు చేయించటానికీ, తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలకు జనాన్ని సమీకరించటానికీ కూడా వాడుకుంటున్నాడు.

ఇంత చాకిరీకి సిద్ధపడినా యీ పథకం ద్వారా స్త్రీల ఆర్థికపరిస్థితి మెరుగుపడిందా అన్నది ప్రశ్న. ఈ విషయంలోనూ ప్రభుత్వ ప్రచారాలకూ, వాస్తవాలకూ పొంతనలేని పరిస్థితులే వున్నాయి. ఈ పథకం ప్రకారం పేద మహిళలు 10-20 మంది చొప్పున గ్రూపులుగా ఏర్పడుతారు. వాళ్ళందరూ బ్యాంకులోనో, పోస్టల్‌సేవింగ్స్ అకౌంట్‌లోనో జమచేస్తూ వుండాలి. గ్రూపు ఏర్పడిన నెలరోజుల నుండీ సభ్యుల మధ్యన అప్పులివ్వటమూ, తీసుకోవటమూ మొదలవ్వాలి. ఆరునెలల తర్వాత బ్యాంకులోను పొందటానికి అర్హత ఏర్పడుతుంది. ఆరునెలల పాటు గ్రూపులు సక్రమంగా నడిస్తే ప్రభుత్వం రివాల్వింగ్ ఫండ్ రూపంలో గ్రాంటు మంజూరు చేస్తుంది. స్త్రీలు పొదుపు చేసిన డబ్బూ, యీ గ్రాంటూ కలిపి స్వయం ఉపాధికి ఏదో ఒక వృత్తిని సాగించాలి.

ఈ మొత్తం విధానంలో ప్రభుత్వం చెయ్యాల్సిన సహాయం కూడా సక్రమంగా అందించకపోవటంతో గ్రూపుల నిర్వహణ సాధ్యం కావటం లేదు. ఈ మహిళల్లో ఎక్కువమందికి చదువు కానీ, వృత్తి శిక్షణ కానీ లేకపోవటంతో వాళ్ళు తయారుచెయ్యగలిగే ఉత్పత్తులు పరిమితంగానే వుంటున్నాయి. సాంప్రదాయకంగా వస్తున్న విస్తళ్ళు, పచ్చళ్ళు, అప్పడాలు వంటి ఉత్పత్తులకే ఎక్కువ గ్రూపులు పరిమితమవుతున్నాయి. అంతకన్నా నైపుణ్యం గల పనుల్లో శిక్షణ యివ్వాల్సిన బాధ్యతను ప్రభుత్వం సరిగ్గా పట్టించుకోవటం లేదు. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా ఫ్యాషన్ టెక్నాలజీ, ఫినైల్, డిటర్జెంట్స్ లాంటి వృత్తుల్లో

శిక్షణనిచ్చారు. కానీ వాటి ఉత్పత్తికి అవసరమైనంత పెట్టుబడి లేకా, తయారైన వాటికి మార్కెటింగ్ సౌకర్యాలు లేకా ఆ ఉత్పత్తులూ ఆగిపోయాయి.

మహిళాగ్రూపులు ఎంతో కష్టపడి తయారుచేసిన వస్తువులకు మార్కెటింగ్ కల్పించటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యింది. ముఖ్యమంత్రి మాత్రం "ఇ-కామర్స్‌తో డ్వాక్రా విప్లవం" తెస్తానని ప్రగల్భాలు పలికాడు. క్రెడిట్ కార్డుల మీద జరిగే ఇ-కామర్స్‌లో విస్తళ్ళు, వెదురుబుట్టలూ అమ్ముకోవచ్చన్న హామీలు హాస్యాస్పదం. ప్రతి సంవత్సరమూ హైదరాబాద్‌లో ఏర్పాటయ్యే డ్వాక్రా బజారులో సైతం గ్రూపుల ఉత్పత్తులకు దొరికే చోటు చాలా తక్కువగానే వుంటోంది. బజారులో ఎక్కువ భాగం ఉత్పత్తులు బయటివాళ్ళవే అమ్ముకుంటున్నారు. **అంతకన్నా దారుణమైన విషయం డ్వాక్రా మహిళలను బహుళజాతి కంపెనీల ఉత్పత్తుల అమ్మకాలకు ఏజెంట్లుగా మార్చే ప్రయత్నాలు. ఒకవైపున గ్రామీణ ఉత్పత్తులనూ, మార్కెట్లనూ పూర్తిగా ధ్వంసం చేస్తూ, మరోవైపున బహుళజాతి ఉత్పత్తులను గ్రామీణ ప్రజలమీద బలవంతంగా రుద్దే ప్రయత్నాలు చేస్తున్నారు. హిందూస్థాన్ లీవర్ కంపెనీ ఉత్పత్తుల అమ్మకాల ఏజెంట్లుగా డ్వాక్రా మహిళలను సమీకరించేందుకు ప్రణాళికలు రూపొందాయి.**

ఇక ఈ పథకానికి ప్రభుత్వం అందించాల్సిన నిధులు కూడా సక్రమంగా అందటం లేదు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులయినా గ్రూపులకు పూర్తిగా అందటం లేదు. కొన్ని గ్రూపులకు అసలే నిధులివ్వటం లేదు. పథకం మొదలైన కొద్ది రోజుల వరకూ రూ.25,000 రివాల్వింగ్ ఫండ్ యిచ్చినా, క్రమంగా అది తగ్గిపోతూ వుంది. అంత తక్కువ మొత్తంలో ఉత్పత్తి ప్రారంభించటం సాధ్యంకాక గ్రూపులు మూలపడుతున్నాయి. గ్రూపు సభ్యుల ఆర్థిక స్థితిగతులను బట్టి, తిరిగి చెల్లించగలరన్న నమ్మకం కుదిరితేనే బ్యాంకులు నిధులివ్వటానికి సిద్ధపడుతున్నాయి. దాంతో పేద, దళిత వర్గాల స్త్రీలకు గ్రూపుల్లో కొనసాగటం అసాధ్యమవుతోంది. కుటుంబ నిర్వహణకే సదుపాయాలు లేని యీ స్త్రీలకు రోజుకొక రూపాయి కూడబెట్టటమూ వీటుకాని పనే. ఐనా యీ పథకంలో చేరితే భవిష్యత్తులోనయినా ప్రభుత్వం తమ కుటుంబాలకు సహాయం చేస్తుందన్న ఆశతో అతి కష్టం మీద కొనసాగుతున్న వాళ్ళు ఎందరోవున్నారు. **గ్రూపు మహిళలు దాచుకున్న డబ్బు మీద 3% వడ్డీ యిస్తున్న బ్యాంకులు, వాళ్ళకిచ్చిన అప్పుమీద మాత్రం 13% వరకూ వడ్డీ గుంజుతున్నారు. ఆవిధంగా పేదస్త్రీలు కడుపుకట్టుకుని దాచిన డబ్బును ప్రైవేటు పెట్టుబడిదారులకు అందిస్తున్నది ప్రభుత్వం.**

ఇటీవల డ్వాక్రా సమన్వయ కమిటీ జరిపిన నిజ నిర్ధారణ ఎన్నో వాస్తవాలను వెలుగులోకి తెచ్చింది. ఎంతో కొంత ఆర్థిక వెసలుబాటు కలిగిన స్త్రీలు మాత్రమే యీ పథకం ద్వారా లబ్ధిని పొందగలిగారు. గ్రూపు లీడర్లకూ, సభ్యులకూ మధ్యన ఎంతో అంతరం వుంది. అప్పులు వసూలు చేసే క్రమంలో వాళ్ళ మధ్యన ఘర్షణలు జరుగుతున్నాయి. పేద మహిళలకు లోన్లు మంజూరయినా, అవి కుటుంబ అవసరాలకే ఖర్చు పెట్టాల్సి వస్తోంది. నిత్యావసర వస్తువుల ధరలు అధికమవ్వటం, విద్యకూ, వైద్య సదుపాయాలకూ ఖర్చు చెయ్యాల్సిన మొత్తాలు పెరిగిపోవటంతో వాళ్ళ పొదుపు యిక్కడే ఖర్చయిపోతోంది. వీటికి తోడు కుటుంబంలోని పురుషులు గతంలో తీసుకున్న బ్యాంకు రుణాలకుగానూ, యీ మహిళలకు మంజూరయిన నిధులను బ్యాంకులు జమకట్టుకుంటున్నాయి.

ఇన్ని సమస్యల మధ్యన స్వయం సహాయక పథకాల పరిస్థితి నానాటికీ దిగజారిపోతూ వుంది. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం విద్యా, వైద్య, ఉపాధి సౌకర్యాలను కల్పించనంత వరకూ యీ పరిస్థితులు మారే అవకాశం కూడా వుండబోదు. డ్వాక్రా గ్రూపు మహిళలకు నిధులనూ, శిక్షణనూ యివ్వటంలోనూ మార్కెట్ కల్పించటంలోనూ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రవర్తిస్తే తప్ప యీ పథకాలు చెయ్యగలిగే మేలు ఏమీ వుండదు. పైగా నిరుపేద స్త్రీల మీద మొయ్యలేని భారంగానూ మిగులుతుంది. ○

ఒక మనవి

వీక్షణం (ఇటీవల వరకు ప్రజాపక్ష సమీక్ష) మీ ఆదరాభిమానాలతో రెండవ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న సందర్భంలో పాఠకులకు మా నమస్సుమాంజలులు. పత్రిక నడపాలంటే డబ్బు మూటలుండాలి లేదా ప్రకటనలుండాలి. ఈ రెండు లేకుండానే ఇరవైనాలుగు సంచికలు తీసుకురాగలిగామంటే అది మీ సహాయ సహకారాలు ఉండబట్టే. ఈ సంవత్సరానికి ముక్తాయింపుగా డిసెంబరు నెల రెండు సంచికలు కలిపి ఆంధ్రప్రదేశ్-అభివృద్ధి వాస్తవాలు అనే అంశం మీద ప్రత్యేక వ్యాస సంపుటిగా ఈ సంచికను మీ ముందుంచుతున్నాము. ఇలాంటి ప్రత్యేక సంచికలు మరిన్ని తీసుకురావాలని మా అభిలాష.

చందాదారులు మా ఈ చిన్ని ప్రయత్నానికి వారి మిత్రులతో విరివిగా చందాలు కట్టించడం ద్వారా తోడ్పాటు అందించాలని మా మనవి. ఈ విన్నపాన్ని గత రెండు సంచికలలో కూడా చేశాం. మీరు కట్టిన చందాగడువుకు మరికొన్ని సంచికలు అందాల్సివున్నా మీరు ఇప్పుడే వచ్చే సంవత్సరం చందాను చెల్లించి సహకరిస్తారని ఆశిస్తున్నాం. ఇది మా మరో మనవి. ఇంతవరకు పత్రికను తీసుకురావడంలో ప్రతి సంచికను రూపాయిన్నర నష్టంతో మీ కందజేస్తూ వచ్చాం. వైవిధ్యంతో కూడిన సమాచారాన్ని, విశ్లేషణను అందజేయాలనే ధ్యేయంతో ప్రారంభించి కొనసాగించాలని ఎంత కోరిక వున్నా ఇలా నష్టంతో నడపలేమని మీరూ అంగీకరిస్తారు. ఆ కారణంగా నూతన సంవత్సర చందాను రూ.140లకు పెంచాల్సి వచ్చింది. ఇంత చిన్న అదనపు బరువు భరించాలని కోరి మిమ్మల్ని చిన్నబుచ్చదలచుకోలేదు.

మీరు మీ మిత్రులు విరాళాలు, వ్యాసాలు పంపి మా కృషికి మీ చేయూతను కొనసాగించాలని అర్థిస్తున్నాం.

-సంపాదకులు

కరువు నివారణ: తాత్కాలిక చర్యల నుండి శాశ్వత పరిష్కారానికి....

- ప్రొఫెసర్ డి. నరసింహారెడ్డి

కరువు, దుర్భిక్షం అసాధారణ, సంక్లిష్ట సమస్యలు. ఈ పరిస్థితులు ఏర్పడటానికి ప్రకృతి వైపరీత్యాలే కాక మానవ ప్రమేయం కూడా తోడవుతున్నది. జలాలు ఆవిరైపోవడం, ఇంకిపోవడం వల్ల, దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వర్షాభావం, వర్షపాతం క్షీణించటం నీటికొరతకు ప్రధాన కారణమైనప్పటికీ అనేక మానవ తప్పిదాలు కూడా కరువు కాటకాలు తీవ్రమవ్వడానికి దోహదపడుతున్నాయి. అడవుల నిర్మూలన విస్తృతంగా కొనసాగుతూ ఉండటం, ఉపరితల జలవనరుల పట్ల నిర్లక్ష్యం, నీటి వినియోగం అధికంగా అవసరమయ్యే సాగుపద్ధతులు అవలంభించడం, భూగర్భ జలాలను మితిమీరి వినియోగించడం నదీ తీరాల నుండి, ముఖ్యంగా అతితక్కువ వర్షపాతం గల ప్రాంతాల నుండి కూడా ఇసుక తవ్వి తరలించడం వంటి చర్యలన్నీ కూడా దుర్భిక్షాన్ని పెంచే మానవ తప్పిదాలే!

దుర్భిక్షాలను మూడు విధాలుగా వర్గీకరించవచ్చు. అవి: వాతావరణ సంబంధమయినవి, వ్యవసాయ పరమైనవి, జల సంబంధమైనవి. ఇవన్నీ దుర్భిక్ష తీవ్రతకు ఏదో ఒక కారణమవుతుండగా నీటి కొరతవల్ల, వర్షాభావం వల్ల - సాగుభూములకు, బీడు భూములకు తేడా లేకుండా పోతోంది. అనేకరకాల దుర్భిక్షాలలో - సమాజంపై తీవ్ర ప్రభావం చూపేది - వ్యవసాయ దుర్భిక్షం.

తక్కువ వర్షపాతం గల ప్రాంతాలను ఇతర ప్రాంతాల నుండి వేరుచేసి చూడటానికి, ఇతర ప్రాంతాల కంటే కరువుకు ఎక్కువగా గురవుతున్న ప్రాంతాలను గుర్తించటానికి భారత వ్యవసాయ కమిషన్ (1972) ఒక సులభ మార్గాన్ని సూచించింది. ఆ కమిషన్ అభిప్రాయం ప్రకారం - సాధారణ వార్షిక వర్షపాతం 750మి.మీ., లేదా అంతకంటే తక్కువ - పరిశీలనలోకి తీసుకున్న సంవత్సరాలలో 20శాతం కాలంలో 25శాతం వర్షపాత లోటు ఉన్న జిల్లాలను కరువు జిల్లాలుగా గుర్తించాలి. అలా గుర్తించిన జిల్లాల నుండి 30శాతం వ్యవసాయ సాంద్రత గల వాటిని 'కరువు' ప్రాంతాల నుండి మినహాయించాలి. ఈవిధమైన వర్గీకరణలోకి చేరే జిల్లాలు దేశంలో 77 ఉన్నాయి.

1974లో నీటిపారుదల సౌకర్యాలు బాగా అభివృద్ధి చెందిన జిల్లాలను తొలగించి, వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన మరికొన్ని జిల్లాలను కలిపి, దేశంలో 74 జిల్లాలను కరువు జిల్లాలుగా ఖరారుచేశారు. 1976లో జాతీయ వ్యవసాయ కమిషన్ మరికొన్ని మార్పులు చేసింది. వర్షపాతం తక్కువ గల మరికొన్ని జిల్లాలను కలిపి మొత్తం 96జిల్లాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించింది. 1994లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకి చెందిన సాంకేతిక కమిటీ దేశం మొత్తాన్ని ఆరు వాతావరణ ప్రాంతాలుగా విభజించింది. ఆ ప్రాంతాలలోని నీటి పారుదల సౌకర్యాల స్థాయిని బట్టి కొన్ని ప్రాంతాలకు - కరువు ప్రాంత కార్యక్రమాలు (డిపిఎపి), ఎడారి ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమా(డిడిపి)లలోకి చేర్చడమో, లేదా తొలగించడమో చేసింది. ప్రస్తుతం కరవు ప్రాంతాల కార్యక్రమం (డిపిఎపి)లో - 16 రాష్ట్రాలలో - 180 జిల్లాలలోని 961 బ్లాకులు ఉన్నాయి. అనావృష్టి ప్రాంతాల కార్యక్రమాల నిర్వహణకు నీటిపారుదల కమిషన్ (1972) వర్గీకరణలే ప్రస్తుతం పునాదిగా ఉన్నాయి. ఈ వర్గీకరణ ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు జిల్లాలను అనావృష్టి ప్రాంతాలుగా గుర్తించారు. ఆ తర్వాత రంగారెడ్డి జిల్లాను కూడా వీటికి కలిపారు. 1995-96లలో మరో మూడు జిల్లాలను కూడా చేర్చారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో డిపిఎపి కార్యక్రమాలు అమలు జరిగే అనావృష్టి జిల్లాలు పదకొండు. తర్వాత మరో జిల్లాను కూడా అనావృష్టి ప్రాంతంగా గుర్తించి అక్కడ 'ఎడారి ప్రాంత అభివృద్ధి కార్యక్రమం (అనంతపురం జిల్లాలో డి.డి.పి.) అమలు జరుపుతున్నారు.

'కరువు'ని నిర్వచించేందుకు చూపుతున్న శ్రద్ధ, కరువు ప్రాంతాల వర్గీకరణ- **తరచూ పొరపాటు అభిప్రాయం కల్పించడానికి కారణమవుతున్నాయి. 'కరువు' అనేది కేవలం అనావృష్టి ప్రాంతాలకే పరిమితం అనే అభిప్రాయం ఏర్పడుతున్నది. రుతుపవనాల వైఫల్యం,** వర్షపాతం కొరవడటం వంటి సమస్యల వల్ల - అనావృష్టి ప్రాంతాలుగా గుర్తించిన పరిధిని దాటి 'కరువు' విస్తరిస్తున్నది.

వ్యవసాయ వాతావరణాలను బట్టి ఆంధ్రప్రదేశ్‌లో 'అనావృష్టి ప్రాంతాలు'గా వర్గీకరించిన ప్రాంతాలను దాటి 'కరువు' పరిస్థితులు భౌగోళికంగా 30 నుండి 40శాతం దాకా ఇంకా విస్తరిస్తున్నాయి. అనావృష్టి పరిస్థితులు 12 జిల్లాలకు వ్యాపించాయి. అనావృష్టి విస్తరించినప్పుడు వర్షాభావ పరిస్థితులు - అనావృష్టి ప్రాంతాల పరిధిని దాటి వ్యాపిస్తాయి. ఆవిధంగా, 'కరువు' అనావృష్టి ప్రాంతాలుగా గుర్తించిన జిల్లాలను దాటి చాలా ఎక్కువ ప్రాంతాలకు వ్యాపిస్తూ ఉంటుంది.

ఉదాహరణకి - 2002-03లో మొత్తం 1127 మండలాలలో 1041 మండలాలను మాత్రమే 'కరువు మండలాలు'గా ప్రకటించడం జరిగింది. ఒక ప్రాంతాన్ని 'అనావృష్టి ప్రాంతం'గా గుర్తించడంతో నిమిత్తం లేకుండా - వర్షపాత వైఫల్యాన్ని బట్టి, నీటి కొరతకు గల ఇతర కారణాలను బట్టి 'కరువు ప్రాంతం'గా ప్రకటించడం జరుగుతుంది. 'కరువు' అంటే సార్వత్రిక నిర్వచనం అంటూ ఏదీ లేదని చెప్పవచ్చు - అని ఇటీవలే కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ వ్యాఖ్యానించింది. రుతుపవనాల వైఫల్యం పంటల వైఫల్యానికి, మంచినీటి కొరతకు దారితీస్తుంది. పట్టణ, గ్రామీణ సమాజాలకు ఈ పరిస్థితి అనేక కష్టాలను తెచ్చిపెడుతుంది. భారతప్రభుత్వం 'కరువు'ను ప్రకటించడానికి శాస్త్రీయ

ప్రమాణాలను పాటించడం లేదు. ఆయా రాష్ట్రాలను గాని లేదా ఒక రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలను గాని కరువు ప్రాంతాలుగా ప్రకటించి పరిహార నిబంధనలు లేదా అటువంటి ఇతర నిబంధనల కింద సహాయ కార్యక్రమాలు చేపట్టే అవకాశం కేవలం రాష్ట్ర ప్రభుత్వాలకు మాత్రమే ఉంటుంది. ఫలితంగా ఎలాంటి శాసనాధికారాలు లేని తాత్కాలిక చర్యలే కొనసాగుతున్నాయి. వలసవాద కాలంలో ఎదుర్కొన్న కరువు పరిస్థితుల అనుభవంతో రూపొందించిన 1950ల నాటి కరువు నిబంధన (ఫిమైన్ కోడ్)లే రాష్ట్ర ప్రభుత్వాలు 'కరువు' ప్రకటించడానికి, సహాయక చర్యలు చేపట్టడానికి మార్గదర్శకాలుగా ఉపయోగపడుతున్నాయి. 'ఫిమైన్ కోడ్ 1950' ప్రకారం కరువు ప్రాంతాలను ప్రకటించే విధానంలో - వర్షపాతాల వైఫల్యం, గ్రామీణ పరపతి కుదింపు, చిల్లర నేరాలు పెరగడం, ప్రజలు ఉపాధి కోసం వలసలు పోవడం, పశుగ్రాసం కోసం పశువుల మందలు తరలిపోవడం, ఆహారపదార్థాల ధరలు పెరిగిపోవడం, అసాధారణ నిరుద్యోగం, రైతులు తమ విలువైన ఆస్తులను తెగనమ్ముకోవాల్సి రావడం మొదలైన సూచనలను పరిగణనలోకి తీసుకుంటారు. కరువు అనంతర కాలంలో పంటల నష్టాన్ని కూడా దుర్భిక్ష కారణంగా పరిగణించడం జరుగుతోంది. కరువు ప్రాంతాలుగా ప్రకటించడానికి ప్రస్తుతం ఈ దిగువ అంశాలను ప్రమాణాలుగా తీసుకుంటున్నారు.

1. వర్షపాతం గణనీయంగా పడిపోవడం.
2. సాగుభూములు బీడువారి పంటలకు నష్టం ఏర్పడటం.
3. పంటల దిగుబడిలో అంచనాలు విఫలం కావడం.
4. ధాన్యం, పశుగ్రాసాల సరఫరాలో వైఫల్యం, వాటి ధరల పెరుగుదల.
5. వ్యవసాయ - వ్యవసాయేతర కూలిరేట్లు పడిపోవడం.
6. నిరుద్యోగం పెరిగిపోవడం.
7. ఉపాధిని వెతుక్కుంటూ ప్రజలు వలసలు పోవడం.

సాగుభూముల్లో 30% నుండి 40% బీడువారినట్లు గుర్తించినా, కరువు పరిస్థితులు ప్రతి మూడు సంవత్సరాలకూ ఒకసారి సంభవిస్తున్నా 'కరువు' సహాయం కేవలం తాత్కాలిక చర్యలుగానే మిగిలిపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కరువును ఎదుర్కోవడానికి సంస్థాగత ఏర్పాట్లు చేసే సమగ్ర విధానం ఈనాటికి కూడా లేకపోవడం విషాదకరం. ప్రతిసారీ సంబంధిత జిల్లా కలెక్టర్ కరువు పరిస్థితుల్ని అంచనావేయాలి. ఆ నివేదికలను రాష్ట్ర సహాయ పునరావాస కమిషనర్‌కు పంపాలి. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో 'కరువు' ప్రాంతాలను ప్రకటించడం జరగాలి. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వాన్ని కరువు సహాయం కోరాలి. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఏర్పడే ఒత్తిడిని బట్టి కేంద్ర ప్రభుత్వం నిపుణుల బృందాలను పంపుతుంది. ఆ పరిశీలక బృందాలు పరిస్థితులను పరిశీలించి, ఎంత ఆర్థిక సహాయం సమకూర్చాలో కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తాయి. కరువు ఏర్పడిన ప్రతిసారీ ఇదే పరిస్థితి ప్రతి రాష్ట్రంలో పునరావృతమవుతూనే ఉంటుంది.

దుర్భిక్ష ప్రాంతాలను గుర్తించే సాంకేతిక ప్రక్రియ రెండు కార్యక్రమాలతో ముగుస్తుంది. అవి: దుర్భిక్ష ప్రాంతాల కార్యక్రమాలు (డిపిఎపి), ఎడారి ప్రాంత అభివృద్ధి కార్యక్రమాలు (డిడిపి). వీటినే కరువు నివారణ లేదా కరువు ఉపశమన కార్యక్రమాలుగా అమలుపరుస్తున్నారు. కరువు ఉపశమన శాశ్వత కార్యక్రమాలతో ఎలాంటి సంబంధం లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కరువు ప్రాంతాలను ప్రకటించడానికి వినియోగించే ప్రమాణాలే దుర్భిక్షం ప్రేరేపించే దుస్థితిని ఎదుర్కోవడానికి ఆధారమవుతున్నాయి. కరువు నివారణకు శాశ్వత పథకాలు, కరువు ఉపశమన తాత్కాలిక చర్యలు ఎలాంటి సంబంధం లేకుండా సమానాంతరంగా కొనసాగుతున్నాయి. కరువు ఉపశమన చర్యల సమర్థత గురించి, పరిమాణం గురించి తీవ్ర విమర్శలున్నాయి. మనదేశంలో చేపట్టిన కరువు నివారణ పథకాలన్నింటినీ ఇతరదేశాల అనుభవంతోటి పోల్చి పరీక్షించి చూసుకోవలసిన అవసరం ఉన్నది.

ఆంధ్రప్రదేశ్‌లో కరువు నివారణ

కరువు ఉపశమన నిర్వాహణ యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వమే అయినందువల్ల ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్యక్రమాల అమలుతీరును ప్రభుత్వపరంగానే పరిశీలించాలి. రాష్ట్రంలో కరువు పరిస్థితులు దాదాపు రెండు దశాబ్దాలుగా నెలకొంటూనే ఉన్నాయి. రెండు లేదా అంతకంటే ఎక్కువ పంటలు నష్టపోవడం కొనసాగినప్పుడు చిన్న కమతాల రైతులు, భూమి లేని వ్యవసాయ కార్మికులు, చేతి వృత్తులవారు - ఆహారధాన్యాల నిల్వలు లేక రోజుకూలిపైనే ఆధారపడవలసి వస్తుంది. అలాంటి పరిస్థితుల్లో వారు రోజువారీ ఆహారం కొనుగోలు చేసుకోవడానికి సహాయం అందించాల్సిన వత్తిడి ఏర్పడుతుంది. కరువు కొనసాగితే ఈ పరిస్థితులు ఇంకా విషమిస్తాయి. పెద్ద భూస్వాములు తమకోసం నిల్వచేసుకున్న ధాన్యాలు కూడా క్రమంగా నిండుకుంటాయి. ధాన్యం వర్తకులు మార్కెట్ల నుండి తమ ధాన్యం వాపసు తీసుకుంటారు. ధరలు విపరీతంగా పెరిగిపోతాయి. ప్రైవేటు దాతృత్వం క్షీణిస్తుంది. కరువు తీవ్రత సంపన్నులకు తప్ప అందరినీ ఎదుర్కొంటుంది' అనిఫిమైన్ కోడ్‌ను ప్రస్తావిస్తూ కరువుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ (సహాయ) రెవిన్యూ శాఖ 1981, ఆ తర్వాత 1995లో పునరుద్ధరించిన - కరువుపై హ్యాండ్‌బుక్‌లో పేర్కొన్నది. కాని, ఇలాంటి దుస్థితి ప్రస్తుతం లేదని చెప్పేందుకు ఈ హ్యాండ్‌బుక్ తాపత్రయ పడింది. "ప్రస్తుత పరిస్థితులు చాలా మారాయి. ప్రధాన నదులన్నింటి నుండి నీటిపారుదల సౌకర్యాలు విస్తృతంగా అభివృద్ధి చెందాయి. భూగర్భ జలాలను అపారంగా వినియోగించడం జరుగుతోంది. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంభించడం జరుగుతోంది. హరిత విప్లవం, సమాచార సౌకర్యాల అభివృద్ధి రాష్ట్రంలో ఉత్పత్తి - ఆహార సరఫరా విషయాల్లో సానుకూల వాతావరణాన్ని కల్పించాయి. ఏ ప్రదేశాన్నయినా దుర్భిక్ష ప్రాంతంగా ప్రకటించాల్సిన సమస్య ఉత్పన్నమే కాదు" (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. 1995. పే. 1) ఆహార కొరత, పనికోసం లేదా ఆహారం కోసం మానవులకు ఎదురయ్యే దుస్థితి వల్ల మాత్రమే కరువు ఏర్పడినట్లవుతుందని ఈ హ్యాండ్‌బుక్

పేర్కొంటున్నది. కాని 2002-03లో ఏర్పడిన ప్రస్తుత కరువు ఇటీవలి దశాబ్దాలలోనే ఎంతో తీవ్రమైనదని ప్రతి ఒక్కరికీ బోధపడుతూనే ఉన్నది. 2002-03 సంవత్సరాన్ని అఖిల భారత దుర్భిక్ష సంవత్సరంగా భారత మెట్రో లాజికల్ శాఖ ప్రకటించింది కూడా! ఆ సంస్థ లెక్కల ప్రకారం వర్షపాతం లోటు 10% పైగా ఉండగా, 20శాతం ప్రాంతం అందుకు గురయ్యింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకారం వర్షపాతం కొరత 25శాతానికి పైగా ఉండగా 80శాతం ప్రజలు అందుకు గురయ్యారు. 1127 మండలాలలో 22 జిల్లాలలోని 1087 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించడం జరిగింది. ఏప్రిల్ 2002 నుండి మార్చి 2003లోగా 250 మంది రైతులు కరువు కారణంగా ఆత్మహత్యలు చేసుకున్నారు. దుర్భిక్ష ప్రాంతాల నుండి లక్షలాది ప్రజలు పనుల కోసం వలసలు పోయారు. ఆకలిచావులు పెరిగాయి. వేసవికారణంగా ఈ మరణాలు సంభవించినట్టుగా ప్రభుత్వం చిత్రీకరించింది. 1400 మృతుల జాబితాను ప్రకటించింది. ఈ మరణాలన్నీ వడదెబ్బ వల్లే జరిగాయని వివరించింది. ఈ సందర్భంగా సహాయక చర్యల్లో భాగంగా చేపట్టిన పనికి ఆహారం పథకం అనేక ఆరోపణలకు గురై అపహాస్యం పాలైంది.

అధికార పార్టీకి కరువు అంటే ఎందుకు అంత ప్రేమో విశదపరిచే నికృష్ట ఉదంతం ఇది. సహాయచర్యలు చేపట్టడంలో రాష్ట్రప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యింది.

కరువు నివారణలో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభానికి కారణం రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతించిన విచక్షణాధికారాలే! 'కరువు' ప్రకటించడం జరిగితే అక్కడ - తమ హ్యాండ్ బుక్‌లో తామే ప్రకటించిన సహాయచర్యల్ని అమలు జరపవలసి వస్తుంది. ఆ హ్యాండ్ బుక్‌లో పేర్కొన్న కరువు సహాయ చర్యల ప్రకారం - ప్రజలకి మంచినీరు, పశువులకు గ్రాసం, మందులు, పశువైద్య శిబిరాలు, ఆరోగ్య సంరక్షణ, నిత్యావసర వస్తువుల సరఫరా చేపట్టాలి. కరువుపీడిత ప్రాంతాలకు ఈ సహాయాన్ని అందించడం రాష్ట్ర ప్రభుత్వ విధి. అయితే ఇలాంటి కరువు సహాయ చర్యలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం నిరాకరిస్తూనే - కేంద్ర ప్రభుత్వ గ్రాంట్‌లు పొందేందుకు మాత్రం పరిమితమవుతోంది. ఫలితంగా సహాయచర్యలు చేపట్టడంలో అన్ని విధాలుగా విఫలమవుతున్నది.

కరువు నివారణకు సమగ్ర విధానం

భారత్ వంటి దేశాల జనాభాలో మూడింట రెండు వంతుల మంది ఇంకా వ్యవసాయం మీదనే ఆధారపడుతున్నారు. వారిలో ఒక వంతు కరువుల బారినపడుతున్న ప్రాంతాలలో ఉన్నారు. వారిలో అత్యధికులు చిన్నరైతులు. అంతకంటే అత్యధిక సంఖ్యలో భూమిలేని వ్యవసాయ కార్మికులు, వ్యవసాయంపైనే ఆధారపడ్డ ఇతరులు ఉన్నారు. కరువు నివారణ కోసం శాసనపరంగా ఏర్పాటు చేసిన సంస్థల ద్వారా శాశ్వత - తాత్కాలిక ఉపశమన చర్యలు చేపట్టవలసిన అవసరం ఉన్నది.

వ్యవసాయ పద్ధతులు తీవ్రమార్పులకు గురవుతున్నాయి. భారత రైతులు ఇంకా ఎంతో కాలం సాంప్రదాయ పద్ధతులనే పట్టుకొని వేళాడటం సాధ్యం కాదు. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే విలువైన లేదా అధిక ఉత్పత్తులు ఇచ్చే హైబ్రీడ్ - వ్యాపార పంటలు పట్ల మొగ్గుచూపే ధోరణి పేదరైతుల్లో కనిపిస్తోంది. పెరుగుతున్న వారి ఆశలకు అనుగుణంగా ఎలాంటి వ్యవస్థాగత సహకారం లభించడం లేదు. కరువుకు తగిన పంటల విధానాన్ని చేపట్టడం ఒక్కటే సరిపోదు. మారుతున్న పంటల విధానంలో మెట్టప్రాంతాల రైతులు సాధారణ వ్యవసాయ తరుణాల్లో కూడా ప్రమాదాలకు గురవుతుంటారు. తరచుగా సంభవించే కరువుల వల్ల అయ్యే సామాజిక వ్యయం - చిన్న, అణగారిన రైతాంగం మీదనే పడుతోంది. ఈ పరిస్థితి వారిని అప్పుల పాలుచేసి ఆత్మహత్యల వైపు నెట్టడంలో ఆశ్చర్యం లేదు.

కరువు ప్రాంత వ్యవసాయంలో సామాజిక సంక్లిష్టతలు పెరుగుతున్న నేపథ్యంలో కరువు నివారణ పట్ల సమగ్ర విధానాలను అనుసరించ వలసిన అవసరం ఉన్నది. విచిత్రం ఏమిటంటే శాశ్వత ఉపశమన చర్యలు - తాత్కాలిక సహాయాలకి కావలసినంత సాంకేతిక పరిజ్ఞానం కూడా మనకు అందుబాటులోనే ఉండటం! దీర్ఘకాల ఉపశమనానికి భూమిలో తేమ సంరక్షణకు, దుర్భిక్ష నివారణకు వాటర్‌షెడ్ నిర్వాహణ పద్ధతులు, ఉపరితల జలాలను భూగర్భ జలాలతో పాటు వినియోగించడం, నీటి వినియోగం తక్కువగా ఉండు పంటలను సాగు చేయడం, కరువు ఎదుర్కొనే పరిజ్ఞానం మొదలయిన వన్నీ అందుబాటులోనే ఉన్నాయి. వర్షపాతాన్ని కరువు సూచనలను ముందే గ్రహించేందుకు మనకు ఉన్న సాంకేతిక పరిజ్ఞానం సహాయపడుతుంది. సమాచార సంబంధాల వ్యవస్థ ద్వారా ఉపశమన, భీమా సహాయాలను సమర్థవంతంగా నిర్వహించవచ్చు. అయితే భారతదేశంలో కరువు నివారణ వ్యవస్థలో లోపించిన అంశం ఏమిటంటే - పటిష్ట విధానాలు - జవాబుదారీతనం వహించే సంస్థాగత యంత్రాంగం! కేంద్ర, రాష్ట్ర, స్థానిక స్థాయిల్లో ప్రధాన బాధ్యత వహించే ప్రభుత్వ యంత్రాంగం ఏర్పడటం తక్షణావసరం. కరువు నివారణకు ఒక జాతీయ కమిషన్‌ను ఏర్పరచటం ద్వారా అలాంటి విధానానికి రూపకల్పన జరగాలి!

(సంక్షిప్త స్వేచ్ఛానువాదం)

వీక్షణం చందాదారులు కాగోరువారు 'సమతా పబ్లికేషన్స్' పేర రూ.120/-లను డి.డి.గా కింది అడ్రసుకు పంపించగలరు.

వి.హనుమంతరావు, ఇం.నెం. 8-3-898/22, రోడ్ నెం. 3, నాగార్జుననగర్, హైదరాబాద్ - 500 073.

Owned, Printed and Published by **V.Hanumantha Rao** at D.No. 8-3-898/22, Road No. 3, Nagarjuna Nagar, Hyderabad-500 073. Ph: 23748672
Designed & Printed at: Nutan Art Printers, Lakdi-ka-pool, Hyderabad. **Editor** : V.Hanumantha Rao



వీక్షణం పాఠక మిత్రులకు,
శ్రేయోభిలాషులకు
నూతన సంవత్సర శుభాకాంక్షలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో

మీ విమర్శ, సమీక్ష, పరిశీలనకు

సంబంధించిన ఆలోచనలకు

వీక్షణం

సామాజిక, ఆర్థిక పక్షపత్రికను

వేదికగా మలచుకోండి.

